ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక




వెల
4 అణాలు

ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY

సంపుటము 42 సంచిక 13
నవంబరు 23 1949

★ అమెరికానుంచి లండన్ మీదుగా ఇండియాకు పండిత నెహ్రూ రాక ★



లండన్ బయలుదేరడానికిముందు, న్యూయార్కులో విద్యార్థులు ప్రసంగం చేస్తున్న పండిట్ నెహ్రూ.



అమెరికానుంచి లండన్ వచ్చాక, ఇండియా లీగ్ వారి సన్మానం అందుకొన్న పండిట్ నెహ్రూ.



ఇంగ్లండులో, మన హైకమిషనర్, వి. కె. కృష్ణమీనన్‌తో నెహ్రూ.



లండన్ మేయర్ సర్ ఫ్రెడరిక్ హోలెండ్ చేసిన విందులో నెహ్రూకు స్వాగతము.



ఈ 15న న్యూఢిల్లీకితిరిగివస్తూ నెహ్రూ పాలం విమానాశ్రయంవద్ద సైనికాభివందనాలు స్వీకరిస్తున్నారు



అట్లీ దంపతులతో విందారగించి వస్తున్న పండిత నెహ్రూ *

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0
ప్రతిక అణాలు 0-4-0


ప్రతి బుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్ (మహాభారతము)

సంపుటము **42**
సంచిక **13**


Founder : K. NAGESWARA RAO

విరోధి సంవత్సర మార్గశిర శుద్ధ చవితి బుధవారము



'మైలాపూరు కపాలీశ్వరాలయము'

ఛాయాచిత్రకారుడు: ఆస్. నటరాజన్, మద్రాసు.



ఆంధ్రపత్రిక

1949-వ సం॥ నవంబరునెల 23-వ తేది బుధవారము

ఆంధ్రరాష్ట్ర 'రాజధాని'

ఆంధ్రరాష్ట్రము ఇక శరవేగముతో రానున్నది. 1950 సం॥ జనవరి 26 లోపున ఏర్పడవలసియున్నది. కాబట్టి అంతకు చాలాముందే గవర్నరుజనరల్ ఆర్డరు ఇన్‌కౌన్సిలు జారీకావలసియున్నది. బుధవారము కాంగ్రెసు కార్యవర్గతీర్మానము వెలువడిన వెంటనే కార్యదర్శి కళా వెంకటరావుగారు ఆర్డర్ ఇన్ కౌన్సిలు దాదాపు కొన్ని వారములలో రావచ్చు ననిరి. మద్రాసురాజకీయవర్గములు ఒకవారములోనే రావచ్చు నని భావించుచున్నారు.

మరీ వారమురోజులలో కాకపోయినా త్వరలోనే ఆర్డర్ ఇన్‌కౌన్సిలు రాకతప్పదు. ఆంధ్రప్రాంతము విభజింపబడి, రాష్ట్రముగా ఏర్పడకతప్పదు. ఆ విషయమై ఇక ఆందోళనలు, విన్నపములు అనవసరము. మిగిలిన అంశముల మీదనే దృష్టిని కేంద్రీకరించుట అవసరము.

ఆర్థికమంత్రి శ్రీ గోపాలరెడ్డిగారు చెప్పినట్లు "రాష్ట్ర నిర్మాణమునకు పూర్వమెంతో తతంగము జరుగవలసిఉన్నది. తొందరపడక స్థిమితముగా ఈ వ్యవహారము జరుగవలసి యున్నది." గోపాలరెడ్డిగారు చెప్పినది ఆవేశోత్సాహరహితమైనదిగా కనుపడవచ్చును. కాని అందరు జాగ్రత్తగ గమనింపవలసిన విషయము. విభజన అనునది ఆదరాబాదరగా జరుగుట ఏమాత్రము శ్రేయస్కరము కాదు. విభజనతోపాటు అనేకవిషయములు తేలవలసియున్నవి. అర్థాంతరముగా విభజన జరుగుటతో పాకిస్తానుతో తరువాత ఎన్నిచిక్కులు ఏర్పడినవో అందరికీ తెలిసిన విషయము. విభజన అనునది బహు తేలిక. కాని దానితోబాటు జరుగవలసిన పంపకములు అనేకమున్నవి. ఆస్తులు, అప్పుల పంపకము జరుగవలసియున్నది. ఉద్యోగులను పంచుకోటము జరుగవలసియున్నది. దాదాపు అంతా కొత్తసంసారము కాబట్టి "విభజన అవటం ఎల్లాగూ నిశ్చయింపబడినది. కాబట్టి ఎంత శీఘ్రంగా విభజన జరిగితే అంత మంచిదే" అను మాటలు కట్టిపెట్టి విభజనతోపాటు జరుగవలసిన ఇతర తతంగమునుగురించి ఆలోచించుట అవసరము. ఇక విభజన జరుగదని అనుమానము లేదుకదా? 1950 జనవరి 26 కు ఎలాగు ఆంధ్రరాష్ట్రము వ్యవహారములో నుండగలదు. ఈలోపున ఇంకనూ ఆందోళన ఎందుకు?

మదరాసును వదలు విషయమున కూడ కొందరు అనవసరతొందరపాటును ప్రదర్శించుచున్నారు. "మద్రాసు మనది కాదని తెలిసినాక కూడ ఆంధ్రప్రభుత్వం మద్రాసులోనే వుండడం అంత సవ్యం గాదు" అని గా॥ నీలం సంజీవరెడ్డిగారు సూచించిరి. మొన్న, మొన్నటివరకు గా॥ సంజీవరెడ్డిగారు మద్రాసు రాజధాని గాని ఆంధ్రరాష్ట్రం అక్కర లేదనిరి. ఇపుడు వారే ఇంత తొందరగ మద్రాసునుండి ఎంత శీఘ్రముగా వెడలిపోయిన అందరికీ మంచి దనుట ఆశ్చర్యముగ కనుపడకమానదు. ఇంత తొందరకు కారణ మేమో బోధపడ లేదు. మద్రాసు ఆంధ్రరాష్ట్రంలో చేర దను మాట తేలినదిగాని, అది ఫలానివారికి చెందనున్నదని స్థిరపడ లేదుకదా? అయినా అది ప్రత్యేకరాష్ట్రముగా ఏర్పడవలె నని సూచించినపుడు ముందు దానిని వదలిపోవుటలో ఔచిత్యము కనుపడదు. ఆంధ్రరాష్ట్రములో చేరనక్కరలే దని చెప్పటే జరిగినదిగాని, నగరముపై అసలు హక్కులు వదలుకొందు మని చెప్ప లేదుకదా? కాబట్టి మద్రాసుభవిష్యత్తు తేలువరకు మద్రాసును వదలిపోవుట అంత ఉత్తమము కాదు. అంతే కాక ఆచరణదృష్ట్యా కూడ విషయమును ఆలోచించుట అవసరము. రాజధానిఅన్వేషణ నిర్ణయము అనునది పెద్ద సమస్యకాదు. అనవసరఅనుమానములు లేకపోయిన ఆ ప్రదేశమును తేలికగ నిర్ణయింపవచ్చును. కాని ప్రదేశమును నిర్ణయించినంత మాత్రమున వెంటనే అక్కడికి తరలిపోవుట సాధ్యమైన కార్యమా? దాని నిర్మాణము ఒక్కరోజులోగాని, ఒక్కసంవత్సరములోగాని జరుగునది కాదు. దానిని గమనింపక త్వరలో వెళ్లిపోవుద మనుట ఉచితము కాదు. గవర్నరు జనరలు ప్రకటించు ఆర్డరులో తాత్కాలికరాజధానినిగురించి చెప్పుట జరుగును. మద్రాసు ఉభయులకు రాజధానిగ నుండగల దని చెప్పవచ్చును. వారు న్యవధి తక్కువ ఇచ్చెదరేమో అని భయపడుచుండ ఈ ప్రసంగములను గమనించిన ఇక్కడనుండి ఎంత త్వరగాబడితే అంత త్వరగా వెళ్లుటకు వారు ఏర్పాటు చేయుదురు. ఆంధ్రులను త్వరగా వెళ్ళిపొమ్మని చెప్పుటకు అరవలకు వీలుగా నుండును. అట్టి పరిస్థితి రాకుండగ చూడవలెను. ప్రస్తుతము జాగ్రత్తగ చూడవలసినది రాజధానిఅన్వేషణ కాదు. విభజనకు సంబంధించిన అన్ని విషయములందు అప్రమత్తత వహించుట. రాజధానిఅన్వేషణ నెమ్మదిగా జరుపవచ్చును.

అసలు విభజనకు సంబంధించిన సమస్యలు పరిష్కారము కాక మునుపు, మద్రాసుభవిష్యత్తు తేలకమునుపే రాజధానినిగురించి ఎత్తుకొనుట అంత మంచిదికాదు. అందులో శ్రీబాగు పాక్టును గురించి అప్పుడే ఎత్తుకొనుట అంతకన్న మంచిది కాదు. రాష్ట్రము ఏర్పడి ఇంకా వ్యవహరింపకమునుపే ఇప్పటినుంచీ, కలతలు, ఆందోళన ఆరంభమగును. ఇతరులు నవ్వుటకు ఆస్కార మేర్పడును. రానున్న రాష్ట్రమునకు స్థాయి చిక్కు విషయముల గురించే ఇపు డాలోచించవలసి యున్నది.

తుపానుబాధితుల సమస్యలు

ఆంధ్రరాష్ట్ర నిర్మాణమునకు సావకాశము కలిగించినందుకు కాంగ్రెసు అధ్యక్షులు పట్టాభిసీతారామయ్యగారు పండిత నెహ్రూ, సర్దార్ వల్లభాయి పటేల్‌గార్లకు కృతజ్ఞతావందనము లర్పించిరి. కాంగ్రెసుకార్యవర్గము ఆంధ్రరాష్ట్రమును తక్షణము నిర్మించుటకు భారతప్రభుత్వము చర్యలు తీసికొనవలె నని సిఫారసు చేసిన దినముననే భారతప్రధాని ఆంధ్రదేశ తుపానుబాధితుల సహాయార్థము, విరాళము నిచ్చెను. ఇందుకుకూడ ఆంధ్రప్రజ భారతప్రధానియెడ కృతజ్ఞతాభావమును చూపెదరు.

ఆంధ్రదేశమునకు మొన్న తుపానువల్ల కలిగిన నష్టప్రమాణము ఇంతవరకు ఆంధ్రదేశము కని విని ఎరుగదు. అందువల్లనే రాష్ట్రము రానున్న దను సంతోషమును తగినంతగ వెలిబుచ్చలేకపోయిరి. భారతదేశములో ఏప్రాంతమునందు ప్రమాద మేర్పడినను, ఆంధ్రులు తమచేతనైన సహాయము చేయుచు వచ్చిరి. ఇపుడు తమకు కలిగిన అవాంతరము యావద్భారత దృష్టిని పొందలేకపోయినందుకు కొంత కినుక, విచారము కలుగక పోలేదు. బాధితులకు విరాళముల నిచ్చి సహాయపడవలసిన దని భారతప్రధాని విజ్ఞప్తిచేయుటతో, యావద్భారతదృష్టి నాకర్షించి, దేశముమొత్తముమీద సహాయనిధులు ఆరంభింపబడగల వని ఆశించవచ్చును.

మొన్న రాష్ట్ర శాసనసభలో తుపానుప్రాంతములందు ప్రభుత్వము చేయవలసినదానినిగురించి సభ్యులు వివిధసూచనలు చేసిరి. వాటిలో కొన్ని తాత్కాలికములు, కొన్ని దీర్ఘకాలికములు, మరికొన్ని తక్షణము చేయవలసినవి. ప్రభుత్వముగాని, ప్రజాసంస్థలుగాని తక్షణము చేయవలసినవాటిపైననే ముందు తమ శక్తిని వినియోగించవలసి యున్నది. అనేకప్రాంతములందు ప్రజలకు కట్టుగుడ్డ, ఆహారధాన్యము లేకుండపోయినవి. అక్కడ ముందు ఈ పదార్థములు సరఫరా అగునట్లు చూడవలెను. తుపానువల్ల కలిగిన నష్టము రు. 50/- కోట్లుండు నని కాంగ్రెసు అధ్యక్షులు అంచనా వేసిరి. వారి అంచనాలో అతిశయోక్తి ఏమాత్రమూ లే దని, కూలిపోయిన ఇండ్లను, చనిపోయిన పశువులను గమనించిన బోధపడగలదు. ఇక పంట సంగతి చెప్పనవసరము లేదు. వెంటనే బాధితుల కష్టనివారణకు రు. 2 కోట్లు కావలెనని సూచించిరి. రాష్ట్రప్రభుత్వము అవసరములను గమనించి ఎప్పటికి ఎంత పైకము అవసర మని తోచిన అంత వెచ్చించుటకు వెనుకాడరని రెవెన్యూమంత్రి హామీ నిచ్చెను. రెమిషనులు ఇచ్చు విషయమునకూడ ఉదారముగ వ్యవహరించు నని కూడ హామీ నిచ్చెను. బాధితులకు కావలసినది కేవలము పైకము కాదు. వారికి కావలసినది వస్తువులు. కాబట్టి వట్టి పైక మిచ్చుటకన్న వస్తురూపేణ బాధితులకు సహాయ మిచ్చుటే అవసరము. విరాళములు వసూలు చేసెడి స్థానిక ప్రముఖులు ఈఅంశమును గమనించుట అవసరము. ఇది తక్షణఉపశమనమునకు చేయవలసిన కార్యములు. ఇది కాక దీనితోపాటు పడిపోయిన యిండ్లను కట్టుకొనుటకు, చెడిపోయిన చెరువులను బాగుచేయుటకు సహాయపడవలసియున్నది. చెరువులను, కాలువలను తక్షణము బాగుచేసిన గాని, మరల వ్యవసాయము చేయుట అనునది సాధ్యముకాదు. ఈ కార్యము కేవలము సామాన్యపద్ధతిని సాగించిన పుణ్యకాలము గడచిపోవును. అది అసాధారణపద్ధతిని సాగించవలెను.

డాక్టర్ పట్టాభి

శ్రీ ముక్తేవి శ్రీరంగాచార్యులు

ఈ నెల 24 వ తేదీకి మన ఆంధ్రపుత్రుడగు రాష్ట్రపతికి 70 సం॥రాలు నిండి 71 వ సం॥రము వస్తూంది.

నూతనరాజ్యాంగము అమలునాటికి ఆంధ్రులకు రాష్ట్రం చేకూర్చే కార్యసాఫల్యత, నేర్పరితనము ఆంధ్రనాయకులలో ఒక్క డాక్టరు పట్టాభివద్దనే ఉన్నందున, తరతరాలుగా అపకీర్తికి లోనయ్యేటట్లు ఒక తమిళ అగ్రనాయకుడు వేసిన ఆ కుంభకోణము జిత్తును తప్పించుకొని కార్యం సాధించి ఆంధ్రులను గట్టెక్కించగలిగాడు. మద్రాసుభవిష్యత్తునుగూర్చి కూడా మన మనోరథము నీడేర్చనున్నాడు.

పట్టాభిగారి ఈ జన్మదినోత్సవసందర్భంలో వారితో నాకు ఉన్న పరిచయమును పురస్కరించుకొని మచ్చునకు వారి జీవితంలోని కొన్ని రసగుళికలను ఆంధ్రప్రజానీకానికి అందజేయ సాహసించాను. బందరు నోబుల్ కళాశాలలో విద్యాభ్యాసము చేసినందున నా విద్యార్థిదశలోనే వారినిగూర్చి తెలుసుకొనుట సంభవించింది. మా కళాశాలలోని విద్యార్థులము వైజ్ఞానికాభివృద్ధికై పార్లమెంటరీ డిబేట్సు అంటూ ఏర్పర్చి ఆ సందర్భములో పెద్దలను రావించి వారిచేత ఉపన్యాసాలు ఇప్పించేవారము. ఒక్కొక్కప్పుడు మాలో మేమే చర్చలను జరుపుకొనుచుండెడివారము. 1927 సం॥రములో మా కళాశాలలో "సామ్యవాదము" మీద చర్చ ఏర్పాటు చేసుకొన్నాము. ఆ చర్చలో కొందరు అనుకూలంగాను, కొందరు ప్రతికూలంగాను పాల్గొన్నారు. ఆ చర్చలో పాల్గొన్న మా మిత్రులలో నొకరు రష్యాదేశంలోని సామ్యవాదవిధానంమీద అనర్గళంగా ఉపన్యసిస్తూ, వివిధదేశాల్లో ఆనాడు అమలులో ఉన్న విధానాలను తెలియజేశాడు. ఇన్నివిషయాలతోకూడిన ఇట్టి మహోపన్యాసం ఏలా చేయగలిగాడా అని మేమంతా నివ్వెరపోయాము. తీరా విచారించగా మా ప్రబుద్ధుడు పట్టాభివద్దకువెళ్లి ఆ విషయాలు స్వీకరించుకొని వచ్చినట్లు తెలిసింది.

పట్టాభిగారు కూడా నోబుల్ కళాశాలలోనే చదివాడు. కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులంతా సం॥రాని కొకమారు సమావేశమయ్యేవారు. 1931 సం॥రములో అనుకొంటాను. రఘుపతి వెంకటరత్నంనాయుడు, పట్టాభి మొదలగు ప్రముఖులంతా ఆ సం॥రం వార్షికోత్సవములో పాల్గొన్నారు. వెంకటరత్నం నాయుడుగారు ఉపాధ్యాయులుగా ఉండే రోజుల్లో పట్టాభిగారు ఆ కళాశాలలో వారివద్ద చదివారట. గురు, శిష్యులు ఇద్దరు ఆనాటి సభలో పాల్గొన్నారు. వారు ఉభయుల ఇష్టాగోష్ఠి మాకు విన సొంపు అయింది. పిరిడిలో 10 నిముషాలు మాత్రమే పాఠముచెప్పి మిగిలినకాలమంతా "హాస్కు"తప్ప వెంకటరత్నంగారు ఏమి చెప్పేవారు గారని పట్టాభిగారు ఛలోక్తిగా అన్నారు. 10 నిముషాలు చెపితేనే నీలాంటి శిష్యులు తయారయ్యారు. ఘంటా చెపితే ఇంకెందరు తయారయ్యేవారో"అని నాయుడుగారు సమాధాన మిచ్చారు. చూడవచ్చిన మాబోటివారిని వారి సంభాషణలు, ఉపన్యాసాలు ఆనందములో ముంచెత్తాయి.

పట్టాభిగారి ప్రజ్ఞ, ప్రతిభనుగూర్చి ఇంత వింటూన్నా చాలాకాలంవరకు వారి ఇంగ్లీషు ఉపన్యాసము వినే అవకాశం చిక్కలేదు. ఆఖరుకు ఒకరోజున లభ్యమైంది. మా కళాశాల ప్రిన్సిపాల్ జాన్ష్టన్ ఇంగ్లాండువైపున, పట్టాభిగారు భారతదేశం తరఫున బందరుపుర మందిరములో మాట్లాడుటకు ఏర్పాటుచేయబడింది. ఇద్దరి ఉపన్యాసాలు ఇంగ్లీషులోనే అన్నారు. జాన్ష్టన్ ప్రావీణ్యత మాకు తెలుసును. ఆయన ఇంగ్లీషుభాషలో ఆరితేరిన పండితుడుగానేగాక అంతర్జాతీయ వక్తగా పేరు పొందాడు. "షేక్స్పియరన్ స్కాలర్" అని ప్రసిద్ధిపొందాడు. పట్టాభిగారిపేరు జాన్ష్టన్ విన్నాడుగాని ఒక రాజకీయవేత్తగానే చూచేవాడు. పట్టాభి ఈ పోటీలో గెలువగలడా అని మాకందరకు సందేహము కలిగింది.

ముందుగా జాన్ష్టన్ వినసొంపుగా, మంచి భాషలో ఇంగ్లాండుపక్షాన మాట్లాడి ప్రేక్షకుల మనస్సు చూరగొన్నాడు. ఇక పట్టాభివంతు వచ్చింది. ప్రజలలో గుసగుసలు బయలుదేరాయి. డాక్టరు పట్టాభిగారు ప్రారంభించాడు. ఆయన ఉపన్యాసము మమ్ములను ఆశ్చర్యచకితులను చేసింది. అలాంటి ఉపన్యాసము మళ్లీ ఎచ్చటా ఇంతవరకు నేను వినలేదంటే అతిశయోక్తిగాజాలదు. జాన్ష్టన్ నివ్వెరపోయాడు. డాక్టరుగారి ప్రతిభ తెలియజేయకుండా ఈలాంటి సమావేశాన్ని ఏర్పాటుచేసినందుకు ఆ సమావేశకర్తలను కోపపడ్డారని ఆ పిమ్మట విన్నాము. ఇప్పటికి సుమారు 10 సం॥రాల పూర్వం తూర్పుకృష్ణాజిల్లా ఆంధ్రమహాసభకు కార్యదర్శిగా నేను ఎన్నుకోబడ్డాను. మా కార్యాలయము బందరులోనే ఉండేది. ఆనాటివరకు పట్టాభిగారితో నాకు పరిచయము లేదు. మా జిల్లా సంఘ అధ్యక్షులకు, పట్టాభిగారికి నేస్తం ఉన్నది. నేనూ మాజిల్లా సంఘుఅధ్యక్షులు కలిసి డాక్టరుగారింటికి వెళ్లాము. నేను ఖద్దరు దుస్తులే ధరించిఉన్నాను. కాని మామిత్రులు మాత్రము స్వచ్ఛమైన విదేశీ ఉడుపులను ధరించివచ్చారు. మేము లోపలకు ప్రవేశించామో లేదో, అప్పుడే, "ఇంకా ఈ వ్యామోహం పోలేదు......రావూ? మీ నాయనగారిమీద ఉండే ప్రేమచే నీతో మాట్లాడుతున్నానుగాని లేకపోతేనా ?"అని హుంకరించాడు. నాకు భయం వేసింది. మా సంభాషణ త్వరలో ముగించుకొని బయటపడ్డాం. ఈ కిటుకు బందరు పౌరులందరికీ తెలుసును. అందువల్ల ఏనాడూ ఖద్దరుకట్టినపాపాన పోక పోయినా వారితో పనివస్తే, కొత్తవైనా కొని అలంకరించుకొని వెళ్లే ప్రబుద్ధులను అనేకమందిని చూచాను.

డాక్టరుగారివద్ద దాపరికమనేది లేదు. ఎదుటివానిని చూడగానే ఏమనుకొంటే అంతా వాని మొహానే అడిగేస్తారు. అందువల్లనే పలు


(21 వ పేజీ చూడుడు)

అందువల్ల ఆ పనిని మిలిటరీకి అప్పగించుట యుక్తముగ నుండవచ్చును. అంతేకాక సహాయవస్తుపంపకపనిని కూడ వారి కప్పగించవచ్చును.

తుపాను బాధితప్రాంతములో ముందు ఎదుర్కొనవలసినది ఆహార సమస్య. ఇది తక్షణసమస్యయేగాక తరువాత ఎదుర్కొనవలసిన సమస్యకూడ. తుపానువలన దెబ్బతినిన జిల్లాలు ఒకటి రెండు తప్ప మిగిలిన వన్నియు మిగులు జిల్లాలు. ఇతరజిల్లాలుకూడ వీటిమీద ఆధారపడియున్నవి. ఇపుడు ఆ జిల్లాలందే కాటకము పర్పడు స్థితి వచ్చినది. అందువల్ల ఆ జిల్లాలందు చెడిపోయిన భూములను వెంటనే సాగు చేయుటకు తగిన వసతులను కలిగించవలసియున్నది. కాలువలను, చెరువులను బాగుచేయించుటతోబాటు, తక్కువధరలో, పశువులు, విత్తనములు దొరకునట్లు చూడవలెను.

దెబ్బతిన్న జిల్లాలందు కేవలము పునర్నిర్మాణకార్యక్రమమే సాగవలసియున్నది. దీనికి ప్రభుత్వ సహాయముతోబాటు రాష్ట్రములోనున్న వివిధసంస్థలకు చెందిన సేవాదళములు కూడ పూనుకొనవలెను. కాంగ్రెసుసేవాదళములున్నవి. స్వయంసేవక సంఘములున్నవి. స్కౌటుసంస్థలున్నవి. వారందరూ కలిసి పునర్నిర్మాణకార్యక్రమములో ప్రజలకు తోడ్పడుట అవసరము. తమ సేవాతత్పరతను చూపుటకు ఇంతకన్న వారికి సదవకాశము లేదు.

21-10-49 తేదీ మచిలీపట్నంలో
కృష్ణా రైసుమిల్లులవారి సమావేశం



కూర్చున్నవారిలో కుడినుండి ఎడమకు:—శ్రీ టి. నాగపోతరావు, ఆహ్వాన సంఘాధ్యక్షులు, డా. ఆర్. అచ్యుతరామయ్య, ఆహ్వానసంఘసభ్యులు, శ్రీ గుంటూరు నరసింహారావు, ఎం. ఎల్. ఏ., ప్రెసిడెంట్, ఆంధ్ర ఛేంబర్ ఆఫ్ కామర్సు, మద్రాసు, సమావేశ అధ్యక్షులు; గా॥ శ్రీ జే. ఎల్. పి. రోచి విక్టోరియా, ఆహారమంత్రి, సమావేశ ప్రారంభకులు; శ్రీ పి. కోథనాద్రి, ప్రెసిడెంట్, మచిలీపట్నం మిల్లర్సు అసోసియేషన్; శ్రీ జే. పారె, కలెక్టర్, కృష్ణా; శ్రీ కే. పి. శామ్యూల్, ఆర్. డి. ఓ., మచిలీపట్నం; శ్రీ ఎం. వి. రత్నం, ఆహ్వానసంఘ కార్యదర్శి నివేదికను చదువుచున్నారు.



గా॥ శ్రీ జే. ఎల్. పి. రోచి విక్టోరియా, ఆహారమంత్రిగారు, కృష్ణాజిల్లా రైసుమిల్లులవారి సమావేశమున, సమర్పించిన స్వాగతపత్రమునకు, శెక్రటరీ చదివిన నివేదికకు సమాధాన మిచ్చుచున్నారు.

నవల



శ్రీ నోరి నరసింహశాస్త్రి

౫

"అవఅవ మందు నేఱ్ఱని చంద్రమల్లెల
చోద్యంపు గుండాలు చొచ్చువారు,
కరవాఁడియలుఁగుల గనపపాఁతర్లలో
నట్టిచేరులు కోసి యుఱుకువారు,
గాలంపుఁగొంకిఁ గంకాళచర్మము గ్రుచ్చి
యుడువీథి నుయ్యెల లూఁగువారు,
కటి కయోనాళంబు గండకత్తెర వట్టి
మిసిమింతులును గాక మ్రింగువారు,
సందులను నారసంబులు సలుపువారు,
యెడమ కుడి చేత నారతు లిచ్చువారు,
సాహసము మూర్తి గైకొన్న సరణివారు,
ధీరహృదయులు మైలారువీరభటులు."

—క్రీడాభిరామము

శరన్నవరాత్రములు ప్రారంభమైనవి.

భరతభూమిని భరతరాజులే పాలించు దినములలో శరన్నవరాత్రములకంటె జగన్మోహనమగు నుత్సవము మరొక్కటి లేదు. ఆ తొమ్మిదిదినములును ప్రకృతియే దివ్యరూపముల నవతరించి పూజలు స్వీకరించును. శారదారూపములో శృంగారమూర్తి ప్రధానమో, వీరరేఖ ప్రధానమో, అద్భుతము ప్రధానమో, శాంతమే ప్రధానమో ఎవరు నిర్వచింపగలరు? నవరసములకు నధిష్ఠానమగు నా మహామాయ నేమని వర్ణింతుము! ఉపనీతులుగూడ గాని విద్యార్థిబాలకులే చేతుల విండ్లు నంబులు పూని వీరమన్మథావతారములవలె వాడవాడల సంచరింతురే! తారకసంహారమున కీ రూపము తోడనే కుమారుడు బయలుదేరెనా?

ఏకశిలానగరముచుట్టును రాతితో కట్టిన కోట కలదు. దానికి వెలుపల పుట్టకోట యొకటి కట్టించవలె నని స్థపతులతో జరుగుచున్న యాలోచన లింకను కార్యరూపమున బరిణమింపలేదు.

పట్టణమం దంతటిలోకన్న వెలిపాలెములో నవరాత్రోత్సవ మెక్కువ సందడిగా ప్రారంభమయ్యెను. తిప్పెటల రుంజల మ్రోతతో చెవులు గింగురు మనుచుండెను. ఆవేశపూరితులై మైలారుభటులు బొబ్బలుపెట్టుచుండిరి. వారి వీరావేశము చూడవలసినదే కాని వర్ణింప శక్యము కాదు. వారలకు భక్తిపారవశ్యముతోబాటు వారల యుదరములలో నిండిన మద్యము వారికి సంపూర్ణముగా దేహభ్రాంతి పోగొట్టినది. ఒకడు దండచేతులమీద కొరడాతో కొట్టుకొనగా నతని చర్మము చిట్లి రక్తబిందువులు చెమర్చుచుండెను. అట్లే యాత డానందమున గంతులువేయుచుండెను. మరియొకడు రెండు బుగ్గలలో నారసములు గ్రుచ్చుకొని రీవిగా నూగుచు నృత్యము చేయుచుండెను. మరియొకడు మండుచున్న కర్పూరఖండములు రెండు తన రెండరచేతులలో నాధారము లేకుండ పెట్టుకొని యవి వెలుగుచుండ జయజయనినాదములు చేయుచుండెను. ఇంకొకడు మండుచున్న దీపములే వత్తులతో మ్రింగివేయుచుండెను. కొందరు కణకణలాడు నగ్నికుండములలో దిమికి ముందుకు సాగిపోవుచుండిరి. వారు వేయు కేకలును బొబ్బలును మైలారుదేవుని మహత్త్వమునే ఘోషించుచుండెను.

అంతలో నం దొక మైలారుభటున కావేశము పెరిగినది. అతడు ఎందరు పట్టినను ఆగునట్లు లేడు. "ఏమి టేవే గోల బొల్లా?" అని ప్రక్కవా రడుగగా ఆ అడిగినవారి నాతడు తన్ని వైచెను. కొందరు చెంపలు వేసికొని "అపరాధము మైలారుదేవా, నీ కేమి కావలె చెప్పు స్వామీ!" అని ప్రార్థింపసాగిరి.

ఆ మాటలకు బొల్లడు బుసలుకొట్ట నారంభించెను. వా రాతనికి గుగ్గిలపు ధూపము వేసి మైలారుదేవుని పరిపరివిధముల ప్రార్థింప మొదలిడిరి. ప్రార్థించిన కొలదియు బుస లెక్కువయ్యెను. తుద కాతడు రొజుచు దేవత పూని చెప్పిన వాక్యము లిట్లు నెమ్మదిగా చెప్పజొచ్చెను.

"నాకు తపనగా—ఉన్నది—తపన!—ఆడది—నన్ను ముట్టితే—ఊరుకోలేను—ఆడస్పర్శ—తపన!... నాకు పనికిరాదు......"

"ఏమో అంటు సోకినదట స్వామికి!"

"ఏమి సోకినది?"

"ఆడస్పర్శ ఏమిటి? ఇక్కడ ఆడంగు లెవరూ లేరే!"

పరిపరివిధముల జనముల మాటలు చెలరేగినవి. చివరకు కొంద రడిగినారు.

"ఏమి అపరాధము జరిగింది స్వామీ నీకు? ఎక్కడ జరిగింది అంటు?"

బొల్లడు ఊగుతూ శివముతో చెప్పినాడు.

"ఒళ్లంతా తపనగా ఉన్నది. మండిపోతున్నది!"

చుట్టుప్రక్కలవారు కడవలతో నీళ్లందుకొని వానిపై క్రుమ్మరించినారు. కాని దానితో మంట చల్లారిన ట్లగపడలేదు. ఆ అంటు శుద్ధి ఐనట్లు తోచలేదు. బొల్లడు అరవసాగినాడు.

"ఆడస్పర్శ... నేను భరించను...... నే నీ ఆడమళయాళంలో ఉండను! ఆడమళయాళం!......"

అప్పు డా ఆడస్పర్శస్వరూపము మూగినవారికి కొంత లీలగా అవగతమైనది. చుట్టుప్రక్కల నున్నవారు ఆ మాటలకు గడగడలాడిపోయిరి. ఒకవంక మైలారుదేవుని భయము! మరొకవంక ఎందును ఏమరకుండు రాజభటుల భయము! అంతకు ముందే రుద్రమదేవి యీనాడు నవరాత్రదీక్ష ప్రారంభింప నున్న దని నగర మంతట చాటింపు జరిగియుండెను. ప్రభువుల యాజ్ఞలు ధిక్కరించి మాటాడువారి కెట్టి శిక్ష యుండునో అంద రెరుగుదురు. నగరమంతటను చక్రవర్తిగూఢచారు లెల్లవేళల సంచరించుచుందు రని కూడ జగద్విదితమే.

ఇట్లే కొంతసేపు బొల్లని యలజడి సాగినది. అంతలో మరియొకవైపునుండి కాకతిదేవతకొలుపుకు మరియొక గుంపు ఊరేగుచు బోవుచుండెను. ఆ గుంపులో పోవువారు మరియొకవిధముగా వీరమార్గమున కాకతిదేవతను కొలుచుచు నూరేగుచుండిరి.

ఆ ఊరేగింపుకు ముందుభాగమున నొక మాతంగకన్యక మద్యపూర్ణకుంభమును ధరించి సాగుచుండెను. ఆ కుంభము పచ్చని యాకులతోడను ఎర్రని పూలతోడను సర్వాంగసుందరముగా నలంకరింపబడియుండెను. పాలసముద్రమునుండి యిప్పుడే యవతరించిన వారుణీదేవతయా యిది యనిపించుచున్న దా కలశహస్తయగు మాతంగకన్య! ఆ కన్యక ముందుకు పోవుచుండ నామెయడుగులకు మడుగు లొత్తుచుండిరి. ఆమెయు నడచి పోవుచుండలేదు. అది యొక నృత్యము చేయుచుండెను. ఒక చిందు త్రొక్కుచుండెను.

ఆమెకు ఒకప్రక్కను శకటముపై సిడిపోతు వచ్చుచుండెను. ఉన్నతమైన సిడికోలచివర గ్రుచ్చబడిన యా మేకపోతు కాకతిదేవతధ్వజస్తంభమువలె కనిపించుచున్నది. అదిగాక బలికై ఎన్నియో మేకపోతులను, కొన్ని మహిషములను ఆ గుంపులోనివారు తీసికొనిపోవుచుండిరి. ఆ గుంపులోని జనుల చేతులలో విస్తారముగా వేపమండలు కలవు. వారు చల్లుచున్న పసుపుకుంకుమలు భూనభోంతరమును హరిద్రాకుంకుమాంకితము చేయుచుండెను.

కాకతిశక్తి కాకతీయప్రభువుల కులదేవత. అట్లగుటచే నా దేవతపూజోత్సవములు అసాధారణవైభవముతో జరుగుచుండెను. ఆ దేవాలయమునకును ఆదాయ మెక్కువ. ఆ కొలుపుకు పోవు జనసమూహములు కూడ మైలారుభటులకంటె నధిక సంఖ్యాకులు. మైలారుభటుల యరపులు ఉరుములవలె నుండ, కాకతివీరుల కేకలు పిడుగులవలెనే వినిపించుచుండెను.

కాకతివీరులలో గండడు అనువానికి శివము పూనినది. కాని యితని శివము బొల్లని శివమువలె లేదు. ఇతనిది ఆనందతన్మయత. గండడు కనపడ్డవారి నెల్ల వికటాట్టహాసముతో కౌగిలించుకొనును. ఆ యాలింగనములో స్త్రీపురుషవిచక్షణ లేదు. అత డాలింగనము చేసికొనగా పలువురు స్త్రీలు కెవ్వున కేక వేసి యతడు వదలగానే పకపక నవ్వుచు తొలగుచుండిరి. అత డానందబాష్పములు కార్చును. పెద్దలు కనపడిన నట్టివారికి పాదము లంటి మ్రొక్కును. విరామము లేకుండ జయజయనినాదములు చేయును. అతనితోపాటు ఆ జనసమూహమంతయు జయజయనినాదములు చేయ నారంభించెను.

ఆ రెండు ఊరేగింపులును ఒక చతుష్పథములో తారసిల్లినవి. మైలారుభటులును కాకతిశాకవీరులును ఎప్పు డట్లు తారసిల్లినను సంఘర్షణ రాకుండుట యరుదు. విద్యుత్తు పుట్టినట్లే. ప్రాణాగ్ని సంయోగముచే శబ్దము పుట్టినట్లే.

బొల్లడు "ఆడసోకు సోకినది" అనుచు మహాతపనతో కేకలువేయ నారంభించెను. ఆ మాట చెవి సోకినంతనే అంతవరకు ఆనందమూర్తివలె నున్న గండడు ఒక్కసారిగా భైరవమూర్తిగా మారిపోయెను. అతడు విజృంభించి శివశక్తివలె బొల్లని మీదికి లంఘించెను.

"జయ జయ రుద్రదేవమహారాజ! జయ కాకతమ్మతల్లీ జయ!" అని బొబ్బలు పెట్టుచు పోయి గండడు ఎగిరి బొల్లని రొమ్ములో బలముగా తన్నెను.

ఆ తాపుతో బొల్లని యావేశ మొక్కసారిగా నణగి యాతడు పడిపోయెను. మైలారుదేవున కపరాధమైన దనుచు సింహనాదములతో మిగిలిన మైలారుభటులు మూగిరి. కాని గండ డది లెక్కచేయక క్రింద పడిన బొల్లనిపై కెక్కి కాల చేతుల మట్టగింపసాగెను.

ఇంత యాకస్మికముగా గండడు విజృంభించినందున నొక్కక్షణకాల మందరు నిర్విణ్ణులై యాగిపోయిరి. బొల్లడుకూడ నిశ్చేష్టు డయ్యెను.

కాని మరియొక నిమేషములో స్థితిగతులు మారిపోయెను. క్రింద పడిన బొల్లడు సందు చూచి పై నున్న గండని వదలించుకొనుటకు తీవ్రప్రయత్నము చేయుచు నాతని కాలుచేతుల క్రుమ్మసాగెను. మరియు నందినచోట రక్కుచు కొరుకుచుండెను.

గండని లాగివేయుటకు మైలారుభటులు పలువురు మూగగా వారిపై కాకతివీరులు కవిసి కొట్టసాగిరి. అటు మైలారుభటులును ఇటు కాకతివీరులును నై ఉభయ పక్షములకు మల్లయుద్ధము ప్రారంభమయ్యెను.

(18-వ పేజీ చూడుడు)

పంజాబ్ కేసరి

లాలా లజపతిరాయ్

శ్రీ టి. యస్. చారి



సరిగా ఇప్పటికి 21 సంవత్సరాల క్రిందట పంజాబ్ కేసరి అని ఖ్యాతిగాంచిన లాలా లజపతిరాయ్ భారతజాతీయసమరవహ్నికి ఆహుతియై దివ్యసన్నిధిని పొందారు. తన అరవై మూడోఏట సైమన్ కమిషన్ పట్ల నిరసన ప్రకటించడానికి ఒక ఊరేగింపు నడుపుతూ పోలీసు లాఠీల దెబ్బలుతిని ఆ దెబ్బల గాయాలకే ప్రాణాలు విడిచారు.

అపూర్వసాహసోపేతుడైన ఈ పంజాబ్ సింహం అప్పటికే స్వతంత్రభారతదేశకళ్యాణమూర్తిని తన మనోఫలకంలో చిత్రించుకున్నారు.

కరకు లాఠీదెబ్బలు నిర్దయతో తన శరీరాన్ని చూర్ణంచేస్తున్న సమయంలో "నాపైన పడుతున్న ప్రతిలాఠీదెబ్బా, బ్రిటిష్ సామ్రాజ్యాన్ని అడుగడుగుచొప్పున లోతుగా పాతిపెట్టగలదు." అని గర్జించాడు. నిజంగానే బ్రిటిష్ సామ్రాజ్యం ఈనాడు నిలువులోతున భూగర్భంలో పాతిపెట్టబడింది. అమానుష క్రౌర్యానికి గురైన ఈ అహింసావాదిసత్యవాక్కు రెండు దశాబ్దాలు తిరక్కుండా సఫలమయింది. బ్రిటిష్ పాలకులు దేశం త్యజించిపోయారు.

క్రూరవిధివిపరీత నిర్ణయంవల్ల పోలీసు లాఠీకి గురై దుర్మరణంపాలైనప్పటికీ లజపతిరాయ్ అరవైమూడేళ్ల జీవితం ధన్యమైనది.

లూధియానాజిల్లాలో (పంజాబ్) 1865 లో లాలా లజపతిరాయ్ జన్మించారు. పిన్నవయసులోనే అశేషప్రతిభతో ప్రకాశించారు. విద్యాభ్యాసంలో ప్రతిభ చూపి బహుమానాలు, ఉచితవిద్యావేతనాలూ పొందారు.

పాఠశాలాధ్యాపకుడైన తండ్రిగ్రంథపఠనాసక్తి కుమారునికి అబ్బింది. వక్తృత్వంలోనూ, వ్యాసరచనలోనూ అద్భుతప్రజ్ఞ అలవడింది.

1895 లో న్యాయవాదవృత్తి అవలంబించేనాటికి హిందూమతసంస్కరణ, భారతజాతీయ వికాసాలలో మనకు లగ్నమయింది.

కళాశాలలో స్నేహితులైన గాంధీజీ, హంసరాజ్, పండిట్ గురుదత్ మొదలైనవారి స్నేహప్రభావం లజపతిరాయ్ జీవితాన్ని ఒక విధంగా నిర్ణయించిం దనవచ్చును. సంస్కరణ, సాంఘికోద్యమాలలో విశేష ఆసక్తి చూపి కొన్నిటికి నాయకుడైనాడు.

వీనిలో ఒకటి ఆర్యసమాజం. ఈ సమాజంలో అపారశ్రద్ధ వహించారు. స్వామి దయానందుని మృతి అనంతరం ఆర్యసమాజసభ్యులు దయానంద ఆంగ్లో-వేదిక్ స్కూలు స్థాపించారు. ఈ స్కూలుకార్యకలాపాలలో లజపతిరాయ్ మనస్సును లగ్నపరిచారు.

1901 లో ప్రభుత్వపు క్షామనివారణవిచారణసంఘసమక్షంలో లజపతిరాయ్ సమర్పించిన నివేదికవల్ల క్షామపీడితులనేకవేలమందికి సహాయం లభించింది. స్వయంగా అనాథశరణాలయాలు స్థాపించారు.

1905 లో లాహోరు ఆర్యసమాజంవారి బాధానివారణసంఘానికి కార్యదర్శిగా కాంగ్రాభూకంపంవల్ల బాధితులైనవారికి అపారసేవ చేశారు.

హిస్సార్‌లో న్యాయవాదవృత్తి ఆరంభించిన కొద్దికాలంలోనే పేరు పొంది, విశేష

ధన మార్జించి, అనేకమంది న్యాయవాదులవలె లజపతిరాయ్‌కూడా రాజకీయాల్లో ప్రవేశించారు.

1888 లో కాంగ్రెస్ సంస్థలో ప్రవేశించి అలహాబాద్ కాంగ్రెస్‌లో పేరు గడించారు. ప్రజ్ఞనుసూక్ష్మంగా గుర్తించగలిగిన కాంగ్రెస్ సంస్థ, విదేశాలలో భారతదేశపరిస్థితుల సత్యాసత్యాలను ప్రచారం చెయ్యడానికి లజపతి. రాయ్‌ని ఎంచింది. ఈ సందర్భంలో లజపతిరాయ్ ఇంగ్లండులో సంచారం చేసి భారతదేశంలో బ్రిటిషు వారి దుష్పరిపాలనగురించి ప్రచారం చేశారు. ఆ రోజుల్లో ఇట్టి కార్యానికి ఎంతో సాహసం స్థయిర్యం అవసరం. భారతదేశంలో పరిపాలనావిధానాన్ని సంస్కరించి తమ ఆధ్వర్యంలో సుపరిపాలన స్థాపించగలరని వాదించిన బ్రిటిష్ రాజకీయవేత్తలకు లజపతిరాయ్, "సుపరిపాలన స్వపరిపాలన ఎన్నటికీ ఒక్కరీతిగా ఉండవు" అని సమాధానం చెప్పారు.

"బ్రిటిషు పరిపాలనవల్ల భారతీయులకు కలిగిన మేళ్లు" గురించి పాఠశాలల్లో పాఠాలకి లజపతిరాయ్ ఈరీతిగా సమాధానమిచ్చారు :

"స్వాతంత్ర్య గౌరవాలకు సర్వప్రాపంచిక సంపదలూ తీసికట్టు." ఆత్మయే నశించినప్పుడు భారతదేశానికి సర్వప్రపంచసంపదలూ ఏమి కొని తేగలవు ?

ఈ పంజాబ్ దేశస్థుని అప్రతిహత ప్రహారాలకు ఢిల్లీలో రాజరికం తల్లడిల్లిపోయింది. పంజాబ్‌లో కాలువనీటి సుంకం హెచ్చించరాదని లజపతిరాయ్ 1907 లో పంజాబ్‌కర్షకుల ఉద్యమం నడిపారు. కోపిష్ఠి అయిన పంజాబ్ లెఫ్టినెంట్ గవర్నరు సర్ డేనియల్ ఇబెట్సన్ లజపతిరాయ్‌నీ సర్దార్ అజిత్‌సింగ్‌నీ రాష్ట్రంనుంచి బహిష్కరించి మండలేకు పంపింది.

1914 మొదలు ఆరు సంవత్సరాలు లజపతిరాయ్ ఇంగ్లండు అమెరికా సంచారం చేశాడు. ఈ రోజుల్లోనే కొన్ని గ్రంథాలు రచించారు. విదేశాల్లో భారతీయుల పురోభివృద్ధిసంస్థల్ని స్థాపించారు. అమెరికాలోని భారత స్వపరిపాలనాసంస్థను స్థాపించినది ఈ పంజాబ్ వీరుడే.

1920 లో భారతదేశానికి తిరిగివచ్చి దేశంలోని కర్షకుల, పేదల సముద్ధరణకు ఉద్యమం ప్రారంభించారు. "వందేమాతరం," "ది పీపుల్" అనే వార్తాపత్రికలద్వారా తీవ్రప్రచారం సాగించారు.

అప్పుడు పంజాబ్ ఘోరసంఘహత్యలతో అట్టుడికిపోతోంది. 1920 సెప్టెంబర్ 4-9 తేదీల మధ్య కాంగ్రెస్ ప్రత్యేకసమావేశం కలకత్తాలో జరిగింది. ఆ సమావేశంలో లజపతిరాయ్ అధ్యక్షుడుగా ఎన్నికైనారు. పంజాబ్‌లో దురంతాలకు మైకేల్ ఓడయ్యర్ కారకు డని నిందిస్తూ, పంజాబ్‌లోని దారుణకృత్యాలకు ప్రభుత్వోద్యోగులు కారకులనిచెప్తూ లజపతిరాయ్ పంజాబ్‌పరిస్థితిని కూలంకషంగా చర్చించారు. లజపతిరాయ్‌మహోపన్యాసం సభికుల్ని ముగ్ధపరిచింది. అధ్యక్షోపన్యాసంలో ఇలా అన్నారు: "ధర్మబద్ధమైన పోరాటాన్ని మనం జరపాలి. ఇందులో ఎక్కడా ఎప్పుడూ ఎవ్వరూ వెనుకాడకుండా స్థిరంగా నిలవాలి. ఓటమి వచ్చినా నేను సిద్ధమే. నేను విశ్వసించే ఆదర్శాలలో కొన్నిముఖ్యమైనవి వివరిస్తున్నాను. జాతులు స్వయం సృష్టిఫలితాలు. ధర్మసూత్రబద్ధప్రవర్తనే జాతులను ఉన్నతికి కొనిపోగలవు. ఎన్నితుపాకులు ఎన్ని అహంకారాలు కష్టాలు వచ్చినాసరే అందరూ స్థిరంగా న్యాయబద్ధులై నిలిచి మన ప్రతిష్ఠ, విశిష్టత సంపూర్ణవికాసం పొందే రీతిని మన కార్యం నెరవేర్చుకోవాలి, కలిగిన అనుభవాల్ని ఆకళింపు చేసుకొని పురోవృద్ధి పొందాలి"

పంజాబ్‌దురంతాలపట్ల హంటర్‌కమిటీ పరిశీలనవిధానాన్ని, కాంగ్రెస్ వార్షికసమావేశం ఖండించింది. దోషులైన ప్రభుత్వోద్యోగులకు ప్రభుత్వం ఇచ్చే శిక్ష శిక్ష కాదనీ, దీనివల్ల బ్రిటిష్‌న్యాయపరిపాలనావిధానంలో విశ్వాసం చలించిపోయిం దనీ కాంగ్రెసు ప్రకటించింది.

ప్రధానతీర్మానాన్ని కాంగ్రెస్ సమావేశంలో గాంధీజీ ప్రతిపాదించారు. పంజాబ్ దురంతాలకి ప్రతీకారం చెయ్యడానికీ, జాతిప్రతిష్ఠను కాపాడ్డానికీ, ఇట్టి దురంతాలు తిరిగి సంభవించకుండా చెయ్యడానికీ ఒక్కటే మార్గమని గాంధీజీ చెప్పారు. అది స్వరాజ్య స్థాపన.

దేశానికి పట్టిన దుర్గతినుంచి ముక్తిపొందాలంటే స్వరాజ్యమొక్కటే సాధనమని నిర్వచించిన నాయకు లిద్దరూ-లజపతిరాయ్, గాంధీజీ - హంతకులచేత బడి ప్రాణాలు విడవడం విధివైపరీత్యం కాదా! ఒకరు పోలీసు లాఠీ దెబ్బలకు గురై మరణించారు. మరొకరు స్వజాతికిచెందిన యువకుని పిస్తోలుకు గురై మరణించారు.

సహాయనిరాకరణోద్యమం తీవ్రంగా వ్యాపించినరోజుల్లోనే లజపతిరాయ్ జాతీయకళాశాల ఒకటి, తిలక్ రాజకీయవిద్యాలయం ఒకటి స్థాపించారు.

అంతవరకూ. గాలికీ వానకూ కొట్టుకొంటూ ఆధారంలేక కష్టాల నెదిరించి సాంఘికసేవ చేస్తున్నవారి నిమిత్తం అపారధనబల మిచ్చి ప్రజాసేవాసమితిని స్థాపించారు, హిందూమతస్థులలో ఐకమత్యం చేకూర్చడంకోసం హిందూసంఘటనోద్యమం ప్రారంభించినవారు లజపతిరాయ్.

1921 లో ఒకసారి ప్రభుత్వనిషేధాజ్ఞను ధిక్కరించి బహిరంగసభ జరిపినందుకు లాలాజీ కారాగారబద్ధులైనారు. కాని కారాగారంలో ఉండగా అనారోగ్యంవల్ల పీడించబడినందువల్ల త్వరలోనే విడుదలైనారు. పండిట్ మోతీలాల్ నెహ్రూ స్థాపించిన స్వరాజ్యపార్టీలో కూడా లాలాజీ సభ్యులైనారు.

వ్యర్థమైన సైమన్ కమిషన్ 1928 లో అక్టోబరు 30 వ తేదీని లాహోర్ వెళ్లినప్పుడు, కమిషన్‌పట్ల అసమ్మతిసూచకంగా ఊరేగింపు నడిపారు. ఆ ఊరేగింపుపై జరిగిన లాఠీచార్జిలో లాలాజీకి తీవ్రమైన గాయాలు తగిలాయి. ఆ దెబ్బలనుండి లాలాజీ తేరుకోనేలేదు. పదిహేను దినాల్లో అనగా 1928 నవంబరు 17 వ తేదీ లజపతిరాయ్ దివంగతులైనారు.

లాలాలజపతిరాయ్ నామం భారత రాజకీయ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడింది. జాతీయవీరులకు ఆదర్శప్రాయుడైన మహావీరుడైనాడు. సర్వవిద్యాపారంగతుడు. జీవితాన్ని జాతిసేవకు ధారపోసి చివరకు ఆసేవలోనే వీరోచితమృతిపొందారు. సర్వసేవాసంస్థలకూ లాలాజీ ప్రాపు ఉండేది.

లాలాలజపతిరాయ్ సార్థకజన్ముడు. లక్ష్యశుద్ధిగలవాడు. స్వతంత్రభావన, స్వంతవిచక్షణ, అమేయశక్తిసంపదలు, అపూర్వసాహసం లజపతిరాయ్‌లో మూర్తీభవించినాయి.

లజపతిరాయ్‌వంటి మహావీరులకు భారతదేశం ఎంతో ఋణపడిఉంది. ఎప్పటికైనా మాతృదేశం దాస్యవిముక్తి పొందగలదనే అచంచల విశ్వాసంతో ఆసతో కారాగారవాసాన్నీ, దేశబహిష్కరణనీ, సహించారు. వారి త్యాగందీక్ష అనేకవేలమందికి ఆదర్శాలైనాయి. స్వతంత్రభారతదేశం, లాలాలజపతిరాయ్ పవిత్రస్మృతిని హృదయఫలకంలోచిత్రించుకుని దేశగౌరవంకోసం పాటుపడగలదు.

[పి. టి. ఐ. ఫీచర్ సర్వీస్. కాపీరైట్]



విశ్వవిద్యాలయాధ్యక్షుడు ఇ. బి. ఫ్రెడ్ నెహ్రూను వెస్టుహిల్ వ్యవసాయక్షేత్రానికి తీసుకు వెడుతున్న దృశ్యం.

నాటిక:

ఇన్‌ష్యూరెన్సు యేజంటు

శ్రీ పి. శ్రీనివాసరావు

[మధ్య తరగతి కుటుంబానికి చెందిన గృహంలోని వొకగది. అది అంత విశాలంగా లేకపోయినా, క్రమబద్ధంగా, పరిశుభ్రంగా అమర్చబడివుంటుంది. యెదురుగా ద్వారం కనిపిస్తోవుంటుంది. రెక్కలు మూసే వుంటాయి. యెడమవేపున పుస్తకాలషెల్ఫు - దానిమీద పెళ్ళినాటిఫోటో - ఆ ప్రాంతంలోనే గోడకు రెండుమూడు సినీమాతారల ఫోటోలుంటాయి. ద్వారంవున్న వేపుగోడమీద దేశనాయకుల చిత్రాలుంటాయి. కుడివేపున వొక 'ఆర్టు' చిత్రం - గది మధ్యన టేబిలు - దానిమీద పూలకుండీ, దినపత్రిక, కొన్ని యితరపత్రికలు, రెండుపుస్తకాలు, వ్రాతపరికరాలు, శ్రద్ధగా అమర్చబడివుంటాయి. టేబిల్ మీదనే కాంతి ప్రసరితమయేందుకనువుగా సీలింగ్‌నుంచి లైటు వేళ్లాడుతుంటుంది. టేబిలుకు రెండువేపులా కుర్చీలుంటాయి. కొంచెం యెడంగా పడకకుర్చీ - టేబిలు కింద జోళ్లు - జోళ్లకు పక్కనే వేస్టుపేపరుబుట్ట వుంటుంది. కుడివేపునున్న కిటికీ తెర సగం తొలగించబడివుంటుంది. దానిపక్కనే వోరగా తెరిచినవాకిలి. ఇంటివారికి శుభ్రతమీద పట్టుదల యెక్కువని గదివాతావరణం చాటుతుంటుంది.

తెర లేచేసరికి గృహయజమాని రాజభూషణరావు కన్పిస్తాడు. మనిషికి పథ్యానమెక్కువ. మాట్లాడుతూ మధ్య మధ్య యెటో చూస్తుంటాడు ఖాళీగా - గూడకట్టు, చొక్కాతో వుంటాడు. వయసు ముప్ఫయ్ అయిదేళ్లుంటాయి. చామన చాయశరీరం. బక్క పలచని విగ్రహం. పాలిపోయిన ముఖం - టేబిల్‌పక్కనే యిన్‌ష్యూరెన్సు యేజంటు కూర్చునివుంటాడు. అతడి (*Profile*) మాత్రమే ఆడియెన్సుకి కనిపిస్తుంది. అతని వొడిలో వో లెదర్‌బేగ్ వుంటుంది. ట్రౌజరు, దానిలోనికి నెట్టబడ్డ ఫుల్‌షర్టు - అతని వేషం - సూలకాయుడు - వయసు నలభైయేళ్లని సమీపిస్తుంటుంది. కళ్లల్లో చురుకుదనం గుర్తించవచ్చు - మాటల్లో హడావిడి యెక్కువ.

పడకకుర్చీలో గృహిణి పడుకుని స్కార్ఫు అల్లుతూవుంటుంది తనకేమీ సంబంధం లేనట్టు. ముప్ఫయ్‌యేళ్ల యీడైన యౌవనం పూర్తిగా గడిచిపోయినట్టు వుండదు. కొన్ని లేపీ జరిగి వుండకపోవచ్చు. ఐనప్పటికి అందగత్తె అని చెప్పలేం. చెప్పుకోదగ్గ విగ్రహంఐనా, శరీర వర్ణం పెద్దలోటు - సోషల్‌గా తిరగడం అలవాటైనందువల్ల బిడియపడకుండా తన పనిలో తాను నిమగ్నురాలై వుంటుంది.

గోడ గడియారం పదిగంటలు దాటి వుంటుంది. మగవాళ్లిద్దరూ సిగరెట్లు కాలుస్తుంటారు.]

యేజంటు: మీ రెందుకండీ యింకా సంకోచిస్తారు?

యజమాని: అదేం లేదులెండి - నే ననేదేమంటే—

యేజం: మళ్లీ మొదటి కొస్తున్నారు!

యజ: మీరు అసాధ్యులు లాగున్నారే! (నవ్వుతాడు.)

యేజం: నాపని సాధ్యం కావాలిగా మరి!

యజ: నిజంగా పాలసీ తీసుకోమంటారా?

యేజం: సరిపోయె! రేపటికేం జరగనుందో మనం చెప్పలేం గదా!

యజ: (గాభరాగా) రేపా? రే పేం జరగబోతుందండోయ్!

యేజం: (కృత్రిమహాసంతో) ఖంగారు పడకండి - మాట వరుసకి చెబుతున్నా. ముందునాటి కేం జరగ్గలదో మనం చెప్పలేం గనక, మనం యిప్పుడే జాగ్రత్తపడడం మంచిదండీ!

యజ: అట్లాగా! ఐతే పాలసీ తీసుకోడానికీ, దీనికీ సంబంధం యేమిటంటారు?

యేజం: (నిట్టూర్చి) యింతసేపు నే చెప్పిందంతా మరిచిపోయారూ?

యజ: నేనా? యేం మరిచిపోయాను?

యేజం: దీప ముండగానే యిల్లు చక్కబెట్టుకోవాలి అనే విషయం!

యజ: ఐతే?

యేజం: అందుకే పాలసీ తీసుకోండి అని నా సలహా - మీ శ్రేయస్సు కోరి చెబుతున్నాను!

యజ: ఓ! అదా!

యేజం: (నిట్టూర్చి, సిగరెట్ పడేసి) పాలసీ తీసుకున్నారూ అంటే యికమీరు నిశ్చింతగా వుండొచ్చు. ముందేం జరిగినా మీ కే యిబ్బందీ వుండదు. ఫరాఖత్!

యజ: యింతకూ పాలసి పుచ్చుకోమంటారా?

యేజం: ఇంకా అడుగుతారా ఆమాట? మీ యింటివారి క్షేమం కోరినవాళ్లయితే సందేహించరు.

యజ: యేం కాంతా? విన్నావా?

కాంత: (అల్లిక ఆపి) ఆఁ?

యజ: పాలసీ తీసుకోమన్నావా?

యేజం: ఆవిడగారి క్షేమం కోరి!

కాంత: (భర్త నుద్దేశించి) నా క్షేమం కోరుతున్నారా?

యజ: (నలువేపులా శత్రువులచేత ముట్టడించబడి, తప్పించుకునేమార్గం లేనివాడిలా) యేజంటు గారూ! మీ పే రేమని శలవిచ్చారు?

యేజం: త్రివిక్రమరావు అని!

యజ: (నీరసంగా) గెలుపు మీదే! (సిగరెట్ నలిపివేస్తాడు.)

యేజం: (విజయసూచకంగా సకిలిస్తూ, లెదర్‌బేగ్ తెరిచి ఫారం బయటికి తీస్తాడు.) యీ ఫారం పూర్తిచేయాలి! శ్రమ అనుకోకండి!

యజ: (కుర్చీలో ముడుచుకుని) సరే!

యేజం: మీ పూర్తిపేరు?

యజ: (నెమ్మదిగా, ఆలోచిస్తూ) అదే కాస్త చిక్కయిన విషయం! నాకు చాలపేర్లున్నయ్. 'ఇదీ నా అసలైనపేరు' అని స్థిరంగా చెప్పలేను. చిన్నప్పుడు అందరూ 'బాబు' అని పిలిచేవాళ్లు—

యేజం: చిన్ననాటివిషయా లెందుకులెండి!

యజ: (కోపంగా) మాటమధ్య అడ్డు రాకండి! సావధానంగా వినలేరూ?

యేజం: (చిన్నబుచ్చుకుని) సరే మీ యిష్టం!

యజ: ప్చ్! చూశారా? మీ రడ్డపడేసరికి చెబుతున్నది కాస్త మర్చిపోయాను... యేం చెబుతూ వచ్చాను కాంతా?

కాంత: (తలెత్తకుండా) చిన్నప్పుడు మిమ్మల్ని బాబు అని పిలిచేవాళ్లని చెబుతున్నారు!

యజ: ఆఁ! జ్ఞాపకమొచ్చిందిలే!...... తర్వాత మా నాన్నగారు నాకు హనుమంతరావని పేరుపెట్టినట్టు, మా అమ్మ అందుకు ఒప్పుకోలేదని చెప్పారు!

కాంత: యెందుకనీ?

యజ: ఆమెకు కోపం వచ్చిందట! కొడుకేం కోతుల రాజ్యం యేలుతున్నాడా హనుమంతుడు కావడానికీ, అని దెబ్బలాడిందట!

(కాంత పకాలున నవ్వుతుంది. యేజంటు తన నవ్వుని లోలోన అణచుకుంటాడు.)

యజ: నవ్వకుండా ఆలకించండి! అలా వొప్పుకోనక నేను రాముడంతటివాడు కావాలని దశరథరామారావు అని పేరుపెట్టిందట! యిద్దరూ లొంగదలచుకోలేదు. అమ్మ తను పెట్టినపేరుతోనే నన్ను పిలిచేది. నాన్న కూడా తను పెట్టినపేరుతోనే పిలుస్తూ వచ్చాడు.

యేజం: పాపం మీకు గొప్ప చిక్కే ఐతే!

యజ: అని నెమ్మదిగా అంటున్నారా! మధ్య నేను అవస్థపడేవాణ్ణి. నా పే రేదో నాకు తెలిసేదికాదు. అప్పట్లో అమ్మగాని, నాన్నగాని పిలిస్తే, నా పేరేదో సరిగా గుర్తులేక, నన్ను కాదులే అని వూరుకునేవాణ్ణి. రెండు మొట్టికాయలు తగిలేవి తర్వాత!

కాంత: (వెటకారంగా) ప్చ్! పాపం!

యజ: (ఆవిడవెటకారం గమనించకుండానే) యిప్పటికీ వొకో తడవ నా అసలు పేరేదో మరిచి పలక్కుండావుంటే, మిత్రులందరూ నాకు మతిమరుపు యెక్కువని యెగతాళిచేస్తుంటారు.

కాంత: (వ్యంగ్యంగా) వాళ్ళ కేం తెలుసు మీ యిబ్బంది!

యేజం: మిమ్మల్ని అలా అనడానికి వాళ్లకు మతి లేకపోతే సరి!

యజ: (ఇక్‌సల్ట్ చెంది) యే మన్నారు! నా స్నేహితుల్ని నాయెదట తూలనాడ్తున్నారా? మాటలు జారనిస్తున్నారుసుమా!

యేజం: (బెంబేలుపడి) రామరామ! మీ స్నేహితుల్ని తూలనాడానా నేను? యెంత మాట?

కాంత: (భర్తతో) పోనిస్తురూ! యీ కాస్త మాటకు అంత పట్టిం పెందుకు? అయినా ఆయ నే మన్నారు గనక! మిమ్మల్నే సమర్థించారు!

యేజం: (తేరుకుని) నిజం చెప్పారు! అదీ!

యజ: (చల్లబడి) మంచిది! యేమి చెబుతున్నాను యింతకుపూర్వం?

కాంత: (శ్లేషగా) మీ స్నేహితులు మీకు మతి మరు పెక్కువని యెగతాళి చేస్తుంటారని అన్నారు!

యజ: వాళ్ల మొహం! మతిమరుపు లేదు. పరధ్యాన్నం లేదు. యెక్కువమంది నన్ను రామారావని పిలుస్తారు. అంతేనా కాంతా?

కాంత: అవునవును.

యేజం: దస్తావేజు మొదలైనపత్రాల్లో ఏపేరు వాడుతూ వచ్చారు?

యజ: చిక్కంతా అక్కడే! వొక పే రేదో స్థిరంగా వాడాలంటూ నే నంతగా ఆలోచించలేదు. వొకోతడవ రామారావు అని వ్రాస్తాను, మరోతడవ ఆ పేరు వాడేవాణ్ణి గాదు. కానీ యీ యిన్‌ష్యూరెన్సు విషయంలోమటుకు జాగ్రత్తపడాలి!

యేజం: నిజమే! బాగా ఆలోచించిమరీ వొక నిర్ణయానికి రండి.

యజ: కాదుమరి! మాటవరసకి చెబుతున్నా-వొకవేళ నేను పోయానే అనుకోండి.

యేజం: (మాటమధ్య అందుకుని) అదీ! పాలసీ పుచ్చుకున్నారూ అంటే మీరు చనిపోవలసివచ్చినా నిశ్చింతగా వుండొచ్చు కాంతదేవిగారి కెలాంటి యిబ్బందు లుండవని.

యజ: అట్లాగా?...నాపేరు సరిగా లేకపోతే చనిపోవడం నేనే అని యెలా యితరులకి తెలుస్తుంది? పత్రికల్లో చూచి మరెవరో పోయారు అనుకోరూ?

కాంత: ఇప్పుడా కబుర్లెందుకులెద్దురూ!

యజ: అదేంమాట! యే పని చేయబోయేప్పుడైనా దాని పూర్వాపరాలు, మంచిచెడ్డలు, యోచించమన్నారు పెద్దలు!

యేజం: చక్కగా శలవిచ్చారు! ముఖ్యంగా భీమావిషయంలో అలాంటి యోచన చాల అవసరం!

యజ: అందుకనే సంకోచం! నా పేరు మరొకడికి దక్కకూడదు!

యేజం: మరేం ఫరవాలేదులెండి! రామారావని వ్రాసుకుంటాను.

యజ: అదే నయ మంటారా?

యేజం: రాసుకోమన్నారా?

యజ: యేమంటావ్ కాంతా?

కాంత: (అల్లడం సాగిస్తూనే) యేదోవొకటి రాయక, దాని కింత రాద్ధాంత మెందుకు?

యేజం: సరే! రామారావనే రాస్తాను. (ఫారంలో పేరు రాస్తాడు.)

యజ: (యేదో కలలోంచి మేల్కొన్నట్టు) రామారావని రాసుకున్నారా?

యేజం: ఆఁ!

యజ: ఆ పేరు మార్చేద్దామండి... నా కేదో అనుమానంగా వుంది!

యేజం: మీ యిష్టం! (పేరు కొట్టేస్తాడు.)

యజ: (మళ్లీ ఆలోచనలోపడి) ఐనా రామారావని వుంటే నష్టమేమిటి? నా మిత్రులందరికీ ఆ పేరే పరిచయం! త్రివిక్రమరావుగారూ!

యేజం: యేమండీ?

యజ: పోనీ రామారావనే పేరే వుంచండి. అదే నయ మనిపిస్తోంది.

యేజం: సరే! (దిగులుగా ఫారం చింపి, బుట్టలో వేసి, కొత్తఫారంమీద పేరు, అడ్రసు రాసుకుంటాడు.

యజ: రాశారా? యేం రాశారు?

యేజం: (చదువుతాడు) శ్రీ వి. డి. రామారావు, 10/14, పల్లెకొనివీధి, గవర్నరుపేట, విజయవాడ.

యజ: ఈ యింటి అడ్రసే రాసుకున్నారా?

యేజం: అవును.

యజ: ప్చ్! పెద్ద పొరపాటు జరిగింది - కదూ కాంతా?

కాంత: యేమిటీ?

యేజం: (అర్థంగాక) పొరపా టేదన్నా చేశా నంటారా?

యజ: యీ నెలాఖరులోగా యీ యిల్లు వదిలేసి, మరో యింట్లో మారతాము - అది వేరే పేటలో వుంది.

యేజం: అయితే అడ్రసు మార్చెయ్యమన్నారా?

యజ: యేమీ అనుకోరుగదా?

యేజం: దాని కేంలెండి! (రెండో ఫారం చింపి, మరో ఫారంమీద పేరుమాత్రం రాసుకుంటాడు.) చెప్పండి కొత్తయింటి అడ్రసు!

యజ: (నొసటిమీద వేళ్లానించి) ఆ యింటి నెంబరు...గుర్తుకు రావడంలేదు. యింతలోకే మర్చిపోయాను!...పోనీ నీకు జ్ఞాపకముందా కాంతా?

కాంత: వుహుఁ!

యజ: (ఇంకా గుర్తుకు తెచ్చుకోవాలనే ప్రయత్నంలో) ఛూత్! యెంత బుర్ర బద్దలు కొట్టుకున్నా జ్ఞాపకం రావడంలేదు...ఐతే, ప్రస్తుతానికి యీ అడ్రసే వుంచండి...కావలిసివస్తే, తర్వాత మార్చుకోవచ్చు.

యేజం: (చిరునామా వ్రాసుకుని) మీ వయసెంతో చెప్తారా?

యజ: ముప్ఫయ్‌ఆరేళ్లు ప్రవేశించాయనుకుంటాను.

యేజం: సరే! (వ్రాసుకుంటాడు.)

యజ: (యేదో చటుక్కున జ్ఞప్తికొచ్చినవాడిలా) ఐతే ముప్ఫయ్‌ఐదేళ్లు పూర్తిగా దాటనట్టేగదండీ? (యేజంటు అవు నన్నట్లు తలూపుతాడు) ఐతే ముప్ఫయ్‌ఐదేళ్లని రాసుకోండి. (యేజంటు ఫారంలో వయసు మారుస్తాడు.)

యేజం: ఇక్కడ సంతకంపెట్టండి...యీ మార్పుదగ్గిర...

యజ: యింకో ఫారం వాడితే నయమేమో!

యేజం: మిగిలిన ఫారం వొక్కటే!

యజ: అంతేనా? మీ రేమో అనుకున్నానే! (నిరుత్సాహంగా మార్పుదగ్గర సంతకం చేస్తాడు.)

యేజం: మీ వృత్తి యేమిటని చెప్తారు!

యజ: బడిపంతులు!...

యేజం: అంటే మీరు బళ్లో చదువు చెబుతా రన్నమాట!

యజ: వూఁ!

యేజం: అంటే సాధారణమైన బళ్లో, సాధారణమైన అమ్మాయిలకి, అబ్బాయిలకి చదువు చెబుతా రన్నమాట!

యజ: (ఆశ్చర్యంతో) కాక? యెందు కలా అడుగుతున్నారు?

యేజం: యేమీ లేదు! మళ్లీ యెక్కడా మార్పులు జరగకుండా వుండేందుకు జాగ్రత్త పడుతున్నాను. (వ్రాసుకుంటాడు)

(20 పేజీ-చూడుడు)

నేటిప్రపంచం:

పశ్చిమ యూరోపియన్ రాజ్యసమాఖ్యలో పశ్చిమ జర్మనీ ప్రవేశానికి అనుమతి

పశ్చిమ జర్మన్ ప్రభుత్వాన్ని పశ్చిమయూరోపియన్ రాజ్యసమాఖ్యలో అనుబంధ సభ్యత్వం ఇవ్వడానికి అమెరికన్, బ్రిటిష్, ఫ్రెంచి విదేశాంగమంత్రులూ, బెల్జియన్, డచ్చి, లగ్జెంబర్గ్ విదేశాంగమంత్రులూ అనుమతించారు. అయితే ఫ్రెంచి ప్రభుత్వం ఒత్తిడివల్ల సార్ ప్రాంతానికికూడా ప్రత్యేక అనుబంధ సభ్యత్వం ఇవ్వాలని నిశ్చయించారు.

పశ్చిమజర్మనీ ప్రభుత్వవ్యవస్థనుగురించి కూడా అమెరికన్, బ్రిటిష్, ఫ్రెంచి విదేశాంగమంత్రులు కొన్ని నిర్ణయాలకువచ్చారు. అమెరికన్, బ్రిటిష్, ఫ్రెంచి హైకమీషనర్ల అజమాయిషీకి లోబడి విదేశాలతో స్వయంగా వ్యాపార వ్యవహారాలు నిర్వర్తించుకోవచ్చును. జర్మన్ పారిశ్రామికబలాన్ని తగ్గించడానికీ, నష్టపరిహార రూపంలో యంత్రాల్ని యుద్ధకాలపు మిత్ర రాజ్యాలు పంచుకోడానికీ ఇంతవరకూ జర్మన్ పరిశ్రమల యంత్రాల్ని పడగొట్టే కార్యక్రమాల్ని నిలుపుదల చెయ్యాలని కూడా పాశ్చాత్యఅగ్ర రాజ్యత్రయ విదేశాంగమంత్రులు నిశ్చయించారు. జర్మన్‌యంత్రాల్ని పడగొట్టడం నిలిపివేయడానికి అంగీకరించేముందు ఫ్రెంచిప్రభుత్వం జర్మన్ ఉక్కు ఉత్పత్తిని సాలీనా పదకొండున్నర మిలియన్ల టన్నులకు మించరాదని పరిమితి విధించాలని పట్టుబట్టింది, ఈ షరతు సర్వపక్షాలూ అంగీకరించాయి.


పారిస్ సమావేశనిర్ణయాలతో పశ్చిమజర్మనీ ప్రభుత్వానికి పశ్చిమయూరోపియన్ రాజ్యసమాఖ్యలో సభ్యత్వం లభించినట్టే అయితే ఆసమాఖ్యలో వోటింగుహక్కు ఉండదు.

పశ్చిమజర్మనీలో అమెరికన్ ఆక్రమిత ప్రాంతంలో పారిశ్రామికయంత్రాలను పడగొట్టడం ఇదివరకే నిలిపివేయబడింది. బ్రిటిష్, ఫ్రెంచి ఆక్రమిత ప్రాంతంలోమాత్రం జర్మన్ భారీ పరిశ్రమలలో సగంపైగా పడగొట్టబడినాయి. దీనివల్ల పశ్చిమజర్మనీలో నిరుద్యోగం అపారంగా పెరిగిపోయింది. ఆక్రమించుకొని కూర్చున్న ప్రభుత్వాల పట్ల ప్రజల్లో అసంతృప్తి ద్వేషం ప్రబలినాయి. రష్యా అమెరికాల రాజకీయ వైరుధ్యంవల్ల జర్మనీవిభజన స్థిరపడిపోయినట్లేనని జర్మన్‌ప్రజానీకానికి తెలిసిపోయింది. జర్మనీ తిరిగి ఏకం కావడం ఇంక అసంభవం. ఇది జర్మనీలోని సోషలిస్టులకూ, జాతీయవాదులకూ కూడా హృదయవిదారకంగా ఉంది. రష్యా, అమెరికాల ప్రాపుకోసం ప్రాకులాడి కమ్యూనిస్టులూ, క్రైస్తవప్రజాస్వామ్యరాజకీయపక్షువాదులూ ఈ విభజనకు ఒడిగట్టారు. కాని ఇదెంతమాత్రం ప్రజల కిష్టం ఉండదని తెలిసిన ఈ ఉభయపక్షాలూకూడా దేశవిభజనకు కారకులని పరస్పరం నిందించుకుంటున్నారు. మిగతా పక్షాలవారు ఉభయుల్నీ నిందిస్తున్నారు.

ఇంక ప్రజల్ని తృప్తిపరచి ప్రజల ప్రాపుతో తిరిగిదేశాన్ని ఐక్యంచెయ్యడంకోసం క్రిస్టియన్ డెమోక్రాట్లూ, కమ్యూనిస్టులూ ప్రచారం చేస్తున్నారు. ఈ ప్రచారంలో ఉభయపక్షాలకూ అమెరికా రష్యాలు తోడ్పడుతున్నాయి. ప్రజల ఆదరం ఆర్జించడం కోసం ఉభయపక్షాలూ పోటీపడుతున్నాయి. ఈ పోటీఫలితమే జర్మన్ రాజకీయవ్యవస్థలో ఇప్పుడు ప్రవేశపెడుతున్న మార్పులు.

అమెరికా బ్రిటన్ ఫ్రాన్సులపై ఒత్తిడిచేసి పశ్చిమ జర్మన్ ప్రభుత్వానికి పరిపాలనా వ్యవహారాల్లో కొంత స్వేచ్ఛ నిప్పించింది. తూర్పుజర్మనీలో కమ్యూనిస్టుప్రభుత్వం స్థాపించబడగానే, ఆ ప్రభుత్వాన్ని పాశ్చాత్య ప్రభుత్వ లేవీ గుర్తించకపోయినప్పటికీ వారితో పశ్చిమ జర్మన్ ప్రభుత్వం వ్యాపారపుఒడంబడిక చేసుకోడానికి అనువిచ్చింది. రాజకీయ తంత్రాల్లో తూర్పుయూరప్ పశ్చిమయూరప్‌ల మధ్య ప్రచ్ఛన్నపోరాటం సాగుతున్నప్పటికీ వ్యాపారం ఇటీవల స్వేచ్ఛగా జరుగుతోంది. తూర్పుజర్మనీ పశ్చిమజర్మనీలమధ్య వ్యాపారం నానాటికీ పెరుగుతోంది.

బ్రిటన్‌వ్యాపారం భారతదేశంతోకంటె ఇప్పుడు తూర్పు యూరప్‌తో అధికంగా ఉంది. రష్యావ్యాపారం అమెరికాలో తరుగుతున్న



బెవిన్

కొద్దీ బ్రిటన్‌తో వ్యాపారం వృద్ధిఅవుతోంది. వ్యాపారరంగంలో ఈనాడు బ్రిటన్ ఫ్రాన్సుల మధ్యకంటె, బ్రిటన్ రష్యాలమధ్య సమరసంగా జరుగుతున్నదని ఈమధ్య ఒక బ్రిటిష్‌ఆర్థిక పత్రిక వ్రాసింది.

ఇవన్నీ చూస్తే రాజకీయరంగంలో నిల్చి వృద్ధిపొందుతున్న సంఘర్షణ వ్యాపారరంగంలో తగ్గుతున్నట్లు బోధపడుతుంది. ఆయారాజ్యాలన్నీ ఆర్థికబలాన్ని స్థిరపరుచుకోడానికి సంకల్పించాయి. ఆర్థికాభివృద్ధియత్నంలో అన్ని దేశాలూ ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయి. ఈ పోటీలవల్ల పశ్చిమ యూరోపియన్‌రాజ్య సమాఖ్యలో కలతలు సంభవిస్తున్నాయి. యూరోపియన్‌రాజకీయ సమస్యను మరిచిపోయి తిరిగి పశ్చిమదేశాలు పాతపంథాలో పడ్డాయి. ఈ విషయాన్ని గుర్తించిన అమెరికా పశ్చిమ యూరోపియన్ రాజ్యాలు ఆర్థికాభివృద్ధి కార్యక్రమాల్లో పోటీలు మాని సహకారం నెరపాలనీ, పశ్చిమయూరోపియన్‌రాజ్యాల మధ్య స్వేచ్ఛావ్యాపారనిరోధాలైన రవానాసుంకాలు మొదలైనవానిని సంస్కరించి వీలైనంతవరకూ ఈ నిరోధాలను తొలగించాలనీ ఒత్తిడి తెస్తోంది. ఇది సాగనిపక్షంలో అమెరికా యూరప్‌లో ధారపోసిన ధనమంతా వ్యర్థమైపోగల దనీ, 1952 జూన్ మాసానికి అమెరికా సహాయం నిలిపివెయ్యక తప్పనిసరి కావడంవల్ల అప్పుడు పశ్చిమ యూరప్ ఆర్థిక స్థితికల్లోలంలో పడిపోతుందనీ, అప్పుడు తూర్పుయూరప్‌తో పోటీకి పశ్చిమయూరప్ నిలవజాలదనీ అమెరికా వాదం. అప్పుడు అట్లాంటిక్ పాక్టులూ, ఐక్యరాజ్యసమితీ పేకఇళ్లవలె కూలిపోగలవని అమెరికన్ రాజకీయవేత్తలు భయపడుతున్నారు.

పశ్చిమజర్మనీసమాఖ్యలో ప్రవేశంవల్ల ఈపోటీ పెరగరాదని అమెరికా అభిప్రాయం. దానికి తగిన కట్టుబాట్లు చేయడానికిగాను పశ్చిమ యూరోపియన్‌మంత్రివర్గసంఘంపై ఒత్తిడి తెస్తోంది. త్వరలోనే ఈ సమాఖ్య రాజకీయసహకారంనిమిత్తం కొన్ని ప్రతిపాదనలు తేనున్నదని పాశ్చాత్యపత్రికలు వార్తలు ప్రచురిస్తున్నాయి.

పశ్చిమజర్మనీదృష్టి అంతా తూర్పుజర్మనీపై కేంద్రీకరింపబడింది. దీనికి కమ్యూనిస్టులవల్ల భయం ఒకటి, దేశైకమత్యవాంఛ ఒకటి హేతువులు.

తూర్పుజర్మనీలో కమ్యూనిస్టుప్రభుత్వం అక్టోబరు పదకొండో తేదీని బెర్లిన్‌లో స్థాపించబడింది. 73 ఏళ్ల కమ్యూనిస్టు నాయకుడు హెర్ విల్హెల్మ్ పయక్ అధ్యక్షుడుగా ఎన్నికైనాడు. ఎన్నికైనవెంటనే విల్హెల్మ్‌పయక్ పశ్చిమ జర్మనీ ప్రజలకూ ప్రభుత్వానికీ సామ్రాజ్యవాదుల ఆధిపత్యాన్ని ప్రతిఘటించవలసిందని విజ్ఞప్తి చేశాడు. తూర్పుజర్మనీప్రభుత్వం ఎన్నటికీ జర్మనీదేశ విభజనను ఆమోదించజాలదనీ, జర్మన్‌పరిశ్రమల్ని ధ్వంసం చెయ్యడానికి అంగీకరించబోదనీ, రూర్ పరిశ్రమలపై అంతర్జాతీయఆధిపత్యాన్ని అంగీకరించబోదనీ పయక్ స్పష్టపరిచాడు. నూతనజర్మనీనిర్మాణానికి జాతీయపక్షాలు ఏకశ్రేణి నొకదాన్ని నిర్మించాలని ప్రజలకు నాయకులకు విజ్ఞప్తిచేశాడు.

వెన్వెంటనే రష్యా తూర్పుజర్మనీలో తన ఆధిపత్యాన్ని రద్దుపరుచుకున్నట్లు ప్రకటించింది. సైనికవ్యవహారాలనుమాత్రం ఒక సోవియట్ మిలిటరీ కమిషన్ నిర్వహిస్తోంది.

స్టాలిన్ తూర్పుజర్మన్‌ప్రభుత్వానికి శుభసందేశం పంపుతూ ఇది యూరప్‌చరిత్రలో ప్రధానఘట్టమని చెప్పాడు. జర్మనీరష్యాల మధ్య మైత్రీసహకారాలు సాధ్యపడిననాడు పాశ్చాత్యసామ్రాజ్యవాదుల తంత్రాలు భగ్నం కాకతప్పదని స్టాలిన్ ప్రకటించాడు. అప్పుడే యూరప్‌కు సామ్రాజ్యవాదుల దాస్యంనుండి ముక్తి ప్రాప్తిస్తుంది.

జర్మనీవిభజనకు కారకులైన పాశ్చాత్య సామ్రాజ్యవాదులపైన తూర్పు జర్మన్ ప్రభుత్వం కత్తి గట్టింది. దీనితో జర్మనీలో క్రిస్టియన్ డెమోక్రాట్లకూ కమ్యూనిస్టులకూ మధ్య సంఘర్షణ నూతనస్వరూపం దాల్చింది.

ఇప్పుడు తూర్పు జర్మనీప్రభుత్వం మైత్రీసహకారాలపై రష్యాకు సంపూర్ణవిశ్వాసం ఉంది. అటువంటి విశ్వాసం పశ్చిమజర్మనీ ప్రభుత్వంలో అమెరికా ఫ్రాన్సు బ్రిటన్‌లకు లేదు. అయినప్పటికీ పశ్చిమజర్మనీకోరికల్ని ఇంతో అంతో తీర్చక తప్పడంలేదు. ఈవిషయం గ్రహించిన జర్మన్‌ప్రభుత్వం తూర్పుజర్మనీతో పోటీని సాకుగా పెట్టుకుని క్రమక్రమంగా తమ అభీష్టాలను తీర్చుకోడానికి యత్నిస్తోంది. తూర్పు జర్మనీ విదేశాలతో రాయబారుల్ని ఏర్పాటుచేసుకోవచ్చునని రష్యా అనుమతించింది. తమకుకూడా ఆరీతిగా అనుమతించవలసిందని పశ్చిమజర్మనీ పాశ్చాత్యరాజ్యాలను కోరింది. కాని దీనికి పాశ్చాత్యరాజ్యాలు అంగీకరించలేదు. వ్యాపారవిషయాలలో హైకమీషనర్ల అజమాయిషీకింద వ్యవహారాలు నెరవేర్చుకోవచ్చుననిమాత్రం అనుమతించారు. పరిశ్రమల్ని పడగొట్టడం రష్యా ఎప్పుడో మానివేసింది. ఈవిషయమై పాశ్చాత్యరాజ్యాలు అనుమతించాయి కాని కొత్తయంత్రాలను తయారుచేసి నష్టపరిహారంగా తీర్చాలని షరతు విధించాయి. ఈ షరతుకు పశ్చిమజర్మనీప్రభుత్వం అంగీకరించింది.

కాగా సైన్యాలవిషయమై పాశ్చాత్యరాజ్యాలకు ఆందోళన కలుగుతోంది. ఎప్పుడో అకస్మాత్తుగా సోవియట్ రష్యా తన సైన్యాల్ని తూర్పు జర్మనీనుంచి తరలించగలదని ప్రకటించవచ్చును. అప్పుడు అదేరీతిని అమెరికన్ ఫ్రెంచి, బ్రిటిష్ సైన్యాల్ని తరలించాలని పశ్చిమజర్మనీ కోరవచ్చును. రష్యన్‌సైన్యాలు తూర్పుజర్మనీ విడిచి వెళ్లినా రక్షణనిమిత్తం తగు కట్టుదిట్టాలు ఇప్పటికే చేసింది. తూర్పుజర్మనీలో బలమైన "జాతీయసైన్యం" నిర్మించబడింది. సర్వపౌరులకూ సైనికశిక్షణ నిస్తున్నారు. పోలండ్‌లో సోవియట్‌రష్యన్ సైనికవీరుడైన రొకోసవిస్కీ దేశరక్షణశాఖామంత్రిగా నియమితుడైనాడు. రొకోసవిస్కీ పోలిష్‌జాతీయుడు. ద్వితీయ ప్రపంచసంగ్రామంఅంతిమదినాల్లో పోలండ్‌లోని రష్యన్ సైన్యాల కితడే ఆధిపత్యం వహించాడు. పోలండ్‌లో ఇతని పరపతి బలంగా ఉంది.

ఈ పరిస్థితికి కారణం తూర్పు యూరప్‌లో యుగోస్లావియాతప్ప మిగతా దేశాలమధ్య సహకారం ఆదర్శప్రాయంగా ఉంది. పశ్చిమ యూరప్‌లో నానాటికీ వైషమ్యాలు, పోటీలు పెరుగుతున్నాయి.

ఇదే రష్యాకు రక్ష అని వారికి తెలుసును. అటువంటి సహకారం పశ్చిమయూరప్‌లో సాధించడంకోసమే అమెరికా కృషి చేస్తోంది.

పశ్చిమజర్మనీఆదరసహకారాల్ని సాధిస్తేగాని పశ్చిమ యూరప్‌దేశాలమధ్య సహకారం వ్యర్థమౌతుందని అమెరికాకు తెలుసును. కాని ఫ్రెంచి, బ్రిటిష్ ప్రభుత్వాల వైరుధ్యాన్ని పోగొట్టి వారి సమ్మతిపై సహకారం సాధించడం దుష్కరమౌతున్నది. ఇందులో జాప్యం తప్పదు. ఈ వ్యవధిలోనే పశ్చిమ జర్మనీలో రాజకీయపక్షాలమధ్య వైషమ్యాలను పెంపొందింపచేసి దుర్బలపర్చడమే రష్యా ఆశయం. ఈ కార్యానికి తూర్పు జర్మనీ సర్వశక్తులూ వినియోగిస్తుందనుకోవచ్చును.

[సూర్యం]

ఆంధ్రజిల్లాలలో శాసనసభానియోజకవర్గాలు

శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య

నవభారతరాజ్యాంగం 1950 జనవరి 26 వ అమలులోకి వస్తుందని, ఆనాటితో ఇదివరకు బ్రిటిషు ప్రభుత్వంతో వున్న అన్ని సంబంధాలు తెగతెంపు లవుతవని, ఒక సంవత్సరంలో నూతన శాసనసభలకు ఎన్నికలు జరుగుతవని, దానిలో ప్రప్రథమంగా వయోజనులు అందరు వోటు చేస్తారని, అనేకపక్షాలు ఈ ఎన్నికలలో పాల్గొంటవని రాజ్యాంగపరిషత్తు అధ్యక్షులు శ్రీ రాజేంద్రప్రసాద్ ఈ నెల (నవంబరు) 3 వ తేదీ రాంచీలో అన్నారు.

అయితే రానున్న శాసనసభలను, సభ్యుల సంఖ్యను గురించి జిల్లాలవారీ అంచనాగా మద్రాసు ఆర్థికమంత్రి అక్టోబరు 22 వ తేదీ ఒక ప్రకటన చేశాడు. అందులో లక్ష జనాభా కొక సభ్యు డుంటాడని, హరిజనులకు ప్రత్యేక స్థానాలు యేర్పరచబడునని వాటి అంకెలుకూడా తెలియజేశారు. వాటినిబట్టి ఆంధ్రజిల్లాల కీక్రింది విధంగా సభ్యు లుంటా రన్నారు.

శాసనసభ్యులు

జిల్లా	హరిజన్	సాధారణ
ఉత్తరవిశాఖపట్నం	2	16
దక్షిణవిశాఖపట్నం	2	15
తూర్పుగోదావరి	4	16
పశ్చిమగోదావరి	3	11
కృష్ణా	2	12
గుంటూరు	2	21
నెల్లూరు	3	13
కడప	1	10
అనంతపురం	2	10
చిత్తూరు	3	13
బళ్లారి	3	9
కర్నూలు		10

ఇంకా వెనుకపడిన జాతులు ఆదివాసులకు స్థానాలు ఉన్నవి.

ఇంతవరకు జిల్లాలవారీసభ్యత్వస్థానం అర్థం చేసుకున్నాం. వీటితోబాటు జిల్లాల జనాభా కూడా తెలిసివుండడం సమగ్రంగా అవగతంచేసుకోవడానికి వీలుంటుంది. అందుచే హరిజనుల జనాభా అసలుమొత్తం జిల్లాలవారీజనాభా ఈ క్రింద గమనించండి.

1941 జనాభా

జిల్లా	హరిజనులు	మొత్తం
విశాఖపట్నం	326413	3845944
తూ. గోదావరి	402828	2161863
ప. గోదావరి	348476	1389018
కృష్ణా	211427	1442294
గుంటూరు	1655627	2277289
కర్నూలు	191743	1446525
బళ్ళారి	155026	1081009
అనంతపురం	173441	1171419
చిత్తూరు	303225	1632395
నెల్లూరు	256018	1617026
కడప	132582	1056507

ఈ పై అంకెలను గమనించినపుడు బళ్ళారి విషయం ప్రత్యేకంగా యోచనచేయవలసివుంది. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ ఆచరణనుబట్టి బళ్లారిలో ఆలూరు, ఆదోని, రాయదుర్గం తాలూకాలు మాత్రమే ఆంధ్రరాష్ట్రంలోకి చేరుతవని సాధారణంగా దలంచవలసిఉంటుంది. ఆ మూడు తాలూకాల మొత్తం జనాభా 419499 అని అందులో 58279 మంది హరిజనులుంటారని గమనిస్తే కర్నాటకరాష్ట్రం యేర్పడేటంతవరకు బళ్ళారిజిల్లా ఆంధ్రరాష్ట్రంలోనే వుంటుందంటే పై జాబితా ప్రకారం లేకపోతే నలుగురు సభ్యులు ఉంటారని, అందులో ఒక హరిజనే వుంటాడని తలంచవలసివుంది.

ఇంతవరకు జిల్లాల పరిస్థితిని పరికించగలిగాం. ఇక జిల్లాల వారీ సభ్యత్వాలకు నియోజక వర్గాలను జిల్లా కలెక్టరులు నిర్ణయించుతారని ఆర్థికమంత్రి అక్టోబరు 22 ప్రకటనలో సూచించి యున్నాడు. దీనినిబట్టి జిల్లా కలెక్టరులు ఏవిధముగానో ఒక విధంగా ఇప్పటికి నిర్ణయించి యున్నారని అవే మొన్న నాల్గవతేదీ మంత్రి మండలి చర్చించినదని తలంచవలసివుంటుంది. అసలు ఈ విభజన యేవిధంగా చేసిఉంటారో - ఏవిధంగా లోపాలు సంభవిస్తవో దృష్టిలో వుండుట కొరకు కొంత ఉదాహరణం పరికిద్దాం.

ఉదాహరణకు గుంటూరుజిల్లా తీసుకోండి. గుంటూరుజిల్లాకు సాధారణసభ్యత్వం 21 న్ని, హరిజనసభ్యత్వం రెండున్నూ యివ్వబడినట్లు ఆర్థికమంత్రిప్రకటన తెలియజేస్తున్నది. గుంటూరుజిల్లాలో 9 తాలూకా లున్నవి. వాటి జనాభావివరాలీ క్రిందివిధంగా వున్నవి.

గుంటూరు జిల్లా

తాలూకా	హరిజనులు	జనాభా
సత్తెనపల్లి	20004	237345
గుంటూరు	28540	366193
తెనాలి	18116	299129
రేపల్లె	15691	116279
బాపట్ల	18987	335283
ఒంగోలు	36567	311740
నర్సారావుపేట	18945	254912
వినుకొండ	4662	114090
పల్నాడు	9114	192309
మొత్తం	1655627	2277279

దీనినిబట్టి హరిజనులలో జిల్లా మొత్తానికికలిపి ఉన్న 2277 వేల మంది లక్ష కొకటి చొప్పున 23 స్థానాలు నిర్ణయించారు. అందులో 160 వేల హరిజనులకు ఇరువురు హరిజనుల సభ్యత్వాన్ని నిర్ణయించారు. ఇది సాధారణంగా సబబుగనే ఉంది.

ఇక వచ్చే వివరం ఈ 22 స్థానాలను ఏ విధముగా నియోజకవర్గాలు నిర్ణయించడం అనేది. ఈ హరిజనసభ్యత్వానికి జిల్లాను రెండు నియోజక వర్గాలుగా చేయుడం జరగవచ్చు. లేదా గుంటూరు, సత్తెనపల్లి తాలూకాల కొకటి, ఒంగోలు బాపట్ల తాలూకాల కొక సభ్యత్వం గానూ నిర్ణయించవచ్చు.

ఇక జనరల్ స్థానాలు. తాలూకాలవారీగా నిర్ణయానికి ముందు పట్టణనియోజకవర్గాలను గురించి కూడా యోచించవలసివుంటుంది. గుంటూరుజిల్లాలో ఒంగోలు, చీరాల, నర్సారావుపేట, తెనాలి, గుంటూరు మ్యునిసిపాలిటీ లున్నవి. వీటిజనాభా, గుంటూరు 82986, తెనాలి 40,639, ఒంగోలు 26655 చీరాల 27086, నర్సారావుపేట 17645 మందిగా 1941 లో వుంది. ఇపు డింత పెరిగినా అంచనాలన్నీ 1941 జనాభానుబట్టియే వేస్తున్నందున మనంకూడా అటులే ఆలోచించాలె. ఇదివరకు వలె గుంటూరు, తెనాలి కలిపి ఒక సీటు, లేక ఈరెండుకలిస్తే 120 వేలు అవుతుంది కావున 750000 లకు తగ్గకుండా ఒకసభ్యత్వంవుండవచ్చునని రాజ్యాంగపరిషత్తు నిర్ణయం వున్నందున గుంటూరుకు 82 వే లున్నదిగావున ఒక నియోజకవర్గంగా నిర్ణయించడం జరగవచ్చు. అయితే మిగతి మ్యునిసిపాలిటీల నన్నింటిని కలిపతే 12 వేలు వస్తుంది. అందుచే మిగత మ్యునిసిపాలిటీల నన్నింటిని కలిపి ఒక నియోజకవర్గం యేర్పడవచ్చు. లేక క్రిందటి నియోజకవర్గాల మాదిరే మునిసిపాలిటీలను గ్రామ నియోజక వర్గాలల్లో కలిపివేయనూవచ్చు.

చూడండి. విశాఖజిల్లాలో ఇదివరలో శ్రీకాకుళం (22249) అనకాపల్లి (29219) భీమునిపట్నం (9914) విజయనగరం (51749) విశాఖపట్నం (70243) మ్యునిసిపాలిటీలు జనాభా కలిగియున్నవి. అయితే ఒక విశాఖపట్నానికి పట్టణ నియోజకవర్గం యేర్పరచి మిగత మ్యునిసిపాలిటీలను గ్రామనియోజకవర్గాలలో కలిపారు. అటులే తూర్పు గోదావరిజిల్లాలో రాజమహేంద్రవరం (74564) పెద్దాపురం (20835) లను గ్రామనియోజకవర్గాలలో కలిపి కాకినాడ (75140) కి పట్టణ నియోజకవర్గ మొసంగుకవి.) యిచ్చారు కృష్ణాజిల్లాలోనూ, గుంటూరు జిల్లాలోనూ మరొకపద్ధతి అవలంబించి బందరు (59146) బెజవాడ (86184) లను కలిపి నియోజకవర్గంచేశారు. గుడివాడ (23919) ను గ్రామ నియోజవర్గంలో కలిపారు. గుంటూరు జిల్లాలో గుంటూరు తెనాలి పట్టణాలను కలిపిపట్టణ నియోజకవర్గాన్ని చేసి మిగతావాటిని ఒంగోలు, చీరాల, నర్సారావుపేటలను గ్రామనియోజక వర్గాలలో కలిపారు. ఇక మిగతా ఆంధ్రజిల్లాలల్లో అన్నింటిలోనూ మిగిలిన

నెల్లూరు	56315
చిత్తూరు	27835
తిరుపతి	20148
హిందూపురం	19049
అనంతపురం	21482
తాడిపత్రి	15184
కడప	28246
ప్రొద్దుటూరు	26961
నంద్యాల	25886
కర్నూలు	45250
ఆదోని	35481
బళ్లారి	56149
హాస్పేట	
ఏలూరు	64911
పాలకొల్లు	19869

మ్యునిసిపాలిటీలను గ్రామనియోజకవర్గాలల్లోనే కలిపివేశారు, ఈనాడు వీటికి అదనంగా గుంతకల్లు ఒకటి యేర్పడిందది. పై జిల్లాలో భీమవరం, అమలాపురములకు నూతన మ్యునిసిపాలిటీలు యేర్పడినవి. (చీరాల పేరాల ఇదివరకు మ్యునిసిపాలిటీయే. ఈమధ్య రద్దుచేసి మరల మునిసిపాలిటి చేశారు) ఏలూరుపట్టణాన్ని బళ్లారిపట్టణాన్ని సాధారణ నియోజకవర్గాల విషయం గ్రామనియాజకర్గాలలోనే కలిపివేస్తూ, స్త్రీల స్థానాలకుమాత్రం ఈ రెండుపట్టణాలను స్త్రీల ప్రత్యేక నియాజకవర్గాలు చేశారు.

ఈ పరిస్థితుల నన్నింటిని గమనిస్తే గుంటూరు జిల్లాలో మ్యునిసిపాలిటీలను కలిపి నియోజకవరం చేస్తారో-లేక అసలు పట్టణ నియోజకవర్గాలు ఎత్తివేసి గ్రామనియోజకవర్గాలు చేస్తారో ఊహించలేము. ఇప్పటికే నియాజకవర్గాల నిర్ణయం అయియుండవచ్చును. గాని తెలియజేయుటలేదు గావున తేల్చజాలము. అయినా యిస్తే గుంటూరును ఖచ్చితంగా ఒకదానినే పట్టణస్థానం చేయవచ్చు.

ఇక తాలూకాల వారీగా పరిశీలన చేద్దాం. గుంటూరు బస్తీని మినహాయించితే గుంటూరు తాలూకా జనాభా 2,83,7o7 అవుతున్నది. అంటే గుంటూరు బస్తీలోకి 20 వేల జనాభా తక్కువను సరిపూడ్చుకుంటే ఇక ఖాయంగా రెండుసీట్లు యేర్పడుతవి. ఇంకా 63 వేల జనాభా మిగిలిపోతుంది. దీనినిబట్టి చూస్తే ప్రతి తాలూకాలో లక్షలసంఖ్యనుబట్టి జనాభా సీట్లకు ఖచ్చితంగా లెక్క తేలక లక్షలకొకరు వంతున ఒకటి, రెండు మూడు సీట్లవరకు రావడం ఇంకా జనసంఖ్య మిగిలిపోవడం జరుగుతుంది. అంటే చివరకు ఒక తాలూకాలో నియోజక వర్గాలు జనాభాలమీద ఆధారపడి తేల్చవలసివస్తున్నది. ఇది మరింత గజిబిజిచేయగలుగుతుంది.

ఇందు కుదాహరణగా సత్తెనపల్లి తాలూకా తీసుకుందాం. జనభా 237 వే లున్నది. అందువల్ల రెండు సీట్లు యేర్పడతవి. అయితే ఇంకా 37 వేల జనాభా మిగిపోతుంది. ఈ తాలూకాలో అయిదు ఫిర్కా లున్నవి. వాటిజనాభా పరికించుదాం. (ఈ అంకెలు ఒకేచోట పరుసగా లభించనందున కొద్దికొద్ది తేడాలు కనుపించుతవి.)

సత్తెనపల్లి తాలూకా ఫిర్కాలు.

	ఫిర్కా	జనాభా
1.	సత్తెనపల్లి	59238
2.	ఫిరంగిపురం	56894
3.	పెదకూరపాడు	49529
4.	అచ్చమ్మపేట	38582
5.	బెల్లంకొండ	38911

ఇందులో తెలిసినదాన్నిబట్టి బెల్లంకొండ ఫిర్కాలోనున్నూ, అచ్చమ్మపేట ఫిర్కాలోన్నూ 38 వేలమంది జనాభా వున్నారు సత్తెనపల్లి తాలూకాలో రెండు సీట్లు పోను 37 వేల జనాభా మిగిలిపోతున్నది. అందువల్ల ఈ ఫిర్కాలలో రెనిటో ఒకదానిని అవతల తాలూకాకు వేయటానికి ప్రయత్నిస్తున్నారు. మిగిలిన నాలుగు ఫిర్కాలకు రెండుస్థానాను యేర్పరుస్తారు. ఇందులో ఇతర ఫిర్కాలలు తగ్గించ దలంచితే అది మరొక తాలూకాలో కలుపడానికి అందుబాటులో వుండే సౌకర్యం వుండాలె. ఫిర్కా మొత్తంకలపలేకపోతే, గ్రామాలు కొన్ని విభజించి కలపలేకయా అనీ ఆలోచిస్తారు. ఏదైనా చేయడం కూడా జరుగుతుంది అయితే సామాన్యంగా ఫిర్కానే కలుపడానికి ప్రయత్నిస్తారనే తలంచవచ్చునేమో."

అయితే మిగిలినవాటిలో కొంత అసమానత చూపడం కూడా సరియైనది కాజాలదు. చూడండి ఉదాహరణకు ఈపై అయిదు ఫిర్కాలల్లో ఫిర్కా జనసంఖ్య లక్షకుమించిందిగా వున్నప్పుడు మరొక తాలూకాలో కలుపుటకు ప్రయత్నించినపుడు బెల్లంకొండ, అచ్చమ్మపేటలు కలుప ప్రయత్నిస్తారు. అచ్చమ్మపేటకు పల్నాడుకు అడవులు అడ్డంకి. రహదారి లేదు. అందువలన బెల్లంకొండను మరొక తాలూకాలో కలుపవచ్చు. అపుడు మిగిలేది తాలూకాలో రెండులక్షలు జనాభా అవుతుంది.

అయితే అటుతరువాత ఫిర్కాల నెటుల కలుపవలెననునది యోజన చేస్తారు. దీనిలో చాలా అసమానతలు చూపబడడం సహజం. కాని అది అసమంజసం. యెట్లులంటే మిగత నాలుగు ఫిర్కాలు రెండు సీట్లు చేయవలెగదా. అందువల్ల మిగిలిన ఈ నాలుగు ఫిర్కాలను ఏదో రెండువిధాలుగా విభజించవచ్చునని యెవరైనా తలుస్తారు. (1) సత్తెనపల్లి - ఫిరంగిపురం (2) ఫిరంగిపురం - పెదకూరపాడు (3) పెదకూరపాడు - అచ్చమ్మపేట (4) అచ్చమ్మపేట - సత్తెనపల్లి (5) సత్తెనపల్లి - పెదకూరపాడు (6) అచ్చమ్మపేట ఫిరంగిపురములుగా ఏదో రెండు చేయవలసియుంటుంది. అయితే భౌగోళికపరిస్థితులనుబట్టి అచ్చంపేట - ఫిరంగిపురం కలుపుటకు వీలులేదు. అందుచే ఇక అచ్చమ్మపేట - పెదకూరపాడు; పెదకూరపాడు - ఫిరంగిపురం; ఫిరంగిపురం - సత్తెనపల్లిలో, యే రెండో విధాలు చేయవలసివుంటుంది.

ఈ రెంటిని కలుపడంలో సమానంగా గమనించవలసివుంటుంది. సత్తెనపల్లి - ఫిరంగిపురం ఫిర్కాలు కలిస్తే 1,16,128 మంది, అచ్చమ్మపేట - పెదకూరపాడు కలిస్తే 88,440 మంది జనాభాతో వుంటుంది. అయితే 75 వేల జనాభాకు ఒక సీటు తగ్గకూడదన్నది సరిపోవచ్చుగాని ఒకే తాలూకాలో 37 వేలు మరొక తాలూకాలో కలుపగా, ఆ తాలూకాలోనే ఒక నియోజకవర్గముకు మరొక నియోజకవర్గముకు జనాభా తేడా 37 వేలు వుండడం అసం

(18-వ పేజీ చూడుడు)

కథానిక



శ్రీ 'అమరేంద్ర'

ఆనోటా ఆనోటా పడి తెల్లవారేసరికే ఆవార్త ఊరంతా పాకిపోయింది. "రామదాసు పోయాడుట, పాపం రామదాసు చచ్చిపోయాడుట" అనే మాటలు అన్నివైపులనుంచీ ఒక్కసారిగా వినిపించినయ్. ఎవరమటుకు వారు ఈవార్త అబద్ధమేమోనని అనుమానపడుతునే ఆపుకోలేక ఇంకోళ్ళకి చెబుతున్నారు. ఈవార్త నమ్మటానికీ వీలులేకుండా వుంది. నమ్మకుండా వూరుకోటానికీ అంతకంటె వీలులేకుండా వుంది. అందరికీ ఈ వార్త అబద్ధమైతే బాగుండు ననిపిస్తోంది. కాని ఇటువంటి అబద్ధం ఎవరైనా ఎందుకు కలిపిస్తారు? అందులో అందరికీ తలలో నాలుకగా వుండే రామదాసుమీద ఇటువంటి పాడు అబద్ధం ఎవరు కల్పిస్తారు? చాలాసేపు తటపటాయించి సిద్ధాంతరాద్ధాంతాలు చేసి చివరికి ఎల్లాగైతేనేం అంతా రామదాసుమరణవార్తని చేదుమాత్రలాగా మింగారు. అతని కోసం అంతా రకరకాలుగా విచారపడటం సాగించారు.

మరణవార్త నిజమని నమ్మగానే అందరికీ రామదాసు ఎల్లాచచ్చిపోయాడో, ఏపరిస్థితుల్లో చచ్చిపోయాడో తెలుసుకోవాలనేకోరిక ఎక్కువైపోయింది. అప్పటికప్పుడే చాలామంది బుద్ధిమంతుల బుర్రలు చురుకుగా పనిచెయ్యటం మొదలుపెట్టినై. ఆత్మహత్య చేసుకునివుంటాడని కొందరు వూహించారు. అతను అటువంటి పిరికిపంద కాడు. ఆపని ఎప్పుడూ చెయ్యడని కొందరు ఖండించారు. ఎక్కడో ఎవరో చంపేసి వుంటారని కొందరు ఊహాగానం చేశారు. ఎక్కడైనా దొంగచాటుగా సారా దొరికితే ఇన్నాళ్ళవిలువా ఒక్కనాడే చెల్లించి వూరుకొంటాడనీ, తాగుడువల్లే ప్రాణం పోయివుంటుందనీ కొందరు అన్నారు. రకరకాల ఊహలు గాలిలో తేలిపోతున్నయ్. ఏమయితేనేం, ఎల్లాపోతేనేం, రామదాసు ఇక లేడనే నిష్ఠురసత్యం అందరి ముందూ నగ్నంగా నిలబడి అందరి కళ్ళనీ తడిపి వేయసాగింది.

ఇంతలో రామదాసుఆంతరంగిక మిత్రుడు భీమారావు పొరుగూరువెళ్ళి అప్పుడే ఊళ్ళోకి వచ్చాడనే కబురు తెలిసి అంతా అతని దగ్గరికి పరిగెత్తి అతన్ని చుట్టుముట్టారు. నిజమేనా అని నిలవేసి అంతాగుచ్చి గుచ్చి అడిగారు. వీరిసందేహాలకి బిత్తరపోయి భీమారావు చివరికి అందరికీ విశ్వసనీయంగా వుండే ఈ విచిత్రఘటనని పూస గుచ్చినట్లు కళ్ళకి కట్టేట్లు చెప్పటం మొదలుపెట్టాడు. టూకీగా చెప్పాలంటే—

తనూ రామదాసూ కలిసి కృష్ణానదిలో ఉపద్రవంగా వచ్చిన వరదలని చూద్దామని వెళ్ళారు. ఒడ్డున నిలబడి చూస్తుంటే వరదలోపడి ఒక గుడిసె కొట్టుకువస్తూ కనిపించింది. ఆ గుడిసె చూరికొప్పుమీద ఒక అయిదేళ్ళకుర్రాడు జాలిగా ఏడుస్తూ కొట్టుకొస్తున్నాడు. చూసీ చూడగానే ముందు వెనక లాలోచించకుండా రామదాసు అమాంతంగా నదిలోకి ఒక్క దూకు దూకాడు. చూస్తూవుండగానే పరవళ్లు తొక్కుతున్న ఆప్రవాహంలో పడి కంటికి కనిపించకుండా కొట్టుకుపోయాడు. ఒడ్డునున్న జనమంతా ఈవిడ్డూరాన్ని చూడలేక గుండెలు బాదుకున్నారు. ఇదీ కథ.

వినగానే "అయ్యోపాపం! ఎల్లాంటి వాడికి ఎల్లాంటిచావు! ఎంత మొండిసాహసం!" అని ఒక ముసలాయన కళ్లు తుడుచుకున్నాడు.

"అసలామనిషి తీరే అంత. అడ్డగోలు మనిషి. తనకి ఎంత తోస్తే అంతా ఆ నిమిషంలో చేస్తేనే కాని నిద్రపట్టదు" అని ఒక పడుచాయన వాఖ్యానం చేశాడు.

"సరేకాని ఇప్పుడు మనం ఏం చెయ్యాలి? ఇకముందు సంగతేమిటి?" అనే ప్రశ్న బయలుదేరి అందరినీ కలవరపరుస్తోంది. తలా కరికీ తలోక ఆలోచనా తట్టుతోంది

దీనికి సమాధానంగా "చేసేదేముంది? ఏం చేసినా పోయినవాడు తిరిగిరాడు కదా?" అని ఒక మెట్టవేదాంతి అన్నాడు.

"ఆమాత్రం మాకూ తెలుసోయ్. ఏమీ చెయ్యటం ఇష్టం లేకపోతే తమ రిక్కడినుంచి దయచెయ్యొచ్చు" అని ఒక విద్యార్థి దుడుకుగా బదులు చెప్పాడు.

ఈవార్త వినగానే అక్కడికి విద్యార్థులు గుంపులు గుంపులుగా ముసురుకున్నారు. ఆ గుంపులోంచి ఒకవిద్యార్థి "ఇక్కడే మన మొక స్మారకసభ జరిపి రామదాసుఆత్మకి శాంతి కలగాలని తీర్మానం చేద్దాం." అని ఒక విద్యార్థి సూచించగానే అంతా అంగీకరించారు.

ఇంతలో అక్కడికి గుండెలు బాదుకుంటూ కిల్లీకొట్టుపుల్లయ్యా కిరానాకొట్టుమల్లయ్యా పరుగుపరుగున వచ్చారు "నిజమేనా బాబూ? పిడుగులాటి కబురు విన్నాం. ఇవాళ ఎవరి మొహం చూసి లేచామో? మా రామదాసు చచ్చిపోయాడుట నిజమేనా?" అంటూ ఎంతో ఆదుర్దాగా అడిగారు. అక్కడగుమిగూడిన జనం కేసి చూసేసరికీ వారి సందేహం ఎగిరిపోయింది. కుప్పన కూలబడిపోయారు.

ఈ కబురు వినీ వినటంతోటే నేలకి కర్ర పొడుచుకుంటూ ఒక మూడుకాళ్ళ ముసలమ్మ దడదడలాడుతూ వచ్చి కబురు నిజమని తెలియగానే నిలువునా నీరైపోయి చతికిలబడింది. "పండులాటివాడికి రాకపోతో నాలాటి పాపిష్ఠి ముండకు రాకూడదూ చావు? అయ్యో నాకింకెవరు ఉత్తరాలు రాసిపెడతారు. దూరదేశాల నుంచి అబ్బాయిరాసిన ఉత్తరాలు ఇంక నాకెవరు చదివి వినిపిస్తారు?" అని ఒక్క శోకం పెట్టేసరికీ అందరి కళ్ళలోనూ నీళ్లు గిర్రుక తిరిగినై.

ఇందాకటినుంచీ దిగాలుపడి కూచున్న కిల్లీకొట్టు పుల్లయ్య మూర్ఛనుంచి తేరుకున్న వాడిలాగా "అల్లాటి మనిషి మళ్ళీ కనిపిస్తాడా? స్నేహానికి ప్రాణం ఇచ్చేవాడు. కొట్టుమీద కాసేపు కూచుంటేచాలు నవ్వులతో కడుపుబ్బిపోయేది. అంత సరదా మనిషిని ఇక చూడలేం" అని నిట్టూర్పు విడిచాడు.

"అవునవును. ఈ కలిలో ఇక అల్లాటి మనిషిని చూడటం కల్ల. ఇంక నాకు బేరం ఏం సాగుతుంది? నెలాఖరు వచ్చేసరికీ లెక్కలన్నీ చూసి పెట్టేవాడు. తలలో నాలుకలాగా వుండేవాడు. ఎప్పుడూ కానీ కావాలని అడిగినపాపాన పోలేదు. ఎల్లా కాలం వెళ్ళదీసేవాడో ఎవరికీ తెలిసేది కాదు. అతని ఋణం ఎల్లా తీర్చుకోగలను?" అని కిరానాకొట్టు మల్లయ్య తన ఆక్రోశం వెళ్ళబోశాడు. ఇది విని పక్కనే నిలుచున్న ఘరానా పెద్దమనిషి ఒకాయన "ఇదుగో నీ ఋణం తీర్చుకునేటందుకునే నొక ఉపాయం చెబుతున్నాను. రామదాసువిగ్రహం ఒకటి తయారుచేయించి బజార్లో అందరికీ కనిపించే చోట పెట్టించు" అన్నాడు. "ఓ దానికేం భాగ్యం? తప్పకుండా చేస్తాను" అని మల్లయ్య అనగానే అంతా సంతోషంతో చప్పట్లు కొట్టారు.

ఇంతలో ఉద్రేకంతో ఒక విద్యార్థి లేచి నిలబడి "రామదాసు అసలు మావాడు. అతను విద్యార్థుల్లో విద్యార్థి. మాతో రాజకీయాలని గురించీ సినిమాలనిగురించీ గంటలకొద్దీ చర్చలు జరిపేవాడు. ఏవేవో కబుర్లుచెప్పి నవ్వించేవాడు. బతిమాలితే మాతోనే భోజనంచేసి మా గదుల్లోనే నిద్రపోయేవాడు. అతను మాకందరికీ ఆప్తబంధువు, ప్రాణమిత్రుడు. ఆయనమరణం మాకు తీరని నష్టం. అతను లేకపోతే మా హాస్టలుకి కళకాంతులే లేవు" అని కంపించే గొంతుకతో చిన్న ఉపన్యాసం ఇచ్చాడు.

"కాదు కాదు రామదాసు మావాడు. నిజంగా మావాడు" అని కిల్లీకొట్టు మల్లయ్య బిగ్గరగా కేక వేశాడు.

"కాదు, కాదు, ఎవరివాడూ కాడు. రామదాసు నిజంగా మావాడు. ముమ్మాటికీ మావాడు. పార్కుదగ్గర చెట్టుకింద నిలబడి తాజావార్తలు చెబుతూ తర్జనభర్జనలు చేస్తుంటే దారిన పోయే వాళ్ళంతా గుంపులు కూడేవాళ్లు. అతను లేకపోతే ఇక ఆ పార్కుముఖం ఎవరు చూస్తారు? దాని దశ అతనితో ఆఖరు" అని ఇంకో నడికారు మనిషి నిశ్వాసం విడిచాడు.

ఇంతలో అక్కడికి "పేపర్ పేపర్" అని అరుచుకుంటూ ఒక కుర్రాడు వచ్చాడు. ఆ పేపర్లోకూడా రామదాసుమరణవార్త ప్రకటితమయింది. ఫొటోకూడా పడింది. దానికింద అతని ప్రాణస్నేహితుడు భీమారావు కన్నీటి కానుకగా సమర్పించిన పద్యంకూడా అచ్చువేశారు. శంఖున పోస్తేకాని తీర్థం కాదు. పత్రికలో పడితేకాని సత్యం కాదు. ఇక రామదాసు లేడని అంతా రూఢి చేసుకున్నారు.

ఇందాకటినుంచీ దిగాలుపడి కూచున్న భీమారావు లేచి నిలుచుని గద్గదస్వరంతో "రామదాసు మీవాడా మావాడా అని మనలో మనం వివాదపడి లాభం లేదు. అతను మనకందరికీ కావలసినవాడు" అనేసరికీ "సెబాస్ నిజం, నిజం" అని కిరానాకొట్టుమల్లయ్య మెచ్చుకున్నాడు.

ఒక విద్యార్థి లేచి "భీమారావుగారూ, మీరు మన రామదాసునిగురించి ఏమైనా మాట్లాడితే విందామని మేమంతా తహతహలాడుతున్నాం" అన్నాడు.

భీమారావు ఇల్లా అందుకున్నాడు. "రామదాసునిగురించి మీకు తెలియందేముంది? మీలాగే అతనుకూడా చదువుకోసం మొదట ఈవూరు వచ్చాడు. చాలా తెలివైనవాడు. చాలా అందంగా వుండేవాడు. చాలా బాగా చదివేవాడు. తల్లిదండ్రులు అతనిమీద కొండంత ఆశపెట్టుకున్నారు. అప్పుడు క్లాసులో మాధురి అనే ఒక అందమైన అమ్మాయి చదువుతుండేది. ఆ అమ్మాయిని ప్రేమించి ఒకదేవతగా ఆరాధించటం, తన ప్రేమని కావ్యాలలో చిత్రించి ఆమెకి అంకితం చెయ్యటం, అందరం రామదాసుని ప్రేమదాసని ఎగతాళి చెయ్యటం జరిగింది. ఈప్రేమ గొడవలో చదువు సున్నా చుట్టింది. ఇంటిదగ్గిర తల్లిదండ్రుల ఆశలన్నీ కొండెక్కినయ్. ఇల్లావుండగా ఒక రోజున అకస్మాత్తుగా మా క్లాసులోనే చదువుతున్న ఇంకో ధనవంతుడికీ మాధురికీ వివాహం జరిగింది. అప్పటినించీ రామదాసు పూర్తిగా మారిపోయాడు."

"అయితే మన రామదాసు భగ్నహృదయుడన్నమాట! కాని తన లోపలి దుఃఖాన్ని చిరునవ్వులో దాచుకునేవాడు" అని వ్యాఖ్యానించాడొక విద్యార్థి.

"అంతేకాదు రామదాసు గొప్ప ప్రేమయోగి. తన ప్రేమని ధ్వంసంచేసి తన జీవితాన్ని నాశనంచేసిన మాధురినే హృదయమందిరంలో భద్రంగా ప్రతిష్ఠించి నిత్యమూ ఆరాధించేవాడు. నిజంగా అతను ప్రేమయోగి" అని భీమారావు అనేసరికీ గుంపులో ఒకమూలనుంచి "తాగుబోతు", ఇంకోమూలనుంచి "జూదరి", మరోకమూలనుంచి "పనికిమాలినవాడు" అని గుసగుసలు వినిపించినయ్.

"అయితేనేం? అల్లాటి మనిషి ఎక్కడ దొరుకుతాడు? అటువంటి జాలిగుండె ఎవరికుంది? అతను తాగుబోతు కాదు. మాధురిని పొందలేని దుఃఖాన్ని మద్యంవల్ల మరిచిపోయేవాడు" అని భీమారావు కూచున్నాడు అంతా అల్లాటి మనిషిని ఇక చూడటం కల్ల అని ఒప్పుకున్నారు.

"ఏమండోయ్ మల్లయ్య సెట్టిగారూ, తమరు ఇచ్చినమాట చెల్లించాలి. మన రామదాసు రూపం శాశ్వతంగా మన కళ్ళ ఎదట వుండేట్లు విగ్రహం తయారుచేయించాలి." అని కిరానా మల్లయ్యగారిని ఘరానాపెద్దమనిషి హెచ్చరించాడు.

"తప్పక చేస్తాను. మీరు ఇన్నిసార్లు చెప్పాలా?" అన్నాడు మల్లయ్య. మెల్లి మెల్లిగా ఒకళ్ల తరవాత ఒకళ్లు ఇళ్ళకి జారుకున్నారు.

ఆరోజురాత్రే మాధురిభర్త పేపర్లో రామదాసుమరణవార్త చదివి భార్యకి వినిపించాడు. పేపర్లో పడిన ఫొటో కేసి చూసి మాధురి "పాపం, పోయాడా!" అంది జాలిగా. "పోయాడు. పిచ్చిప్రేమదాసు. వరదలో కొట్టుకుపోయాడు. పీడ విరగడయింది" అన్నాడు భర్త.


రామదాసుమరణం కలిగించిన విచారం క్రమేపీ తగ్గిపోతోంది. అతను లేకపోయినా ఆ వూరిజీవితం ఎప్పటిలాగా సాగిపోతునేవుంది. లాడ్జిలో కుర్రాళ్ల సినిమాచర్చలూ, పార్కుదగ్గర పనిలేని పెద్ద మనుషుల రాజకీయవివాదాలూ మామూలుగా జరుగుతునే వున్నయ్. పుల్లయ్యకీ మల్లయ్యకీ బేరం జోరుగా సాగుతునే వుంది. అతనికోసం ఆవూరి జీవితనాటకం స్తంభించిపోలేదు.

ఇల్లావుండగా ఒకరోజుపొద్దున రామదాసు అమాంతంగా ఎక్కణ్నుంచో ఊడిపడి మల్లయ్య కిరానాకొట్టుముందుకి వచ్చి నిలబడ్డాడు. చూసీ చూడంగానే మల్లయ్య వొళ్లు ఝల్లుమంది. కళ్లు తిరిగిపోయినై. ఏం భయంలేదు లేవోయ్. నేను భూతాన్ని కాను. మనిషినే" అంటూ బల్లమీద కూచుని రామదాసు సిగిరెట్ వెలిగించాడు. మల్లయ్య గబగబా దగ్గిరికి వచ్చి "ఓరినీ! ఎంత పనిచేశావ్. భలేవాడివే" అంటూ రామదాసుని కౌగలించుకున్నాడు. "ఏం లేదు. విగ్రహం చేయించేఖర్చు నీకు తప్పిద్దామని మళ్లీ వచ్చానోయ్" అన్నాడు రామదాసు చిరునవ్వుతో.

అప్పటికే జనం గుంపులు కూడి రామదాసుని చూసి ఆశ్చర్యంతో స్తంభించిపోతున్నారు. ఇదిచూసిన కిల్లీకొట్టుపుల్లయ్య సంతోషానికి పట్టపగ్గాలు లేవు. "అయితే నువ్వసలు ఎక్కడికెళ్లావ్? ఈ వార్త ఎందుకు పుట్టింది? నిజం చెప్పు?" అని నిగ్గదీశాడు. ఆ ప్రశ్నలన్నిటినీ తన తొణుకూ బెణుకూ లేని చిరునవ్వుతో ఎదుర్కొని "అరే బ్రదర్, ఖంగాశేముందిరా? నేను నిజంగా చచ్చిపోయినప్పుడు నన్నుగురించి మీరు ఏమనుకుంటారో తెలుసుకోవాలని అబద్ధంగా చచ్చిపోయాను!" అన్నాడు.

"అయితే ఇన్నాళ్లూ ఎక్కడున్నావ్!"

(17-వ పేజీ చూడుడు)



తిరుపతి


"త్రిరుమలలో ప్రభాతవిధి
        దీరిచి నీలగిరిక భుజించి కే
సరిగిరి చందనం బలది
        చల్లనిదాహము మంగళాద్రిలో,
గురురుచి ద్రావి రంగపురి
        గోమలితో పవళించునట్టి ఆ
సరసునిచేరబోవ మనసా హరి
        పాదము లాశ్రయింపుమా"
(మానసబోధశతకం)

శేషాద్రి - శ్రీశైలం

తిరుపతి ఏడుకొండలూ ఆదిశేషుని ఏడు శిరస్సులనీ, శ్రీశైలం కొండలుతోక అనీ తెలిసినవారు చెబుతూ ఉంటారు. వజ్రవైడూర్యాది మాణిక్యములతోను, మణులతోను ప్రకాశించే శేషాద్రినీ, నవరత్నయుతమైన శ్రీశైలమునూ, ముక్తిమార్గమును గోరు భక్తులకు సాధ్యమైనంత వరకు అందుబాటులో ఉండేటట్లు, సౌకర్యాలు లభించేటట్లు అధికారులు కృషి చేయవలసి ఉన్నది. ఆగర్భ శ్రీమంతుడైన శ్రీ శ్రీనివాసునీ, కాసవీసమునకు కొరగాని ఆ శ్రీశైలేశునీ శివకేశవభేదము లేకుండా దీప్తితో, రక్తితో, భక్తితో, యాత్రికులు సేవిస్తూ ముక్తిమార్గమున భగవంతుని సన్నిధానమును చేర అభిలషిస్తూ తపస్సుచేస్తూ ఉంటారు.


దర్శనీయములు

దిగువతిరుపతిలో శ్రీ గోవిందరాజస్వామి, శ్రీరఘునాథస్వామి, కపిలేశ్వరస్వామి, అలమేలు మంగతాయారు, చంద్రగిరిలో కల్యాణీతీరమున వెలసిన కల్యాణవెంకటేశ్వర్లూ ప్రధానముగా చూడతగినవారు. కపిలతీరమున కొండలనుండి పడేజలపాతమునకు కొలనుగట్టి, స్నానాదికము చక్కనిసౌకర్యములు చేశారు. కానిపాపనాశనం దగ్గర పేరుకునే పాకుడునుగూడా తీయించే దిక్కు లేకుండా ఉన్నది. అక్కడ చేరిన పాకుడుకి పెద్దవాళ్లు, చిన్నవాళ్లూగూడా కాలు జారినందువల్ల గుళ్లకూ, చట్టలకు, దెబ్బలకు దెబ్బలు గులుతూ అవస్థలు పడుతూఉన్నారు. కపిలతీర్థ సమీపమున రాయలకుటుంబీకులు మండపములు గోపురములు కట్టించినారు. పాపనాశనంవద్ద ప్రజాప్రతినిధులైన ఇప్పటి అమాత్యులు అట్టి నిర్మాణములు సాగించి తమ కీర్తి ప్రతిష్ఠలు చిరకాలము నిలచేట్లు చేసుకోవాలి.



కపిలతీర్థం

కపిలతీర్థం తిరుపతికి మైలున్నరదూరంలో పర్వతపాదమున ఉన్నది. ఈ తీర్థంలో మాధవుడనే బ్రాహ్మణుడు తపస్సుచేసి పాపనిర్ముక్తుడైనందున తిరుపతికి వెంకటాచలమనే పేరు కలిగింది. కపిలతీర్థంలో స్నానంచేసి పవిత్రుడైన మాధవుడు పితృదేవతలకు పృత్పిండాలు సమర్పించగా పితృదేవతలు సాక్షాత్కరించారు. ఆసమయంలో అశరీరవాణి మాధవుణ్ణి



రామస్వామిగుడిలోని

స్వామిపుష్కరిణిలో స్నా[illegible] చే[illegible] తనువు చాలించవలసి [illegible]దిగనూ ఉత్తరజన్మలో ఆకాశరాజాగా పుట్టి పద్మావతి అను కన్యను స్వామివారికి కన్యాదాన మొనర్చవలసినదిగనూ పల్కినది. ఆప్రకారమే అతడు తనువుచాలించి పుణ్యమూర్తి అయి పద్మావతికి స్వామివారికి కల్యాణం జరిపించినందున కపిలతీర్థమాహాత్మ్యం జగత్ప్రసిద్ధమైనది.

మంగాపురం


చంద్రగిరిప్రాంతమున కల్యాణీతీరమున స్వామివారి కల్యాణము జరిగిన స్థలమని ఇప్పటికీ చూపిస్తూ ఉంటారు. కల్యాణవేంకటేశ్వర్లు


శ్రీ పుల్లాభొట్ల

గిరిపై నెలకొన్న వేంకటేశ్వరులకన్న పెద్ద విగ్రహము. మంగాపురం వచ్చి అలమేలు మంగను యాత్రికులు దర్శిస్తారు. చంద్రగిరిలో రాజామహల్ రాణిమహల్ అనే చారిత్రకప్రశస్తి నందిన స్థలాలను, పాడుపడినకోటను, దర్శించుకొని ఆపూర్వవైభవము ఒక్కసారి స్మృతిపథమునకు రాగా కన్నీటిబొట్టు ఒకటి రాల్చి వెనక్కితరలుతారు.


తిరుచానూరు

తిరుచానారు అనీ, తిరుతానూరు అనీ పిలిచే





తిరుమల



సీతారామ లక్ష్మణులు

తిరుశుకనూరు తిరుపతికి మైలున్నరలో ఉన్నది. పద్మావతిఅమ్మవారు వెలసిన స్థలమిది. సూర్య భగవానునికి దేవాలయం ఉన్నది. ఈక్షేత్రాన్ని గూర్చి అనుశ్రుతంగా ఈ కథ వినవస్తోంది. త్రిమూర్తులలో మిక్కిలి శాంతమూర్తి ఎవరని పరీక్షించడానికి శ్రీ భృగుమహాముని వైకుంఠానికి చని, శ్రీమన్నారాయణుని రొమ్మున ఒక్క తన్ను తన్నాడట. తన నివాసస్థానమైన స్వామి వక్షస్థలాన్నీ విధంగా అపవిత్రం చేసినందుకు లక్ష్మీదేవి అలిగి, భూలోకానికి వచ్చేసింది. కొల్లాపురంలో కొంతకాలమూ, కపిలతీర్థంలో మరి కొంతకాలమూ తపస్సు సాగించింది. లక్ష్మి

...ంకటరామశర్మ

అన్వేషణార్థమై స్వామివారు శేషాద్రియందు ఆవిర్భవించారు. లక్ష్మీదేవికోసం శుకాశ్రమం ఉన్న శ్రీ శుకనూరులోని కొలనులో స్వర్ణ పద్మాన్ని నాటి సూర్యమహాదేవుని చూస్తూ ఒక పుష్కరం పైగా లక్ష్మీ మంత్రాన్ని జపించారు. ఇంతకాలంగా స్వామితో ఎడబాటు పొందిన అమ్మవారు పూర్ణస్వరూపముతో స్వామిని చేర ఇష్టపడలేదు. స్వామివారి ఎదుట సాక్షాత్కరించి స్వామివారు రమ్మనగా పోనిష్టపడలేదు. 'వ్యూహలక్ష్మి' అనే పేరిటగిరిపై ఉన్న శ్రీనివాసుని వక్షస్థలంలో సగం అంశతోను, శ్రీశుకనూరులో వీరలక్ష్మి అనేపేరిట మిగతా సగం అంశతోను వెలసినది. అయితే కార్తీక శుద్ధ పంచమినాడు స్వామివారు ధరించిన ఒక పుష్పమాలికనూ ఒక వస్త్రాన్నీ పంపవలసిందిగా మాత్రం అభ్యర్థన చేసింది. ఈ అమ్మవారికి ప్రతి సంవత్సరమూ రథోత్సవమునకు మరునాడు కార్తీక శుద్ధ పంచమినాడు బ్రహ్మోత్సవం జరుగుతుంది. వేనకువేలు యాత్రీకులు పాల్గొంటారు. రారాజుల మొదలు, దమ్మిడీకి టికాణా లేని దరిద్రులనుండి కైవారా లందుకున్న వేంకటేశ్వర్లు పేరుచెబితే ఈనాటికీ అందరికీ గడగడాట్. అమాత్యపదవి నభిలషించే రాజకీయవేత్తమొదలుకొని కాయకష్టం చేసి పొట్టనింపుకొన జూచే ప్రతి మానవుడూ స్వామిదర్శనాపేక్షతో కొండకు వస్తూపోతూ ఉంటాడు. ఈ ఏడాది స్వామి బ్రహ్మోత్సవంలో స్థానికశాఖామాత్యులు శ్రీ చంద్రమౌళిగారు పాల్గొని, స్వామివారికి కైంకర్యము జరిపించి, కృతార్థులయ్యారు. వేనకువేలు యాత్రీకులు స్వామి బ్రహ్మోత్సవాన్ని అతి సంరంభంతో తిలకించి కన్నులపండువ చేసుకున్నారు.

ఆచార్యపురుషుల కీర్తన


శ్రీ వేంకటేశ్వర క్షేత్రమునకు చెన్నపట్నం నుంచి కాళహస్తిమీదుగా ఒక బస్సుసర్వీసు నాగలాపురంమీదుగా మరో సర్వీసు ఉన్నవి. నాగలాపురం అనే పేరు శ్రీకృష్ణదేవరాయలు తమ తల్లిపేరిట పెట్టారని ఒక కథ ఉన్నది. అదిగాక త్యాగరాజస్వామివారిని గూర్చి ఇచ్చటనే మరోగాథ ఉన్నది. ఇచ్చటి కొండలు అతి దుర్గమమైనందువల్ల గజదొంగలకు నివాసస్థలంగా ఉండేవి. త్యాగరాజస్వామి కోవూరు సుందరేశ్వరుని దర్శించుకొని పాలకీతో నాగలాపురం సమీపానికి వచ్చారట. పాలకీలో కొంత ద్రవ్యమున్నదని దోచుకుందామని దొంగలు ఎదురొచ్చారు. అప్పుడు త్యాగరాజస్వామి శ్రీరాముని గూర్చి "ముందువెనకా ఇరుప్రక్కల తోడై" అనే కృతితో ప్రార్థింపగా రామలక్ష్మణులు కోదండధారులై దొంగల పారద్రోలారని మర్నాడు ఈ సంగతి దొంగలవల్లనే త్యాగరాజస్వామి తెలుసుకొని స్వామిదర్శనము లభించిన దొంగల భాగ్యమును పొగడారని చెబుతారు. శ్రీ త్యాగరాజస్వామి తిరుపతి కొండకు వెళ్ళి స్వామిదర్శనంచేసుకుందామనే వేళకు తెర అడ్డు వచ్చింది. అపుడు 'తెరతీయగరాదా, నాలోని మాత్సర్యమనియెడు' అనే కృతి చెప్పడంతో తెర దానంతటఅది తొలగిపోయినదట. కల్యాణమూర్తిఅయిన స్వామిని దర్శించిన త్యాగబ్రహ్మం "వేంకటేశనిను సేవింపను వేయి కన్నులు కావలెనయ్యా" అని పరమానందభరితులై పరవశులై తాదాత్మ్యం చెందారు. "అనుదినము కావుమయ్యా శ్రీ వేంకటేశ' అనే కృతి బేగడరాగంలోను 'ఉయ్యాలలూగవయ్యా' అనే కృతి నీలాంబరిరాగంలోను స్వామివారి ఆలయమున పవళింపుసేవవేళ రాగతాళములతో సంగీతప్రియులు పాడినపుడు భక్తులు వళ్లుమరచిపోయి, దివ్యసన్నిధానమున చేరినట్లు కనిపిస్తారు.

'భజగోవిందం భజగోవిందం' అని శ్రీశంకరులవారు గోవిందుని భజించుటతో భవసాగరమును ఈ నరులు తరించగలరని సూక్ష్మంలో మోక్షం చూపించారు. శ్రీ రామానుజులు, స్వామిని సేవించి కొండపైనే వెలసిఉన్నారు. ఆళ్వారులు, శ్రీవెంకటేశ్వరుని గుణకీర్తనమును అనంతంగా గానంచేసిఉన్నారు. సామాన్యురాలైన తరిగొండవేంకమాంబ స్వామిభక్తురాలై తరించి సర్వులకు తరణోపాయాన్ని చూపించింది. చిన్నఆపత్తువచ్చినా, ప్రాణంమీదకు వచ్చినా శ్రీవేంకటేశునికి ముడుపు కడితే ఆపద గడుస్తుందని భక్తుల విశ్వాసం. ఆ ఆపత్తుయొక్క వ్యగ్రతను, తీవ్రతను, వారివారి శక్తిసామర్థ్యాలనుబట్టి భక్తులు జుట్టుఇచ్చేవాళ్లు జుట్లు, కాసులిచ్చేవాళ్లు కాసులు, నిలువుదోపిళ్లు ఇచ్చేవాళ్లు నిలువుదోపిళ్లూ సమర్పిస్తూ ఉంటారు. కాని స్వామివారికి జుట్టుప్రియమైనంత మరొకటి కాదని, భక్తుల జుట్టు వారిచేతిలో ఉంచుకుంటారనీ అంటారు. కొండపైనా, కొండక్రిందాగూడా ఉపనయనాలు, వివాహాలు జరిపించుకొంటారు. కాశీమొదలు రామేశ్వరంవరకూ, శ్రీనగరం మొదలు, కన్యాకుమారివరకూ, నిఖిలభారతావనినుంచి అనుదినమూ స్వామిభక్తులు తిరుపతికివస్తూ ఉంటారు. తిరుపతి యావద్భారత ప్రశస్తిగాంచిన ప్రధాన క్షేత్రరాజాల్లో ఒకటిగా విలసిల్లుతోంది.

తిరుపతి పరిపాలకులు

తిరుమలపారిశుధ్యముకన్నా దిగువతిరుపతి పరిశుభ్రత బాగున్నట్లు యాత్రికులకు అనిపిస్తుంది. దిగువతిరుపతి స్టేషనుకు బారెడుదూరంలో రెండులక్షలు వెచ్చించి దేవస్థానంవారు కట్టించిన సత్రం యాత్రికులకు దివ్యమైన బసగా ఉంటూంది. అయితే తిరుమల దేవస్థానంకమిషనరు బి. వీరాస్వామినాయుడుగారు. తిరుపతి మున్సిపల్ కమిషనరూ మరో బి. వీరాస్వామినాయుడుగారే. వారు వయోవృద్ధులు. వీరు తరుణులు. కొండపైన 8500 జనాభాతో ఒక పంచాయితీ ఉన్నది. దానికి ప్రసిడెంటు దేవస్థానంకమిషనరుగారే. దిగువను మున్సిపాలిటీ. దీని ఛైయిర్మన్ సి. రామయ్యశెట్టిగారు. వీరు యువకులు. పిన్నలైన మున్సిపల్ ఛైయిర్మన్, కమిషనర్లూ తిరుపతిపట్నాన్ని అన్నివిధాల

(14 వ పేజీ చూడుడు)



(1) గోవిందరాజస్వామి గుడి గోపురం.


(2) గోవిందరాజస్వామి ఆలయ ధ్వజస్తంభం.


(3) తిరుచానూరు అమ్మవారి దేవాలయం—కొలను.


(4) గోవిందరాజస్వామి గుడి మండపాలు.

(5) 'ఏడుకొండలవాడా, వెంకటరమణా, గోవిందా' - కొండదిగుతున్న యాత్రికులు.

(6) కోదండరామస్వామి గుడి.







రాయవెల్లూరు హైస్కూలు పాఠశాల క్రొత్తభవనాలు

తిరుపతి - తిరుమల

వృద్ధికి తేవాలని కాంక్షతో ఉన్నారు. దీక్షా ఉన్నది. గాని మున్సిపల్ రాజకీయాల్లో ఎక్కడగాని, ఆ అధికారులు చూపించే ఉత్సాహము కార్యదీక్షకన్న తుదకు వారు సాధించిన దానిపై వారి ప్రయోజకత్వం బయటబడుతుంది. దినదినాభివృద్ధి పొందుతూన్న తిరుపతికి స్వర్ణముఖీ, కల్యాణీనదుల సంగమస్థలంనుండి మంచి నీటిని తీసుకురావాలని వీరు అహరహమూ యత్నిస్తున్నారు. కాని వీరికి కొన్ని ప్రతికూల శక్తులు అడ్డు తగులుతున్నవి. మున్సిపాలిటీ, దేవస్థానంవారు కలిసి పనిచేస్తే తిరుపతి నొక సుందరవిలసితనగరంగా రూపు తీర్చవచ్చు.

శ్రీ పాదగిరి

తిరుమలకొండ 2820 అడుగులఎత్తున ఉన్నది. కొండలలో రమణీయమైన ప్రకృతి దృశ్యాలు వాగులు, నదులు జలపాతాలు, ఊటబావులు కొల్లలుగా ఉన్నవి. శీతోష్ణస్థితి గరిష్ఠము 94° డిగ్రీలు. కనీసము 60° డిగ్రీలు. వర్షపాతము 80 దుక్కులు కొండమీద పాపనాశనమువంటి జలధారలు ఉన్ననూ, యాత్రికులకు మంచినీటి సౌకర్యమునకు అవి సద్వినియోగమునకు రాలేదు. ఏవో ప్రణాళికలు ఉన్నవి గాని వేసవిలో నీటికి కటకట కాక తప్పటంలేదు.

'మలయే భిల్లపురంధ్రీ'

తిరుమలగిరిపై అనేక వృక్షతతులు, లతలు, ఉన్నవి. ఈ శరదృతువులోనే ఒకనాటిరాత్రి పాపనాశనంనుంచి ఒక మిత్రునితో తిరిగి వస్తూండగా ఒక దిశనుండి కమ్మని పొలుపు వచ్చింది. ఏమని తిరిగిచూస్తే కొందరు కొండ జాతిఆడవాళ్లు ఏవో పుల్లలుపెట్టి వంట చేసుకుంటున్నారు. ఆ పుల్లలు మంచిగంధపు పుల్లలని మేము తెలుసుకున్నపుడు భామినీవిలాసంలోని పండితరాయలశ్లోకం నాకు స్ఫురణకు వచ్చింది.

శ్లో॥ అతిపరిచయా దవజ్ఞా
సంతత గమనాదనాదరో భవతి,
మలయే భిల్లపురంధ్రీ,
చందన తరుకాష్ఠ మింధనం కురుతే.

దేవస్థానంవ్యవహారాలు

త్వరలోనే తిరుమల సంస్థానాన్ని ప్రభుత్వంవారు వశపరచుకోనున్నారు.

అదివరకు మహంతులచే పాలింపబడుచున్న తిరుమలదేవస్థానం 1937 మద్రాసుప్రభుత్వశాసనము ననుసరించి 7 గురు సభ్యులు గల దేవస్థానకమిటీవారిచే కమిషనరుద్వారా పాలింపబడుతోంది. మూడుసంవత్సరాల కోసారి ప్రభుత్వంవారు ఈ సభ్యులను నియమిస్తూ ఉంటారు.

ఇప్పుడు ఉన్న కమిటీకి ముందు రెండు కమిటీలు కృషిచేసినవి. రామస్వామిరెడ్డిగారు ప్రధాని అయినాక ఇప్పుడు ఉండే కమిటీ వచ్చింది. ఇందులో వారు దాక్షిణాత్యుల ప్రాబల్యమును హెచ్చుచేసి స్థానికుల అభినివేశమును ఉత్సాహమును చంపివేశారనీ, అందువల్ల వ్యవహారాలు అంత చురుకుగా సాగటంలేదనీ కొందరు సభ్యులు ఈ సంగతులేమీ పట్టించుకోరని స్థానికులు చెబుతున్నారు. ఇదివరకు తిరుపతిమున్సిపల్ ఛైయర్మన్ సంప్రదాయంగా ఈ కమిటీలో ఒక సభ్యులుగా ఉండేవారు. ఇప్పుడు వారికి స్థానంలేకుండాపోయింది. వచ్చే ఫిబ్రవరిలో మూడుస్థానాలు ఖాళీ కానున్నవనీ ఈదఫాఅయినా తమకు ప్రభుత్వం వారు న్యాయం చేయరా అనీ స్థానికులు ఆశతో ఉన్నారు. ఇప్పుడున్న కమిటీలోని ఈ పేర్లు చూస్తే స్థానికులకు ఎంత ప్రమేయం ఉన్నదీ బోధపడగలదు. ప్రస్తుత కమిటీలో మద్రాసు వాసులు కత్తె వెంకటస్వామి నాయుడు ఎం. ఎల్. సి., గోపవరం వెంకటరెడ్డి ఎ. ఎల్. ఎ. దొరైకణ్ణు ఎం.ఎల్. ఎ., కులశేఖరదాస్. ఎం. ఎల్. ఎ. డి. బి. వి. భాష్యం అయ్యంగార్, మహంత్, వి. త్యాగరాజు మొదల్యారుగారలు. భాష్యంఅయ్యంగారు, శ్రీ వెంకటస్వామివంటి భక్తిపరులు ఎంతో తంటాలు పడుతూ ఉన్నారు. అయితే దక్షతతో నడుం కట్టి "మేము ఈ పనులు సాగించడానికి దీక్షు దాల్చాము" అనే సాహసికులు కనిపించడంలేదు. కొందరుసభ్యులకు కమిటీ మీటింగులు వ్యవహారముతే అంతగా పట్టలేదు. ఇప్పటి కమిషనరు వీరాస్వామినాయుడుగారు వయోవృద్ధులు, దైవభీతి గలవారు. శక్త్యానుసారము పట్టణమును బాగు చేయవలెనని అనుకుంటున్నారు. కాని ఇప్పుడు జరిగిగే యత్నము చాలదు. రిటైరు కాబోయే వారినే కమిషనరుగా వేసేపద్ధతి ప్రభుత్వం మార్చాలి. మంచి సామర్థ్యమూ, దక్షత, సాహసముఉన్న కమిషనరు, సభ్యులు అవసరము. ఉద్దండుడైన కమిషనరు కావలెను. వీరంతా పూనుకొని, తిరుమలకు తిరుపతికి, సమృద్ధిగా నీటివసతి, మురికినీరు పోవు ఏర్పాటులు, అందమైన స్నానఘట్టములు, శుచిశుభ్రతకల్గిన వీధులు రస్తాలు కల్పించవలెను. ఇంతవరకు కమిటీవారు సాధించినదానికి ఎవ్వరూ గాని మంచిమాట చెప్పకుండా ఉండలేరు. వారు సాధింపవలసిన దానితో చూచిన సాధించినది స్వల్పము!

ఆదాయవ్యయాలు

దేవస్థానం వారి ఆదాయం రూ. 23 లక్షల 78 వేలు. ఖర్చు 20 లక్షల 49 వేలు. ఆస్తులు 8 కోట్లు. మూలధనం 47 లక్షలు. స్వామివారి జవహరీ 37 లక్షలు. దేవాలయనిర్వహణ కమిషనరు వీరాస్వామినాయుడుగారు, పారుపత్యందారు శ్రీరంగారెడ్డిగారు, పేష్కరు అన్నారావుగారు, ఇతర సిబ్బందీ నిర్వహిస్తున్నారు. దేవాలయ నిర్వహణ, పునరుద్ధరణ, ఉత్సవాలు ప్రసాదాలు అలంకరణాలు, సత్రములు ఇత్యాదులనిర్వహణ దేవస్థానంవారి విధులు. 7 లక్షలు పెట్టి దేవస్థానంవారు 15 మైళ్లు కొండ క్రింద నుంచి పైకి వెళ్లడానికి రోడ్డు వేయించారు. కాని రోడ్డుస్థితి ఏమీ బాగుండ లేదు. ఈ బ్రహ్మోత్సవంలో కారు. ప్రమాదం సంభవించి ప్రాణనష్టంగూడా కల్గినది. రోడ్డు గతుకులు గతుకులుగా ఉన్నది. 12 లక్షలు పెట్టి ఈ రోడ్డును తారు చేయించాలని దేవస్థానంవారు చూస్తున్నారట. పుణ్యకాలం మీనమేషాలు లెక్క పెడుతుంటే గడచిపోతోంది. ఆలస్యానికి కారణమడిగితే ఏవో కారణాలు చెబుతారు. దొరలకు నెలవని నీలగిరులకు అద్దంలాంటి రోడ్డును అధికారులు పరిపించారు. దొరలకు దొరఅయిన శ్రీ స్వామిసన్నిధానమునకు బాటకు మటుకు అరమరలు వస్తూఉంటాయి. ఈరోడ్డును సిమెంట్ కాంక్రీటు చేయించవచ్చు. తారు చేయించవచ్చు. యద్వథాసైనా రస్తా తక్షణమే బాగుపడకపోతే యాత్రికులు ఇప్పటిమాదిరిగానే అవస్థలు పడుతూ ఉండక తప్పదు. తుదకు ఏదో ప్రమాదం సంఘటిస్తే అప్పుడు కమిటీలు, విచారణలు జరిపించి, ఈ నిర్ణయానికివచ్చేటంత వరకు అధికారులు నిద్రమేల్కొనరా? మరి ద్రవ్యకొరత శ్రీనివాసుని కేమీ లేదే?

బస్సుల స్థితి

ఈ రోడ్డుకై బస్సులనిర్వహణ పరిపూర్ణంగా దేవస్థానంవారే నిర్వహిస్తున్నారు. ఈ దేవస్థానం వారి బస్సుల టిక్కట్ల బాధపడలేక కొండపైకి మెట్లు మార్గమున పోయిన యాత్రికుల సంగతి నాకు తెలుసు. ఈబస్సుల నిర్వహణ ఏమీ తృప్తికరముగా లేదు. పర్వసమయాల్లోను, యాత్రికులు, సమ్మర్దంగా ఉండే రోజుల్లో ఈ అవస్థ మరీ హెచ్చుగా ఉన్నది. ఇప్పుడు ఉన్న బస్సుల సంఖ్యఉంచితేనే బస్సులవల్ల స్వామివారికి కొంచెం ఆదాయం వస్తోందనీ, ఖర్చు పెంచితే స్వామివారి ఆదాయం దెబ్బతింటుందనీ అధికారులపక్షు వాదనగా ఉన్నది. యాత్రికులు గంటలకొద్దీ బస్సుకోసం వేచిఉండేరోజులు ఉన్నవి. పిల్లలతో పెట్టే బేడలతో చెట్లక్రిందవేచి వేచి అధికారుల కఠిన వాక్యాలకు గురి అవుతూ ఉంటారు. దేవస్థానం ఒక వ్యాపారసంస్థ గాదు. ఇందువల్ల స్వామికి నాల్గుడబ్బులు చేరితేనేగాని గతి లేదనటానికి వేంకటేశ్వరునికి కోటానుకోట్లు భక్తులు చల్లగా ఉన్నంతవరకు వేంకటేశ్వరునికి లక్ష్మీకటాక్షమునకు భయములేదు. బస్సుల సంఖ్యను హెచ్చించి సిబ్బందిని పెంచాలి. ఇప్పుడు ఒక్కొక్క బస్సు హాండిల్ లేకుండా గూడా బయలుదేరి ఆగితే మళ్లీ కదలకుండా మధ్యలో బైఠాయిస్తుంది. ఎదురు బస్సు వచ్చేవరకు కదలటానికి త్రాణ రాదు. ఈ దుస్థితి పోవాలంటే బస్సులను ఆధునికపద్ధతులపై నిర్వహించవలసి ఉన్నది. దేవస్థానం సిబ్బందిని పెంచాలి. ఇందుకు దేవస్థానంవారు సిద్ధంగా లేకపోతే చేతులు కడుక్కొని సర్వీసును ప్రభుత్వానికి వప్పగించాలి. కొండపైకి పోయే బస్సులో ఫస్టు క్లాసు రూ. 1-14-0 అనీ, రెండో తరగతి 1-3-0 అనీ వ్యత్యాసం పెట్టారు. వాస్తవానికి దానికీ దీనికీ ఆట్టే తేడా. లేదు. ఈ వ్యత్యాసం ఎత్తివేయడం మంచిదని చాలమంది భక్తులు అభిప్రాయపడుతున్నారు.

విద్యా ప్రచారం

దేవస్థానంవారు విద్యావిషయకంగా ఉత్తమ సేవ చేస్తున్నారు. ప్రాచ్యసంస్కృతిపరిశోధనా సంస్థను నెలకొల్పి అందు దిగ్గజములవంటి పండితులు శ్రీ వేటూరు ప్రభాకరశాస్త్రి, మానవల్లి రామకృష్ణ కవిగారల సేవను స్వీకరించుట ప్రస్తుతింప దగినది. కీర్తనాచార్యులైన తాళ్ళపాక వారికీర్తనలను పరిశోధించి శ్రీ ప్రభాకరశాస్త్రి గారు ప్రచురించిన గ్రంథము ప్రశంసార్హమైనది. జ్ఞానవృద్ధులూ, వయోవృద్ధులూ అయిన మానవల్లి రామకృష్ణకవిగారి సేవను దేవస్థానంవారికి లభింపచేసినందుకు వారు అభినంద్యులు. తాళ్లపాకవారి కీర్తనలకు స్వరములను కల్పించి వ్యాఖ్యానములను ఈ పత్రికలో స్థలాంతరమున రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు సంగీత సాహిత్యప్రియుల అభిమానమునకు పాత్రులగుచూ, అపారమైన సేవగావించుచున్నారు. తాళ్ళపాకవారు స్వామివారిని తమ ఇలవేల్పుగా తమతోబుట్టిన వానిగా తమ అంతరంగికునిగా భావించి రాగసుధారసమును వర్షించినారు. శ్రీ వేటూరువారు వయస్సున పెద్దలయ్యు ఉత్సాహమున పిన్నలనుతలదన్నినారు. వేదాగమపాఠశాలను గూడా దేవస్థానమువారు నిర్వహించుచున్నారు. ఈ ప్రాచ్యవిద్యానిధులకు, దేవస్థానంవారు ఏదో వేతనములు ఇచ్చినామంటే ఇచ్చినామనక ఈ జ్ఞానవృద్ధులను సమృద్ధిగా తృప్తుల చేసి, ఈ మహాకార్యమున వేరుధ్యాస లేక వారు నిమగ్నులగుటకు అవకాశముకల్పించవలెను.

ఇతర సంస్థలమాట ఎటులున్నను దైవసంబంధమైన దేవస్థానంవారు ఆర్యవిద్యలను, విద్వాంసులను అర్హమైన విధముగా గౌరవించుట ప్రధాన ధర్మమై ఉన్నది. ఆర్యవిద్యాసముపార్జనలో నిష్ణాతులై బ్రహ్మతేజస్సుతో అలరారు మన వేదవిదులకు, శాస్త్రవిదులకు, స్వతంత్ర భారతమున ఉన్నతస్థితి కల్పించి తీరవలెను

ఆధునికవిద్యాలయాలు

దేవస్థానంవారు తిరుపతిలో ప్రాథమిక, ఉన్నత, పాఠశాలలను, కళాశాలను, రాయవేలూరు ఒక ఉన్నతపాఠశాలను నిర్వహించుచున్నారు. ఈ విద్యామందిరములందు ప్రతిభకన్న కొన్ని కులములకు శాఖలకు మన్నన కల్గుచున్నదన్న ఆరోపణలకు దేవస్థానంవారు ఆస్కారమివ్వరాదు. దేవుని సన్నిధానమందైన జాతిమతవ్యత్యాసములు విస్మరింపక తప్పదని ప్రజలు ఆశించెదరు.

దేవస్థానంవారు గోశాలను, పేదగృహాన్ని కుష్ఠురోగుల ఆశ్రయాన్ని అనాథాశ్రమాన్ని, వైద్యాలయాలను, దైవగ్రంథ ప్రచురణను నిర్వహిస్తున్నారు. శిల్పమును, సంగీతమును, లలితకళలను ప్రోత్సహించు కళాశాలను స్థాపింప ఆలోచించుచున్నారు. తిరుపతిలో 11లక్షలు వెచ్చించి కళాశాలభవనములు కట్టించుచున్నారు. రాయవేలూరులో లక్షపైగా వెచ్చించి ఉన్నతపాఠశాలభవనములు నిర్మించినారు. ఒక లక్షవెచ్చించి రజతరథమును కట్టించినారుగాని అది ఆగమసూత్రములకు విరుద్ధముగా ఉన్నందున పనికిరాదని పండితులు చెప్పుతున్నారట. వేయికాళ్లమండపమును పునరుద్ధరించి యాత్రికుల ఆవాసమునకు నెలవు కల్పించినారు. మ్యూజియమునకు రూ. 5 వేలు మంజూరుచేసినారు. దేవస్థానంవారు చేయుచున్న సంఘసేవ ప్రశంసనీయమే అయినా, వారు గావించు గోసేవ, పండితసేవ, అనాథసేవ ప్రదర్శనమునకుగాక ప్రయోజనమునకు రావలెను. పదిలక్షలు వెచ్చించి స్వామికి రత్న కిరీటమును కట్టించినారు. భేషుగ్గానే ఉంది. శ్రీనివాసునికి ముడుపులకు నగలకు ఏమి కొదవ? స్వామివారి అర్చనకు సామగ్రికములు వచ్చు చంద్రగిరిబాటకు దేవస్థానంవారు అవశ్యము మెట్లు కట్టించవలసి ఉన్నది. ఆ మెట్లు వాగులకు వర్షములకు ఇదివరకువలె మరుఏడే బలి అగునట్లుగాక గట్టిగా పదికాలములబాటు నిలచునట్లు కట్టించవలెను. స్థానికముగా ఉన్న ప్రభుత్వతాబేదార్లే గాక, వారు ముక్కుతాళ్లు చేతుల్లో పట్టుకొన్న ప్రజాప్రతినిధులైన మంత్రులు గూడా మన సరస్వతీమందిరములైన దేవాలయముల పునరుద్ధరణకు కంకణము దాల్చవలెను. మన దేవాలయములను, మన విద్యలను, మన పండితులను నిలబెట్టి, ఆర్యవిజ్ఞాన బీజముల రక్షించుట మన అమాత్యులు అవధరింపవలెనని నా విజ్ఞప్తి. ప్రకాశంగారు ప్రధానిగా ఉండగా శ్రీ వేంకటేశ్వరుని పేట రాయలసీమలో ఒక విశ్వకళాపరిషత్తు నెలకొల్పుటకు ఒక కోటినిధిని ప్రత్యేకింప యత్నించినారని, వారి మంత్రివర్గం ఆ మార్గమున కొంత కృషిచేసినారనీ కర్ణాకర్ణిగా వినవచ్చినది. పూసపాటివంశీకులైన శ్రీ కుమారస్వామిగారు వారి మంత్రివర్గము ఆ సదుద్యమమును పునరుద్ధరించి తిరుపతి పునః విద్యానగరముగా చేసిన యశస్సు నార్జించవలెనని కోరుచున్నాను.

"ఉన్మీల్య నేత్రయుగముత్తమ పంజరస్థాః
పాత్రావశిష్టకదళీఫలపాయసాని
భుక్త్వాసలీల మథకేళిశుకాః పఠంతి
శేషాద్రిశేఖర విభోతవ సుప్రభాతం."

ప్రఖ్యాత దర్శకుడు

జాన్‌ఫోర్డు బాల్యము

జాన్‌ఫోర్డుది భారీవిగ్రహము. మొగం గీతలతో అలముకొనిపోయి గుండ్రపుమొగంగా కనపడుతుంది. ఎఱ్ఱగా ఉండే జుత్తురంగు పాలి నెరసిందిగాని మనిషిలో కోపపు "వఱ్ఱ"తనంమాత్రం ఏమాత్రమూ నెరవలేదు. చిత్రనిర్మాణము, కళా, వ్యాపారమా అన్న ప్రశ్న వస్తే, కళ అనేందుకు ప్రోద్బలంగా జాన్‌ఫోర్డుచిత్రాలు ఆధారమవుతాయి.

1935 లో "ఇన్ఫార్మర్" అన్న చిత్రంతో జాక్‌ఫోర్డు అకాడమీబహుమతి సంపాదించాడు. 1939 లో స్టేజ్ కోచ్, 1940 లో గ్రేప్సుఆఫ్‌వ్రాత్" 1941 లో హౌగ్రీన్‌వజ్ మైవాలీ" అన్న చిత్రాలు వరుసగా ఉత్తమచిత్రబహుమతు లందుకొంటూవచ్చాయి. "హౌగ్రీన్ వజ్ మైవాలీ" అన్న చిత్రానికి బహుమతి యియ్యవచ్చినప్పుడు ఫోర్డుతీసిందే "లాంగ్ వాయేజ్ హోమ్" అన్న చిత్రానికి యిచ్చాలో దీని కియ్యాలో జడ్జీలకు ఒకపటాన తేలలేదు. కాని రెండూ ఫోర్డు తీసిన చిత్రాలే అవటంతో తభావతు రాకుండా తప్పిపోయింది.

ఇన్ని ప్రైజ్ చిత్రాలు తీసిన డైరెక్టరు కనుక, నిర్మాతలు ఇతనికోసం ఎగబడతారా అనే భావన రావచ్చును. కాని ఫోర్డుపేరు చెప్పితేనే నిర్మాతలకు ఒళ్లు జలదరింపు పుట్టుకొస్తుంది. "ఆమనిషిని నిభాయించుకురావడం కష్టం" అని ఒక ప్రొడ్యూసర్ ఒకసారి గొణిగాడు. కాని అసిస్టెంటు నెమ్మదిగా చెప్పాడు. "ఫోర్డును మనం నిభాయించటం అనేది ఏమీలేదు. పగ్గాలు వదిలేసి ఆ దౌడులో అంచులుపట్టుకు వేళ్లాడడమే మనం చెయ్యగల నిభాయింపంతా" అన్నాడు.

"ఐరన్ హార్స్" అనే చిత్రాన్ని. "సెయిర్రానెవాడా" అనే పర్వతప్రాంతంలో తియ్యటానికి సంకల్పించి, 300 మందిని వెంటబెట్టుకొని, నెలరోజుల మకాం నిర్ణయించుకొని, ఫోర్డు బయలుదేరాడు. తీరా అక్కడికి వెళ్లి శిబిరాలు స్థాపించుకొన్నాక మహావిసురుగా శీతగాలులు (బ్లిజర్డు)సాగాయి. మంచుగడ్డకన్న 20° చల్లని టెంపరేచరులో శీతగాలులు విసురుగా వీస్తున్నాయి. వాతావరణం మారనప్పుడు స్క్రిప్టు మార్చుకోటం మంచిదని ఫోర్డు ఆలోచించాడు. స్క్రిప్టు మార్చి, షూటింగ్ ప్రారంభించాడు. ఆ తుపానుగాలులు రెండోసారి, మూడోసారి, తిల్లాగే వరుసగా చలితో కొంకర్లు పుట్టిస్తూ వరుసపెట్టాయి. నిర్మాత చెప్పిన నెలరోజులూ పూర్తిఅయిపోయింది. వెనక్కి తిరిగివచ్చెయాల్సిందని నిర్మాత ఫోర్డుకు వైర్ ఇచ్చాడు. ఫోర్డు, ఆవైర్ ఘర్రుమని చించేశి, తన పని సాగించుకొంటూ పోయాడు. చిత్రంకోసమని, మూడుమైళ్లు రైలుపట్టాలు వేసుకొంటూ షెడ్డులు కట్టుకొంటూ, పనివాళ్లంతా పనిచేశారు. బయలుదేరి రమ్మన్న తర్వాత ఐదువారాలకు ఫోర్డు, పరివారము ఇంటికి చేరారు. అక్కడ నిర్మాత నిప్పులు కక్కుతూ ఫోర్డుకోసం ఎదురుమాస్తున్నాడు. కాని ఫిల్ము చూసేటప్పటికి కోపం అంతా అభినందనగా మారిపోయింది. "ఐరన్ హార్స్" చిత్రానికి 280,000 డాలర్లు ఖర్చు అయాయి. 3,000,000, డాలర్లవరకూ చిత్రం ఆదాచేసిపెట్టింది.

ఫోర్డు, అసలు ఇంటిపేరు ఫీనే. చిన్నప్పుడే అతనిఅన్న, ఇల్లు విడిచివచ్చి చిత్రాలలో చేరి ఫ్రాంసిస్‌ఫోర్డు అని పేరుపెట్టుకొన్నాడు తమ్ముడు కూడా ఇంట్లోనించి పారిపోయి వచ్చేసి అన్న అండనుచేరి, జాక్‌ఫోర్డు అని పేరు పెట్టుకొని అన్నను అనుసరించాడు.

1914 లో జాక్ సినీమాలలో చేరినప్పుడు వారానికి 12 డాలర్ల జీతంమీద సెట్టుమీది నౌకరుగా అన్నదగ్గర ఉద్యోగానికి కుదిరాడు. కాని అనుకోకుండా జాక్ "స్టంటు ఆక్టరు"గా మారాల్సి వచ్చింది. ఫ్రాంసిస్ ఫోర్డు, స్టంటు పిక్చర్లు తీసేవాడు. తనదగ్గిర పెద్దనటు లెవళ్లైనా 'ఓఘాయిత్యాలు చెయ్యటానికి అపాయకరమని ఒప్పుకోనప్పుడు వాళ్లకు సిగ్గు తెప్పించాలని అపాయకర మేమిటి? చూడండి మాతమ్ముడు చిన్నకుఱ్ఱాడుచేసేపనికి వెనకతీస్తారు సిగ్గు లేదూ?"అంటూ తమ్ముడిచేత స్టంటులు చేయించేవాడు. ఒకసారి గుడారంలో బల్లదగ్గిర తమ్ముడిని కూర్చోపెట్టి గుడారం దూసుకుపోయేటట్టు ఫిరంగిగుండు కాల్చాడు. ఆబల్ల ముక్కలు ముక్కలై పోయాయి, ఆ పసితమ్ముడు ఐదు గజాల ఎత్తుగాలిలో ఎగిరిపడ్డాడు.

ఇంకోసారి 75 అడుగుల ఎత్తునుంచి క్రిందికి దూకమన్నాడు తమ్ముడిని. జాక్‌ఫోర్డు దూకటం దూకాడు. కాని దూకేముందు దేవుడికి దణ్ణం పెట్టుకోటంతో షాట్ చెడిపోయిందని అన్న విసుగుకున్నాడు.

జాక్ ఆయుస్సువిషయంలో ఫ్రాన్సిస్ కెంత నమ్మకం ఉండేదేమో, తమ్ముడికి రోజూ గండాలే కల్పించేవాడు. ఒకసారి మోటార్లు ఒకదాన్ని ఒకటి మహాదురితంగా తకుముకొంటూపోతూ ప్రమాదం జరిగే సీను షూట్ చెయ్యాల్సివచ్చింది. ఫ్రాన్సిస్ తమ్ముడుని ముందుసీటులో కూర్చోపెట్టి తను కెమెరా ఉన్న కారులో కూర్చుని, అరుస్తూ దర్శకత్వం చెలాయిస్తున్నాడు. "కారు కుడివైపు తిరగాల్చి ఎడమవైపు - ఇప్పుడు నిన్ను తుపాకితో కాలారన్నమాట - కారు కంట్రోలు తప్పాలి - కుడి వైపుకు ఒరగాలి - ఇంక కారు పేలిపోతుంది-"

కారు నిజంగా పేలిపోయింది. చిత్రం వాస్తవికంగా ఉండేందుకని అక్కడి గోడ్డు పేలుడు మందుతో నుందే నింపాడు ఫ్రాన్సిస్. ఇంకోసారి బాంబుపేలుడు ఘటనలో తమ్ముడు దెబ్బతిన్నప్పుడు తమ్ముడు జాక్‌ను హాస్పిటల్ చేర్చాడు. అన్న తమ్ముని చూడడానికి వచ్చినప్పుడు సంతోషంతో "కాస్తలో గండం తప్పిపోయిందిరా! ఒక్కక్షణం ఆలస్యమయితే, నీకూ, హీరోకూ, తేడా బయల్పడి ప్రేక్షకులకు తెలిసిపోయేది" అన్నాడు. తమ్ముడికి గండం తప్పినందుకు కాదు సంతోషం, నటులమార్పు బయల్పడనందుకు!

జాక్ అన్నమీద కసిగలవాడు కాదు గానీ, పెద్దవాడయ్యాక దీనికి కాస్త బదులు తీర్చుకొన్నాడు. ఒక పీపామీద అన్నను కూర్చోపెట్టి పీపాను బడబడా దొర్లించి ఫిల్ముతీశాడు.

జాక్‌ఫోర్డు హాలీవుడ్‌లో చేరిన మొదటిసంవత్సరములోనే ఇట్టే పేరులోకి వచ్చాడు. చిత్రనిర్మాత కార్ల్ లెమ్మెల్ ఒక సర్కస్ టెంటు సీను చిత్రం తీస్తున్నాడు. టెంటు నిప్పంటుకొన్నట్టు చూచాయిగా చూపి వెంటనే మంట ఆర్పేయాలని లెమ్మెల్ ప్రయత్నం. టెంటు ఎక్కువ ఖరీదుకు అద్దెకు తీసుకొన్న దవటంవలన కార్ల్ మరీ జాగ్రత్తగా ఉన్నాడు. నిప్పు ఆర్పేందుకు నీళ్లబాల్చీలు జాగ్రత్తపెట్టాల్సిన నౌకరీ, కుఱ్ఱవాడైన జాక్ ఫోర్డుపాల బడ్డది. మహాసుందరమైన జ్వాలా దృశ్యం సినీమాలోకి రాకుండా పోతుందేనని జాక్‌కు చాలా విచారంవేసింది. ఆలోచించాడు.

మర్నాడు షూటింగ్ జరుగుతోంది. టెంటు ముందర కాస్తకు నిప్పంటించి కొద్దిగా షూట్ చేసి, "ఆర్పేయ" మని డైరక్టరు ఆర్డరిచ్చాడు. ఫైర్‌బ్రిగేడువాళ్లు జాక్‌ఫోర్డు తెచ్చిన నిండు బాల్చీలు మంటలమీదకు విసిరారు. మంటలు ఒక్కసారిగా మరింత బగ్గుమన్నాయి. బాల్చీలలోది నీళ్లుగాదు. "కిరోసిన్!" ఆ అడావుడిలో, నటులూ తక్కిన జనం గుఱ్ఱాలూ జంతువులూ అంతా అడావుడిగా అటూ ఇటూ పరుగులు మొదలుపెట్టారు. మంటలు మరీ మండిపోతున్నాయి. గందరగోళం పెరిగిపోయింది. జాక్‌ఫోర్డు స్థిరంగా కెమెరాప్రక్కన చేరి "షూట్" అని ఆర్డరు ఇచ్చాడు. ఏమి చెయ్యటానికి తోచక తెల్లబోతున్న కెమెరామన్' విన్నమాటప్రకారం షూట్ చెయ్యసాగాడు. అంతా పూర్తియేటప్పటికి జాక్ పత్తాలేకుండా దాక్కొన్నాడు. కార్ల్ లెమ్మెల్ జాక్ ఉద్యోగంనుంచి బర్తరఫ్‌చేసి, మూడోనాడు మళ్లీ పిలచాడు.

చిత్రంలో వచ్చినటువంటి దృశ్యానికి సర్కస్ టెంటు తగలబెట్టినా పెద్ద ఖర్చుకాదు. కానీ మళ్లీ అల్లా చెయ్యకు "అని వార్నింగు ఇచ్చి అసిస్టెంటు డైరక్టరుగా చేశాడు."



ట్వెంటీయత్ సెంచరీఫాక్స్ కంపెనీవారి అద్భుతమైన ఫిలిం 'స్నేక్‌పిట్'లో ఒలీవియా డిహావిల్లాండ్ నటించే ఒకదృశ్యం. ఈ ఫిలిం న్యూ ఎల్‌ఫిన్‌స్టన్‌లో ప్రదర్శించబడినది. చలనచిత్రంలో చలనానికిగల ప్రాధాన్యం ఎంతో, శబ్దానికీ సంభాషణకూ, ఎటువంటి స్థానంఉండాలో, భావప్రకటనకు ఎన్నిపద్ధతులు, విధానాలు అవలంబించవచ్చునో ఈ ఫిలింలో చూడవచ్చును.



రాగిణీ ఫిలింస్‌వారు తీస్తున్న 'తిరుగుబాటు' అనే సాంఘిక చిత్రంలో, నాయికానాయకులు కృష్ణవేణి, సి. హెచ్. నారాయణరావు.



న్యూ థియేటర్స్‌వారి 'ఛోటాభాయ్'లో రామ్‌లాల్ (ఛోటా భాయ్) కోణంగితనంచూపే ఒక సన్నివేశం.



తోటమాలి - కోతులు

శ్రీమతి ఏకా జయలక్ష్మి

పూర్వకాలం ఒక దేశాన్ని రుక్మాంగదు డనే రాజు పరిపాలిస్తూ ఉండేవాడు. ఆ రాజు ఉండే భవనంచుట్టూ పెద్ద తోట ఉండేది. ఆ తోటలో రంగు రంగుల పూల మొక్కలూ, రకరకాల పండ్ల చెట్లూ ఉండేవి.

ఆ పూల, పళ్ళ మొక్కలకు రోజూ ప్రొద్దునా సాయంత్రం నీళ్ళు పోసి, జాగ్రత్తగా కాపాడటానికి ఒక తోటమాలిని నియమించాడు. ఆ తోటమాలి ఆ తోటలోనే ఒక చిన్న కుటీరం నిర్మించుకొని అక్కడే ఉండేవాడు. రోజూ సాయంత్రంపూట రాజు తోటలో పచార్లు చేసి వెళ్ళుతూ ఉండేవాడు.



ఇంతలో సంక్రాంతిపండుగ వచ్చింది. తోటమాలి యిదివరకు ప్రతి సంవత్సరం సంక్రాంతిపండుగరోజున కోడిపందాల్లో పాల్గొంటూఉండేవాడు. ఈసారికూడా పోవా లని బుద్ధి పుట్టింది. చెట్లకు నీళ్ళు పొయ్యకుండా తప్పించుకపోతే రాజు మండిపడతా డని భయపడ్డాడు. ఏమీ తోచక ఎట్లనా అని ఆలోచిస్తూఉండగా కోతులు జ్ఞాపకానికి వచ్చాయి. తలెత్తి చూచేసరికి అవి గుంపులుగుంపులుగా చెట్లమీద పడి కాయలు తినటం కనిపించింది.

వాటివైపు తీక్షణంగా చూస్తూ బిగ్గరగా వెధవకోతులు! దేనికీ పనికిరావు. 'తిండికి తిమ్మరాజు పనికి పోతరాజు' అన్న సామెత ఊరిక పుట్టిందా! మనిషికీ వీటికీ కాళ్ళల్లో, చేతుల్లో ఏం భేదం కన్పించదు. ఏం లాభం! దేనికీ కొరగావు. నేను దయతలచి ఊరుకోటం వల్ల వాటి యిష్టం వచ్చినట్లు తిని, విచ్చలవిడిగా తిరగగలుగుచున్నవి. నేనే పట్టించుకున్నట్లయితే యివి ఎప్పుడో రాజభటుల కరకువిల్లంబులకు ఆహుతి అయేవి.

ఆ మాటలు విని ఒక పెద్ద కోతి చెట్టుదిగి వచ్చి ప్రక్కన కూర్చొని ఎందుకు తోటమాలీ! రోజూ ఉత్సాహంతో మాపనులూ, చేష్టలూ, చూసి మురిసిపోయేవాడివి ఈరోజు విచారంగా ఉన్నావేం అని అడిగింది. తోటమాలి తన సంగతంతా చెప్పాడు.

దీనికేనా యింతగా విచారించటం? ఏకేం భయం లేదు. వెళ్ళు. నీవు చేసే పని మేము మూడు నిమిషాల్లో చేస్తాం. అని ధైర్యం చెప్పింది. తోటమాలి పెద్ద కోతిసలహాకు సంతోషించాడు. ఆనాడు శ్రీరామచంద్రునకు కోతులు సహాయపడినట్లే, ఈ కోతులు తన కార్య సాఫల్యానికి తోడ్పడగల వని ఉప్పొంగి పోయాడు. నీటి కొలను, నీరు పోసే బొక్కెనను చూపించాడు. సరే వెళ్ళివస్తా జాగ్రత! జాగ్రత! అని పదేపదే చెప్పివెళ్ళాడు.

కోతులన్నిటినీ పిలిచి పెద్ద కోతి తోటమాలి చెప్పిన విషయాన్ని తెలియపరచి ఎండ ఎక్కుతోంది త్వరగా చెట్లకు నీళ్ళు పోయటం పూర్తి కావాలి! అన్ని నీళ్ళు తీసుక వచ్చేందుకు కోతులను పంపించింది. అవి నీళ్ళు తెచ్చినతర్వాత ......పెద్ద మొక్కలకు ఎక్కువ నీళ్ళు చిన్న మొక్కలకు తక్కువ నీళ్ళు పోయా లని ఆజ్ఞాపించింది. నీళ్ళు పోయబోతూ చిన్న మొక్కనీ పెద్ద మొక్కనీ ఎలా తెలుస్తుం దని అడిగినవి. పెద్ద కోతి ఆలోచించి మొక్కలను పైకి పెళ్ళగించి వేళ్ళు పొడుగ్గా ఉంటే తిరిగి పాతిపెట్టి ఎక్కువ నీరు, వేళ్ళు పొట్టిగా ఉంటే తక్కువనీళ్ళు పొయ్యమంది. పెద్దకోతిఅనుమతి ననుసరించి చిన్న కోతులు చేశాయి.

సాయంత్రానికి తోటమాలి రాజుగారు షికారుకు తోటకు వస్తాడేమో నని భయపడుతూ రోజు వచ్చే వేళకు ముందుగా వచ్చి చూచేసరికల్లా మొక్కలన్నీ వాడిఉండటం కన్పించింది. నిలువుగా నీరయిపోయాడు. అయ్యో! అనుకున్నంతా పని జరిగింది. 'కోతిబుద్ధి' అని తెలిసీకూడా గోతిలో పడ్డాను. రాజుగారి చేతిలో నా ప్రాణం దక్కడం కల్ల. అని గజగజా వణకుతూ కూలబడ్డాడు.

రాజు మామూలుగా రోజూ వచ్చే వేళకు వచ్చి చూచేసరికి తోటలో ఉన్న పూల మొక్క లన్నీ ఎండి వాడి ఉండటం కన్పించింది. రాజు నివ్వెరపోయి తోటమాలీ! జాగ్రత్తగా చూస్తుండమని చెప్పానుగా! వీటికీ గతి పట్టించావేం అని కళ్ళెఱ్ఱచేసి అడిగాడు.

తోటమాలి, భయపడుతూ ప్రాణం మీద ఆశ వదలి నిజం పల్కాడు. రాజు తోటమాలిని మందలిస్తూ 'కోతిబుద్ధి' ఎరగవ్వా? వాటికంటే నీవు తెలివి తక్కువవాడివిగా కనబడుతున్నావు? నీవు ఈ పనికి పనికిరావు! అని అతనిని ఆ పనిలోనుంచి తొలగించి వేరే మరొకణ్ణి నియమించాడు.

(అనువాదం ఆంగ్లకథనుంచి)

అత్యాశ - ఆపదలపాలు

శ్రీ కె. పి. బాబు

ఎలుకపిల్ల కలుగులోనుండి బయటకొచ్చింది. "అబ్బ! ప్రపంచ మెంత అందంగా ఉంటుంది ఛీ! పాడు. నేను నా తెలివితేటలకు తగ్గట్టుగా లేను. నావంటి తెలివిగల పిల్లకు ఇటువంటి ఆకారమా? ఛీ! ఛీ!!" అనుకొంది మనస్సులో చీదరగా. "నీ కోర్కె నెరవేరాలని ఉన్నదా?" అన్న వింత స్వరం ఎలుకపిల్లను ఆశ్చర్యపరచింది. ఎలుకపిల్ల వెనకకు తిరిగి చూసింది. ఆశ్చర్యం! సరిగ్గా చిన్న నిమ్మకాయంతకూడా ఉండడా మనిషి— పకపకా నవ్వుతూ "ఓ ప్రియమైన ఎలుకపిల్లా! నీ కోర్కె నెరవేరాలని ఉన్నదా?" అన్నాడు. "ఆఁ! నాకు ఓ పిల్లి నైపోదా మని ఉన్నది. ఎంచక్కా ఆడుకొంటూ పాట పాడుకొంటూ పోవాలని ఉంది" అన్నది ఎలుకపిల్ల. అత్యాశ్చర్యం! వెను వెంటనే ఎలుకపిల్ల ఓ అందమైన పిల్లై పోయి ఊరుకొంది. పొట్టివా డదృశ్యుడైనా ఇంకా వాడి వికటపు నవ్వు విని పిస్తూనేఉంది గర్జనవలె!—

చిరుగంతులు వేస్తూ నడిరోడ్డుపైకి వచ్చింది మన ఎలుకపిల్ల. రోడ్డుమీద బళ్లూ, కార్లూ, అన్నీ వింతగా చూస్తూ "ఇక అంతా స్వేచ్ఛేగదా! ఒకరి భయం లేదుగదా!" అనుకొంటుంది. "ఏయ్! ఆగాగు ఎన్నాళ్ళకెన్నాళ్లకు దొరికావు. ఏదీ నీ ముఖమేదీ?" అన్న దొక గంభీరస్వరం. అమ్మో! ఒక్కసారి వళ్లు జలదరించిపోయింది ఎలుకపిల్లకు. పెద్ద కుక్క పళ్లికిలిస్తూ నిలబడిఉంది. ప్రక్కనే, "నా బ్రతు కింతతో సరి" అనుకొంది ఎలుకపిల్ల. "అంతేనా?" అంటూ విచిత్రంగా మళ్లా ఆ పొట్టివాడే ఎలుకపిల్లముందు అవతరించాడు. "నేనే ఇప్పుడొక పెద్దపులినైపోతేనో?" అంది ప్రాధేయపూర్వకంగా. "సర్లే" అని అదృశ్యమైపోయినాడా పొట్టోడు వింతగా నవ్వుతూ...

అమ్మో! ఒక్కసారిగా ఎలుకపిల్ల ఎప్పుడైతే పెద్దపులైపోయిందో అప్పుడే ఆ కుక్క పారిపోయింది సరిగగా! బజారు బజారంతా ఘొల్లున గోల బయలుదేరి అట్టుడికినట్లు ఉడికిపోయింది. కాదామరి? ఒక్కసారి బజార్లోకి పులి వస్తే? ఏం మరి.

"ఇదంతా నా ప్రభావమేసుమా?" అనుకొంది నవ్వుతూ. అయ్యయ్యో! ఎలుకపిల్ల పులిగా ఉన్నా గజగజా వణికిపోయింది. ఏం? ఇంకేముంది...తుపాకీలతో మనుష్యులు గురిచూస్తున్నారు. నిమిషములో ఆఖరు మన ఎలుకపిల్ల. "నా బ్రతుకు ఆఖరు కింతేనా?" అనుకొని బొటబొటా కన్నీరుకార్చింది...

"అలాగా?" అంటూ తిరిగి ఆ పొట్టివాడు అవతరించాడు పులిముందుగా. "నన్ను తిరిగి ఎలుకపిల్లను చేసేయి బాబూ! నీకో నమస్కారం పెట్తాను" అని వేడుకొంది ఏడ్పుముఖంతో. "అంతేలే—అహ్హాహ్హా అంటూ వికృతంగా నవ్వుకొంటూ మాయమైపోయాడు పొట్టివాడు. తక్షణం పులి ఎలుకపిల్లై తోక జాడించి పారిపోయింది....

విశాలమైన ఆకాశంక్రింద... ప్రకృతికి ప్రియమైన పొలంగట్లపై తోడిపిల్లలతో ఆడుకొంటూ అనుకొంది ఎలుకపిల్ల "అబ్బ! నిజానికి నా బ్రతుకే స్వేచ్ఛ—ఆనందం— ఆహ్లాదకరం— సుమా!"

చిన్నకథ :

ముగ్గురు వీరులు

శ్రీ ప్రఖ్యా ఆంజనేయశాస్త్రి

పూర్వము వుజ్జయినీ అను పట్టణమును పుణ్యసేనమహారాజు ఏలుచుండెను. ఆ మహారాజుదగ్గర ప్రియ మంత్రి హరిస్వామి అను బ్రాహ్మణు డుండెను. ఆయనకు దేవస్వామి అను పుత్రుడు సోమప్రభ అను పుత్రిక కలరు. ఆ కన్య మిగుల సౌందర్యముతో తులతూగుచుండెను. ఒకనాడు ఆమె తండ్రిగారితో "నాన్నగారూ" నన్ను శూరునికిగాని, విజ్ఞానికిగాని, జ్ఞానికిగాని యివ్వవలసినదేగాని మరి అన్యులెవ్వరికి యీగూడదుసుమా! అని చెప్పెను. అది మొదలుకొని తండ్రి వరునికోసమై వెదకుచుండెను. యింతలో ఆ రాజు రాష్ట్రముపై దండెత్తివచ్చి దక్షిణదేశపు రాజు వద్దకు హరిస్వామి అను బ్రాహ్మణుని రాయభారము పంపెను. అదే సమయ మనుకొని సోమప్రభ యొక్క వివాహమునకు ప్రయత్నించగా ఒక బ్రాహ్మణకుమారుడు వచ్చి తన కిమ్మని హరిస్వామిని అడుగగా "నాకూతురు శూర, జ్ఞాని, విజ్ఞానులలో నొక్కరిని వరియించునుగాని అన్యులెవ్వరిని వివాహముచేసుకొనదు" అని చెప్పెను. అయినను నీ వెవ్వడవు అని హరిస్వామి అడుగగా నేను విజ్ఞానిని వాడు పలికెను. అంతట హరిస్వామి అతనిని విజ్ఞానము ప్రదర్శింపుమనెను. అంతట ఆ కుమారుడు మాయచే ఒక పూలవిమానమును సృష్టించి అందులో హరిస్వామిని కూర్చొనబెట్టుకొని స్వర్గాదిలోకములు చూపించెను. అంతట మంత్రి సంతోషించి తన కుమార్తెను ఆతనికిచ్చిఏడవ దినమున వివాహముచేయుటకు నిశ్చయించెను. అంతట ఆవుజ్జయినీనగరములోనే యింకొక విప్రకుమారుడు వచ్చి దేవస్వామిని (అనగాహరిస్వామికుమారుడు) "నీ చెల్లెలను నా కియ్యవలసినదని అడుగగా నాచెల్లెలు పైచెప్పిన ముగ్గురిలోమాత్రమే వరించునుగాని అన్యులెవ్వరిని వరింపదు"అనెను. కాని నీ వెవ్వడవు అని దేవస్వామి అడుగగా తాను శూరుడనని చెప్పుకొని తన శస్త్రాస్త్రవిద్యాప్రభావమును కనబరచెను. అంతట దేవస్వామి పెద్దల నడిగి ఏడవదినమునముహూర్తమునిశ్చయించి వివాహమునకు వాగ్దానము చేసెను. ఆ సమయమందే తల్లిని యింకొక విప్ర కుమారుడు వచ్చి కూతురును నాకియ్యవలసినదని అడుగగా ఆమె "నాకూతురుశూర, జ్ఞాని,విజ్ఞానులలోమాత్రమే వివాహమును చేసుకొనునుకాని యితరులెవ్వరిని వివాహము చేసుకొనదు. అని నీవెవ్వడవుఅని అడగ"తాను జ్ఞాని" అని వర్తమాన భూతభవిష్యత్తులను చెప్పగా యితనికి ఏడవనాడు వివాహముచేయుటకు నిశ్చయించి వాగ్దానము ఆనాడు రావలసినదని చెప్పగా వారు వెళ్లిపోయిరి. తర్వాత హరిస్వామి తిర్గి యింటికి రాగా తక్కిన యిద్దరి సంగతులు చెప్పగా ఎట్లాయనుకొనుచుండిరి. యిట్లుండగా వివాహదినము వచ్చెను. ఆరోజు జ్ఞాని, విజ్ఞాని, శూరులు హరిస్వామియింటికి వచ్చిరి. ఆ సమయమున ఒక వింత జరిగెను. సోమప్రభ ఎటకు పోయెనో, ఏమైనదో ఎంత వెదికినను కానరాదయ్యె. అంతట హరిస్వామి దిగులొంది జ్ఞానిదగ్గరకు వచ్చి "ఓజ్ఞానీ! నాకొమరిత ఎచ్చట వున్నదో చెప్పుము" అని అడుగ "ధూమశిఖుడను రక్కసుడు కొనిపోయి వింధ్యారణ్యములో తన యింట నుంచుకొన్నాడు. అని చెప్పగా, అప్పుడు హరిస్వామి 'వివాహ మెట్లు జరుగును! అయ్యో! నా కూతురు ఎక్కడ' అని మొఱపెట్టసాగెను. అంతట విజ్ఞాని "అయ్యా! భయపడవలదు. మీకొమరిత ఎచ్చట నున్నదని జ్ఞానిపలికినాడో అచ్చటకు మిమ్మెల్లరను చేర్చెదను. అని చెప్పి ఒక రథమును నిర్మించి అందు వారినెల్ల నెక్కించుకొని వింధ్యారణ్యములో గల ధూమశిఖుని యింటి బయట నిల్పెను. వారి రాక ఎఱింగి కోపముతో బయటకు ధూమశిఖుడు రాగానే ఎల్లరు భయపడగా, మీకేమి భయము లేదని శూరుడు వారించి అతనితో పోరారంభించి వాని తలను అర్థచంద్రబాణమున ద్రుంచెను. వెంటనే ఎల్లరు లోపల నున్న సోమప్రభను తీసుకొని హరిస్వామి యింటికి తిరిగివచ్చిరి. అందరు యింటికిరాగా అచట లగ్నవేళ కాగా జ్ఞాని, విజ్ఞాని, శూరులు ముఖ్వురును జగడమాడ జొచ్చిరి.

జ్ఞాని:—"నేను ఎఱుంగకుంటినా, ఎచ్చటనో దాచబడియున్న ఈ కన్య మీ కెట్లు దొరుకును? కాన నీ కన్య నా కియ్యవలసినది"

విజ్ఞా:—"నేను త్వరగా వెళ్లి అరదమును చేయకున్నచో మీకు రాకపోకలలో ఎట్లు సహాయపడును? కాన నాకు యీ కన్యను యివ్వవలయును"

శూరుడు:—"నేను ఈ రాక్షసుని చంపకున్న మీరిద్దరు ఎంత ప్రయత్నించినను ఏమి ప్రయోజనము? కన్యను యిచ్చుటకు ఎవడు తెచ్చును? కావున నాకు ఈ కన్యను యివ్వవలసినది"

వారు యిట్లు జగడమాడుచుండగా హరిస్వామికి యేమియు తోచక ఊరకుండెను. కావున మీరు యీ ముఖ్వరిలో ఎవ్వరికి యిచ్చి వివాహము చేయవలెనో సక్రమముగా నిర్ణయింపుడు.

బాలానందం :

గౌతముడు దొంగ

శ్రీ యస్. వి. హనుమంతరావు

పూర్వమొక రాజ్యములో ఒక దొంగ వుండేవాడు. వాడు ప్రజల యిండ్లలో చొరబడి వస్తువులను దొంగిలించుకొనిపోవుచు, తన్నడ్డగించిన వారిని చావగొట్టుచుండెను. రాజుగారు కూడ వాని నేమియు చేయజాలకుండిరి.

ఒకనాడు బుద్ధదేవుడు ఆ రాజ్యమునకు వచ్చెను. రాజు ఆయనతో— "స్వామీ! మా రాజ్యమున నొక దొంగ కలడు. వాడు చాల దుర్మార్గుడై ప్రజలను పీడించుచున్నాడు. తమరే వానిని సన్మార్గమునకు త్రిప్ప సమర్థులు" అని విన్నవించెను.

బుద్ధుడు కొంచెమునే పాలోచించి "నా శక్తికొలది నేను ప్రయత్నింతు" నని చెప్పి, దొంగను వెదుకుటకు బయలుదేరెను.

బుద్ధుడు కాలినడకనే దొంగయిల్లు చేరెను. దొంగయిల్లొక యరణ్యమున నుండెను. బుద్ధుడు దొంగను పిలువగానే అతడు వచ్చి, ఈయనను చూచి యాశ్చర్యపడెను. దొంగ బుద్ధుని ప్రశ్నించెను—"అయ్యా! నీ వెవరు? ఇచ్చటి కెందులకు వచ్చితివి? ఇచ్చటికి వచ్చుటకు గొప్ప సాహసులుకూడ వెనుదీయుదురే! అలాంటప్పుడు నీ వెందుకు వచ్చినావు? ఏమి, నీ ప్రాణములమీద నీ కాశ లేదా?"

గౌతమబుద్ధుడు ఇట్లు జవాబు చెప్పెను:—"నాయనా! భగవంతుడు నాకీ శరీరమును యితరులకు సేవచేయుట కొరకే యిచ్చియున్నాడు. కాని యితరులను హింసించుటకు గాదు. ఈ శరీరముతో నీ కేమియైన పని యున్నచో అవశ్యము తీసికో!"

గౌతముని జవాబు విని దొంగ పశ్చాత్తాపడెను. అప్పటినుండి యాతడు గౌతముని శిష్యుడాయెను.

రాజుగారీ సంగతి విని గౌతమబుద్ధుని ఆత్మశక్తిని వేనోళ్ళ కొనియాడిరి. ప్రజలు "జేజే"లు పెట్టిరి.

(హిందీనుండి అనువదింపబడ్డది)

తోడుదొంగలు

(11-వ పేజీ తరువాయి)

"అండర్ గ్రవుండ్ లో వున్నానురా బ్రదర్"


"సంతోషించాం కాని మేం ఏమ... కున్నామో నీ కిప్పుడెల్లా తెలిసిందీ? ... వ్విక్కడ లేవుగా?"

"లేకపోతేనేం? మన భీము డున్నాడు ఇక్కడ! అన్నాడు రామదాసు.

"అయితే ఇద్దరూ కలిసి ఆడిన నాట... మన్నమాట! తోడుదొంగలు?" అన్నా... పుల్లయ్య.

"అవును. నేను అసలు మొదటినుంచీ అ... మనే అనుకుంటున్నాను.నే నసలు నమ్మనేలే... అన్నాడు మల్లయ్య.

"అవునుపాపం. అందుకే కాబోలు, వి... హం చేయిస్తానని కూడా ఒప్పుకున్నా వ్... అంటూ రామదాసు చల్లగా లేచి కా... కుర్రాళ్ళ లాడ్జికి బయలుదేరాడు.



ఇంపీరియల్ కెమికల్ ఇండస్ట్రీస్‌వారు విల్టన్‌లో ఏర్పాటుచేసిన కొత్త రసాయనిక యంత్రాగారము. దీని నిర్మాణానికి 29.3 కోట్ల రూపాయలు ఖర్చయింది.

స్వర్గీయ, ఏటుకూరి 'కవిబ్రహ్మ'

శ్రీ బృందావనం రంగాచార్య

"సుకృతీ గతాయుః"—సారస్వతక్షేత్రంలో ఒక ఉత్తమకార్యసాఫల్యంకోసం శ్రమిస్తున్న దివ్యమూర్తి అస్తమించాడు. నాగులేటి మధురగానాలతో నవచైతన్యవిలసితమైన పలనాటి భవ్యగాథను భారతంగా రూపొందింపసమకట్టిన "కవిబ్రహ్మ"ను కాలదేవత గ్రసించింది.—"పల్లెనాడస్మదాంధ్రప్రపంచమునకు పౌరుషజ్యోతి యని పేరుపడినది" "నే నటువంటి వీరధరణిన్ జనియించినవాడ గాన మనోజ్ఞ నసరాజహంస మసమానతదీయకథాసుధానదిన్ స్నానములాడు నే సుకృతజన్మఫలమ్మున కగ్గమైతినో గాని తదీయదృశ్యములు కన్నులగట్టు యథాతథమ్ముగన్" అని చెప్పుకొన్న సమర్థుని అమృతహస్తమునకు వీరభారతాన్ని తీర్చిదిద్దే యోగ్యత లేకపోయింది. "నరసయ్యగారూ! వీరభారత మెంతవరకు వచ్చినదండీ" అన్నప్పుడు "వీరభారతాన్ని పదునెనిమిదిపర్వాలుగా విభజించితి ననియు, మూడు భాగాలు పూర్తియైన వనియు, గొంతులో వూపిరి వుంటే మిగిలిన భాగాలు త్వరలో పూరించగల ననియు" వారు చెప్పిన వాక్యాలు మరువరానివి.

ఉదాత్తమైన ఉద్దేశం, ఉద్దేశాన్ని ఫలవంత మొనరింపగల పటిష్ఠమైన కార్యసాధనాదక్షత ఆయనసంభాషణలో ప్రతిఫలిస్తాయి. నిరాడంబరమైన వేషం, విశాలమై ప్రసన్నతను సూచించే ఫాలఫలకం—నిండైన విగ్రహం ఆయన అచ్ఛాంధ్రవ్యక్తిత్వానికి వెలుగిచ్చేవి. ఇంత ఆరోగ్యవంతు నా మృత్యుదేవత యెంతగా మురిపించినదో!

ఆయన "మగువమాంచాల" "క్షేత్రలక్ష్మి" ఆంధ్రుల నుఱ్ఱూతలూపినవి. బ్రతికి, పదునెనిమిది పర్వాలు ముగిస్తే వీరభారతం ఆంధ్రసారస్వతంలో విశిష్టస్థానాన్ని అందుకొనేది.

ఈయనసాహితీజీవితానికి అమృతలూరు సంస్కృతపాఠశాల, తెనాలిచిట్టిగూడూరు సంస్కృతకళాశాలలూ, వరవళ్ళు దిద్దినవి. ఆ కృషి పరిణతి నందినది. మహోజ్జ్వలరచనలకు ప్రాతిపదిక వేసిన అమరజీవి యైనాడు శ్రీ ఏటుకూరి కవిబ్రహ్మ.

"దిగిరాను దిగిరాను దివినుండి భువికి" అనీ, ప్రాచ్యపాండితీపట్టభద్రుడ ననీ, విజ్ఞప్తిగసం ఆయనమనస్తత్వానికి దూరమైన విషయం. నిగర్వి. రచనాహృదయంగల పిన్నలనినా పెద్దలనినా ప్రాణం ఆయనకు.

ఆంధ్రసారస్వతంలో తీక్ష్ణమైన పరిశ్రమ చేసి పరిణతప్రజ్ఞను సంపాదించినందువలన ప్రాచీనాధునాతనకవనసాంప్రదాయములను జీర్ణించుకొని యేరం మునసైనా సవ్యసాచివలె రాణించగల నేర్పు సంపాదించాడు. అందువలనే,

> తొల్లి సడల్పకిప్పటి వి
> ధుల్ నిరసింపక ప్రాతక్రొత్తలం
> దుల్లము సేర్చి, దేశకవి
> తోచితమార్గములన్ గమించు మా
> కొల్లని దేమి కద్దు? వివి
> ధోజ్జ్వలకావ్యకదార్థయుక్తులం
> దల్లరిపాలు గాని కవి
> తాసవ మానెద మెల్లవేళలన్.

అని ధైర్యంగా, చెప్పుకొనగల్గారు. ప్రాతక్రొత్తల మేలుకలయిక ఆయనపరమావధి. జాతికి కావలసిన స్వర్గసాహితిని సృష్టించేందుకుగాను విశ్రాంతి నెరుగని కార్యభారాన్ని తలదాల్చాడు. సముచితంగానే, విధి చల్లని చూపు చూచినంతవరకు నిర్వహించాడు. ఆ మధురాశయానికి సాధించిన రూపురేఖలే "క్షేత్రలక్ష్మి" "మగువమాంచాల" "వీరభారత" రచనలు.

జాను తెలుగునుడికారప్రయోగంలో ఆయన లేఖిని ప్రబలప్రావీణ్యాన్ని గడించుకొన్నది. ఈ ప్రత్యేకలక్షణానికి ఆయనరచనలన్నీ లక్ష్యం. వీరభారతరచన ప్రాంతీయభాషలో పలకాలని పని గట్టుకొని పలనాటిసీమలో పర్యటించి ఆ నుడికారరహస్యాన్ని గ్రహించి ప్రయోగించాడు.

ఆంధ్రజాతీయవిజ్ఞానపరిషదస్యులై రెండు మూడు ఉత్తమరచనాసంపుటాలను సంతరించారు.

రైతుహరికథారచనసందర్భమున ఆయనసారస్వత సేవకు తెలుగులోకం నివాళి పట్టి "కవిబ్రహ్మ" బిరుదంతో యేనాడో సత్కరించింది.

ఇటీవల రసజ్ఞలోకం వారిని సన్మానించాలని కొంత నిధి వసూలుచేసి సంచిక వేయిస్తున్నది. తెలుగు నేలనాలుగు చెరగులనుండి "కవిబ్రహ్మ"ను నుతిస్తూ గద్యపద్యాత్మకములవు ప్రశంసలు వచ్చాయి.

ఆ సంచికనూ, నిధినీ ఆయనపట్ల వుపహారభక్తిగా సమర్పించే అదృష్టానికి ఆంధ్రులు నోచుకొనలేదు.

సూతాశ్రమంలో మధురకవనగానం చేయ నేర్చిన గండుకోయిల కాలవాహినిలో కలిసిపోయింది.

ఆయన నెలరోజులక్రితం కన్పించినపుడు "జిబిలిక"అనే గేయకావ్యవ్రాతప్రతిని చూపారు. అది బాలసాహిత్యానికి చెందిన ఉత్తమగ్రంథంలాగా తోచింది. "చందమామ"లో ఆయన వ్రాస్తున్న పాటలు బాలసాహిత్యానికి నిజమైన గీటురాళ్లు. "కాశ్మీర్" అనేది మరొక పద్యకావ్యమట. దానిని ఆచార్యరంగాగారికి అంకిత మిచ్చారట.

ఈ రెండింటినీ ముద్రించాలనే వుద్దేశంలో వున్నారు. కాని! ఇంతలోనే ప్రళయం వచ్చిపడింది. ఎంత లెంతలుగానో బాలసాహిత్యాన్ని సృష్టించాలనే కోరిక ఆయన కిటీవల గాఢంగా కలిగింది—దానికొరకెంతగానో కృషి చేసి ఆంధ్రబాలుర చేతి కందించారు.

ఆయనజీవితోద్దేశం పూర్తిగాలేదు. ఆయనఅకాలమరణం ఆంధ్రసారస్వతంపై తగిలిన పెద్ద ఆఘాతం.

దీనినుండి ఆంధ్రదేశం కోలుకోవాలన్నా, ఆయనఆత్మ శాంతించాలన్నా జరుగవలసిన పని ఒకటే—

అది "సంపూర్ణవీరభారతావతరణ"

ఏ మహాకవి యీ కావ్యశేషాన్ని నిర్వహింపబూనుకొంటాడో భావికాలం నిర్ణయించాలి. ఆ సుదినంకోసం యెదురుచూస్తూ నరసయ్యగారి ప్రవిమలాత్మకు కేలో్మడ్చుదాము.

ఆంధ్రజిల్లాలలో శాసనసభా నియోజకవర్గం

(10-వ పేజీ తరువాయి)

వర్గంగా కనిపించుతుంది. అదే సత్తెనపల్లి - అచ్చెమ్మపేట, ఫిరంగిపురం - పెదకూరపాడులు కలిపితే మొదటిదానికి 99,144 మరొకదానికి 1,06,423 మంది జనాభా వుండడం సంభవిస్తుంది. అపుడు 37 వేల తేడా కాకుండా ఏడువేల తేడా మాత్రమే వుంటుంది. అది సమంజసంగా కూడా వుండడం సంభవం. లేక సత్తెనపల్లి బెల్లంకొండలు కలిపి, అచ్చెమ్మపేట ఫిర్కాను పల్నాడుతాలూకాలో కలిపినా తాలూకాలోని నియోజకవర్గాలు అసమానంగా 87 వేల తేడాలతో వుండకుండాపోతవి.

ఇవి సాధారణంగా నియోజకవర్గాలను విభజించవలసివచ్చినప్పుడు తగిలే ఆలోచనలు. ఇది ఒక ఈ ఫిర్కాకైగాని, ఈ తాలూకాలోనే అనిగాని నే నుదహరించడంలేదు. అసలు మొత్తం జిల్లాలన్నిటిలోనూ నియోజకవర్గ నిర్ణయం జరుగవలసినపుడు ఈ అసమానత వుండకూడదనడానికి ఒక జిల్లాలోని ఒక తాలూకాను నాకు [illegible]గా తెలిసినదానిని వివరించి విమర్శనా చూపాను. ఈ విధంగానే అసలు అన్నిప్రాంతాలలో కూడా యోచించవలసివుంటుంది. ఇప్పటికే జిల్లాకలెక్టరుల నిర్ణయాలకు వదిలివేశారు. ఇంకా మంత్రిమండలి పై సమావేశంలో ఆలోచించబోతున్నామన్నారు. అందువలన యిట్టి అసందర్భాలు, అసమానతలు జరుగకుండా చూడడం దూరదృష్టికి నిదర్శనం కాగలదు.

ఈ విధంగా ప్రతిప్రాంతంలోవారును తమ తమ భౌగోళిక పరిస్థితులనుబట్టి, జనాభానుబట్టి అసమానతలు లేకుండా యథేచ్ఛగా-న్యాయంగా నిర్ణయం జరుగుటకు ఆలోచించాలె. డీలిమిటేషన్ కమిషనుని వేదిక ముందు ప్రకటించకుండా ఆఖరుకు, నికరనిర్ణయంగా ప్రకటించడం - అది ఎప్పుడో ప్రకటించడం మామూలు. అదికాకుండా జనాభాను గమనించి ప్రాదేశికతను గమనించి నియోజకవర్గాలు నిర్ణయించుటకు స్థానికులు శ్రద్ధ వహించాలె. ఆంధ్రరాష్ట్రమందంతటా నవభారత రాజ్యాంగాన్నిబట్టి సమానజనాభాతో, సమాన నియోజకవర్గాలు యేర్పడేటట్లు మాడాలె.

రుద్రమదేవి

(6-వ పేజీ తరువాయి)

ఆ కొట్లాట అంతకంతకు తీవ్ర మగుచుండెను. ఇంతవరకును మల్లయుద్ధమే సాగుచుండెను. ఉభయదేవతల కొలువులకు నుపయోగించు కత్తులు బల్లెములుతోమరములు గదలు నా యూరేగింపులో కలవు. వాని ప్రయోగ మింకను ప్రారంభింపలేదు. ఆ రాజమార్గములో నా కొట్లాట తీవ్రమై ఆయుధప్రయోగమున కుభయపక్షములు నుద్యోగించు సమయ మాసన్నమైనది. పరిస్థితి యిట్లు విషమమై ఘోరముగా పరిణమించు స్థితిలో నుండెను.

అంతలో నాకస్మికముగా రాజభటుల శంఖారావములు బోరుకలగెను. ఆ వచ్చుచున్న రాజభటులను గాంచి రెండుగుంపులును చెల్లాచెద రయ్యెను.

ఏకశిలానగరపాలకుడగు మేచయనాయకుడే స్వయముగా నశ్వారూఢుడై యచ్చట ప్రత్యక్షమయ్యెను. ఆ నాయకుని జూచినంతనే పారిపోయినవారు పోగా తప్పించుకొన వీలులేని మిగిలిన రెండు గుంపులవారిలోని కొలదిమందియు ప్రక్కల కొదిగి గడగడలాడుచు నక్కి మాటలాడ సాహసింపకుండిరి.

పైన ఇంత జరుగుచున్నను ఆ పోట్లాటకు మూలకారకులగు బొల్లనికిని గండనికిని అది ఎక్కలేదు. పైవారు తొలగుటచే వారికి స్వేచ్ఛగా పోరాడుకొను తెరపి చిక్కినది. ఇద్దరును బలశాలులే. ఇద్దరును మల్లయుద్ధవిశారదులే. ఏకశిలానగరమందలి మేటిమల్లులు వా రిద్దరే! పూర్వము వా రెన్నిమారులో మల్లరంగములో తమ మల్లయుద్ధప్రవీణత ప్రభువులకు ప్రదర్శించియుండిరి. వారిలో బొల్లనికి బల మెక్కువ; గండనికి చురుకుదన మెక్కువ. ఒక్కొక్కతరి వారిలో నొక్కొక్కడు జయశాలి యగుచుండెను. వారి స్పర్థ యీనాటిది కాదు!

కాని ఈనాడు వారిద్దరికి ప్రవర్తనమైన మల్లయుద్ధము రంగస్థలమున జరుగు యుద్ధమువంటిది కాదు. దీనికి నియమములు లేవు. మధ్యవర్తులు లేరు. అందినచోట అందినట్లు వైరిని కొట్టుటయే. వా రిద్దరు సమము సుద్దీ లయినను ప్రథమములో గండనికి ప్రాప్తించిన పైచేయి యతడు వదలుకొనలేదు. పైన క్రమ్మినవారు ఇప్పుడు దూరమగుటతో నా యవకాశము నాతడు పోనీక గట్టిగా నిలుపుకొనసాగెను. అతని దేహము గంట్లుపడి నెత్తురు కారుచుండెను. ఐనను అత డది లెక్కచేయక నాగసర్పమును ఒడిసిపట్టిన ముంగిసవలె బొల్లనిమాత్ర మతడు లేవనీయక బాధించుచుండెను.

"గండా!"

అది మేచయనాయకుని కంఠము! నాయకుడు గుర్రముపైనుండి దిగనైనలేదు. ఎట్టి యాందోళనమును అతడు కనబరచలేదు. శాంతముగా దృఢముగా స్వచ్ఛముగా అధికారికముగా నా రెండక్షరములు నాత డుచ్చరించెను.

ఆ కంఠస్వరము చెవులబడినంతనే గండడు మంత్రముగ్ధునివలె గడగడలాడుచు బొల్లని విడిచి లేచి నిలుచుండి వినయవిధేయతలతో నాయకునికి వందనము చేసెను.

క్రింద పడియున్న బొల్లనికి నాయకుని గొంతు వినిపించలేదు. రాజభటుల రాకయే అతనికి తెలియదు. అనుకొనకుండగా తన కా తెరపి ఎట్లు చిక్కెనో కూడ తెలియలేదు. కాని యా తెరపి చిక్కినదే వ్యవధానముగ నతడు రోషముతో లేచి గండని గొంతు పట్టుకొన కుప్పించెను. అప్పటి కాతడు గండడు కదలక ఎవరికో వందనము చేయుచుండుట గమనించి తల యటు త్రిప్పబోవుచుండెను. మేచయనాయకుని కొరడా యాతని వీపున బడి మరుక్కుమన్నది. బొల్లని కావేశ మెక్కి యా దెబ్బ కొట్టినవానిపై విజృంభింప వెనుదిరిగెను. వెంటనే యతని కొరడాదెబ్బకంటె తీక్ష్ణమగు మేచయనాయకుని దృష్టి వానిపై ప్రసరించెను. దానితో బొల్లడు నిస్తబ్ధుడై వంగి సిగ్గుపడుచు నాయకునికి నమస్కరించెను.

నాయకుడు మరి మాటాడలేదు. అతడు కుడిచేతి తర్జనితో తనవెంట నున్న భటులకు గండని బొల్లని నిర్దేశించి యొక్కింత సంజ్ఞ చేసెను. భటు లుత్తరక్షణమున బొల్లని గండని బంధించిరి. మిగిలినవారి నెవ్వరిని భటులు ఏమియు చేయలేదు. అది చూచి ధైర్యము తెచ్చుకొని రెండుత్సవములలోని జనమును మరల ఒక్కరొక్కరే నిశ్శబ్దముగా నక్కడ చేరసాగిరి. ఉభయపక్షములవారును వివాదకారణ మావలివారిపై మోపి చెప్పుట కుంకించుచుండిరి. కాని ఎవ్వరికిని ముందు మాట్లాడుటకు నాయకునిఎదుట నోరు రాలేదు.

"అలజడిచేయక మీ మీ కొలువులు సాగించుకోవలసిన దని నాయకుల యాజ్ఞ!"

ఇట్లని నాయకునివెంట నున్నవారిలో ప్రధానభటు డనుజ్ఞ యిచ్చినంతనే ఉభయపక్షములవారును తాము చెప్పికొనదలచినది చెప్పికొను ప్రయత్నమే మానివేసి నాయకునికి వంగి వంగి దణ్ణములు పెట్టుచు నెమ్మదిగా ఉత్సవములు సాగదీసిరి.

పురములో నలజడి యెచ్చట జరిగినను అది మేచయనాయకుని కండ్లకు కనపడునంతటి దివ్యదృష్టిగలవా డని యాతనికి ప్రతీతి కలదు. పూర్వము పలుమారులు వ్యక్తమైన యాతని దివ్యదృష్టి యీనాడు మరియొకపర్యాయము స్పష్టపడెను. వెనుకటి యనుభవములకు మరియొక యుదాహరణముగా నీనాటి వృత్తాంతము కలసెను.

బొల్లని గండని కారాగృహమునకు బంపి మేచయనాయకు డింకను పురసంచారకుతూహలియై కదలిపోయెను.

"వందేమాతరం" గీతకారుడు, బంకించంద్ర ఛటర్జీ

శ్రీ గోపరాజు వెంకటానందం

"వందేమాతరం" గీతమా లేక "జనగణమన" గీతమా! ఏది జాతీయగీతంగా పరిగణించాలనే సందేహం భారతీయులను చాలకాలము నుండి కలవరపెడ్తోంది. కలవరపెట్టడమే గాదు— పెద్దపెద్దవారే ఈ చర్చలలో పాల్గొని ఒక నిర్ణయానికి రాలేకపోయారు. స్వరాజ్యం వచ్చాక ఈ సందేహం, చర్చ మరింత పెద్దవై, చివరకు రాజ్యాంగపరిషత్తునిర్ణయంకొరకు ఎదురు చూడవలసివచ్చింది. రాజ్యాంగపరిషత్తు కూడా ఏ గీతాన్నీ కాదనలేక, రెండింటి యందుకూడా వారి పూజ్యభావమును, నమ్రభావమును వెలిబుచ్చి, తుదకు "జనగణమన" గీతమును సభాప్రారంభంలో ప్రార్థనాగీతంగాను, "వందేమాతరం" గీతాన్ని సభాంతమందు ముగింపుగీతంగాను నిర్ణయించి, రెండు జాతీయ గీతాలనుకూడా సమభావంతో పూజింపగల్గారు.

అయినప్పటికీ, యింకా కొంతమంది మేధావుల హృదయాలలో ఈ జాతీయగీతాలపై లేచిన తుపాను చల్లారలేదు.

రెండు గీతాలుకూడా చాలా గొప్పవే అని సత్యంలో సందేహం లేదు. రెండు జాతీయ గీతాల కృతికర్తలు కూడా మహనీయులు, తపస్సంపన్నులైన దేశభక్తులే. రెండు గీతాలలోను భారతజాతిఔన్నత్యము, భారత సంస్కృతి, భారతదేశప్రఖ్యాతి, భారతమాత విశాలహృదయం చిత్రించబడ్డాయి. అట్టి సందర్భంలో ఎవరిని ఎవరు కాదనగలరు. "జనగణమన" రచయిత విశ్వవిఖ్యాతిగాంచిన విశ్వకవి రవీంద్రనాథటాగూరు. "వందేమాతరం" రచయిత సారస్వతరంగంలో అందెవేసినచేయిగా పరిగణింపబడిన దేశభక్తుడు శ్రీ బంకించంద్రఛటర్జీ. జాతీయగీతాలుకూడా దేశభక్తిప్రపూరితమైన హృదయాలనుండే వెలువడిన వనడంలో సందేహం లేదు. విశ్వకవి రవీంద్రుడు 20వ శతాబ్దంలో చాలకాలము మనమధ్యనుండి దివంగతుడగుటవల్ల, ఆయనదర్శనభాగ్యము పొందడంలోను, ఆయనదివ్యసందేశము వినడంలోను, ఆయనపరిచయభాగ్యము పొందడంలోను అనేకమంది భారతీయులు విశ్వకవినిగురించి తెలుసుకొనగల్గారు. కాని బంకించంద్రఛటర్జీ 20వ శతాబ్దం ప్రవేశింపనిక్రితమే, దేశం నేడు మేల్కొన్నంతగా మేల్కొననిక్రితమే, భారతీయులు రాజకీయంగా స్వరాజ్యాన్ని సాధించగల్గినంతటి విప్లవచైతన్యం పొందనిక్రితమే స్వర్గస్థుడగుటవల్ల, ఆయనజీవితవిశేషములు మరుగున పడిపోయినవి. ఆయన రచించిన "వందేమాతరం" గీతాన్ని గురించినంతగానైనా, ఆయనజీవితాన్ని గురించి భారతీయులలో చాలమంది ఎరుగరు. అందుచేత భారతదేశానికి "వందేమాతరం" గీతాన్ని ప్రసాదించిన శ్రీ బంకించంద్ర ఛటర్జీ జీవితవిశేషాలనుగురించి తెలుసుకొనడం మన విధి.

బంకించంద్రఛటర్జీ పరలోకగతుడై యిప్పటికి అర్ధశతాబ్దంపైన అయినా, నేటికీ బెంగాలు దేశంలో ప్రతియింట బంకింబాబుపేరు వినవస్తూనేఉంటుంది. అంతే గాదు— ప్రతియింట బంకిబాబు, బెంగాలురాష్ట్రం కన్న మణిపూసలలో నొకరుగా గౌరవభావంతో పూజింపబడ్తూనేఉంటాడు.

బంకింబాబుజీవితంలోని చివరఘట్టము ఎక్కువమందికి తెలిసినా, ఆయనబాల్యజీవితం మాత్రం చాలమందికి తెలియదు.

బంకింతండ్రి జాదవచంద్రఛటర్జీ 1794వ సంవత్సరంలో జన్మించాడు. ఈస్టుఇండియా కంపెనీవారు బెంగాలును పరిపాలిస్తూన్న రోజులైనప్పటికీ అవి, మహమ్మదీయనవాబులు పరిపాలించిన వాతావరణం యింకా ఆ బెంగాలు పరిసరప్రాంతాలను విడిచిపెట్టకపోవుటచే, ప్రభుత్వోద్యోగం సంపాదించడంనిమిత్తం జాదవచంద్ర ఛటర్జీ పర్షియనుభాష నేర్చుకొన్నాడు. ఇంగ్లీషుభాష నెమ్మదినెమ్మదిగా ప్రాముఖ్యత పొందటం గ్రహించి ఆంగ్లమునుకూడా అభ్యసించాడు. జాదవచంద్రఛటర్జీ గొప్ప మేధావియే గాకుండా గట్టి పరిశ్రమ గలవాడు. ఒకపర్యాయం కటక్‌లో సాల్టుటాక్సు ఆఫీసరుగా పని చేస్తూన్న తన జ్యేష్ఠసోదరునివద్దకు కలకత్తా నుండి నడిచివెళ్లెను. 1836 లో ఈయన మిడ్నపూరులో ట్రెజరరుగాను, 1838 లో హుగ్లీలో డిప్యూటీకలెక్టరుగాను నియమింపబడ్డాడు.

బంకించంద్రఛటర్జీ 1838లో జూన్ 27వ తేదీని ఇరువదినాలుగు పరగణాల జిల్లాలో "కంతల్పారా" గ్రామంలో జన్మించాడు. ఆ సమయంలోనే బెంగాలులో మరిముగ్గురు మహానుభావులైన కేశవచంద్రసేన్, హేమచంద్ర బెనర్జీ కవి, కృష్ణదాస్ పాల్ గార్లు కూడా జన్మించారు. బంకింబాబుకు ఇద్దరు అన్నగార్లు, ఒక తమ్ముడు ఉన్నారు. బంకిం మిడ్నపూర్‌లో కొంతకాలం విద్య నభ్యసించాడు.

ఆ రోజులలో హుగ్లీకాలేజీ దేశీయవిద్యాకేంద్రాల్లోకల్లా ప్రసిద్ధికెక్కింది. 1847 సంవత్సరంలో బంకింకూడా అందులో చేరెను. ఓం ప్రథమంగా బంకిం తెలివితేటలను గుర్తించబడడం ఇక్కడనే జరిగింది. హుగ్లీకాలేజీలో అనేకమంది ప్రఖ్యాతపురుషులు తయారైనా, బంకింతో సరిసమానులైనవారు ఎవరూ లేకపోయారు – ఒక్క కలకత్తా హైకోర్టు జడ్జీ ద్వారకనాథ మైత్రా తప్ప. – 1847 లో ప్రెసిడెన్సీకాలేజీలో చేరి బంకిం కేశవచంద్రసేనుతో సహాధ్యాయి అయెను.

ఆ సంవత్సరంలోనే ఇండియాలో సిపాయి కలహం చెలరేగింది. దానిఫలితంగా హిందూదేశపరిపాలన ఈస్టుఇండియా కంపెనీనుండి బ్రిటిషుప్రభుత్వం తీసుకొనడం జరిగింది. క్రమక్రమంగా హిందూదేశపరిపాలనపద్ధతులు బ్రిటిషు రాజ్యాంగ పద్ధతిని మార్చడం జరిగింది. 1857లో జరిగిన ప్రథమభారతస్వాతంత్ర్య సంగ్రామఫలితంగా బ్రిటిషువారు మేల్కొని భారతీయులకు తమ భాష, తమ అలవాట్లు నేర్పితేనేగాని లొంగిరారని తలచి, 1857 సంవత్సరంలోనే భారతీయులకు పాశ్చాత్యసంస్కృతి, వారి వేషభాషలు నేర్పడానికి, కలకత్తానగరంలో లండనువిశ్వవిద్యాలయ పద్ధతిని, లార్డుమెకాలే, రాజారామమోహనురాయ్‌గార్ల సహాయంతో ఒక ఆంగ్లవిశ్వవిద్యాలయం నెలకొల్పబడింది.

బంకించంద్రుడు కలకత్తాలో ప్రెసిడెన్సీకాలేజీలోని లెక్చరర్లకు బిడ్డూనే, 1858లో బి. ఏ. పట్టము పొందాడు. ఆ క్రొత్తకాలేజీలో మొట్టమొదటి సంవత్సరంలో బి. ఏ. పరీక్ష ప్యాసయినది బంకిం, మరొకరున్నూ మాత్రమే.

ఆసంవత్సరంలోనే అనగా 1858 ఆగస్టు నెలలో బంకించంద్రఛటర్జీని జెస్సోర్ లో డిప్యూటీమేజస్ట్రేటుగాను, డిప్యూటీకలెక్టరుగాను నియమించడం జరిగింది. బంకించంద్రుడు చేసిన 33 ఏండ్ల ప్రభుత్వోద్యోగం అతిసమర్థతతో నిర్వహించెను; అతిచాకచక్యముతో పైప్రతిపక్షులకు, తన అధికారుల అన్యాయాలకు తలొగ్గక, నిష్పాక్షికముగా నుండెను. 1867 సంవత్సరంలో బంకించంద్రుడు "మినిస్టీరియల్ కమిటీ"కి కార్యదర్శిగా నియమింపబడెను.

మంచిగా బ్రతకడంకూడా లోకంలో కష్టమే. అందుచేతనే ప్రఖ్యాతరచయిత జార్జి బెర్నార్డుషా "మంచివాడుగా బ్రతకబట్టే గాంధీమహాత్ముడు హత్యగావింపబడ్డాడు." అని అన్నాడు. ఆవిధంగానే, బంకించంద్రుడు ఎంత న్యాయంగాను నిష్పాక్షికంగాను తన ఉద్యోగధర్మము నిర్వర్తించినను, జాత్యహంకారంతో కూడిన ఒక యూరోపియనుఆఫీసరుతో విరోధపడడం తప్పలేదు. బరంపురంలో నున్న యూరోపియనుఆర్మీఆఫీసరు కల్నల్ డఫిన్‌తో బంకిముకు అభిప్రాయభేదం వచ్చెను. వెంటనే బంకించంద్రుడు అతనిపై "లాసూట్" వేసెను. ఈ సంఘటన ప్రజలలోను, ప్రభుత్వోద్యోగుల లోను కూడా ఆనాడు చాల ఆందోళనకలిగించెను. బంకింబాబు బరంపురంలో ఉంటూండగా, అతనికి స్థానికసారస్వతసమాజంతో సంబంధం కల్గెను. 1852లో అక్కడ నుండగనే, "వంగదర్శనం" అను బెంగాలీపత్రిక నొకదానిని ప్రకటించెను.

1881 సంవత్సరంలో బంకింతండ్రి జాదవచంద్రఛటర్జీ మరణించెను. 1882 సంవత్సరములో బంకింబాబు ఒరిస్సాలోని జయపూర్‌కు బదిలీ చేయబడెను. 1891లో తన ఉద్యోగంనుండి 53వ ఏట బంకించంద్రుడు రిటైరు అయ్యెను. 1894లో ప్రభుత్వం ఈయన సేవను కొనియాడుతూ "రాయ్‌బహద్దర్" అని బిరుదము నిచ్చెను. *"He was made a companion of the most Eminent order of the Indian Empire"* అని ఈ సందర్భంలో ప్రభుత్వం వారు ఈయననుగురించి పేర్కొనిరి.

బంకించంద్రునిలో గల గొప్పవిశేష మేమిటంటే, అతడు ప్రభుత్వోద్యోగిగా వివిధ గ్రామాలు సంచారం చేసినప్పుడు, ఆయా ప్రాంతమందలి రైతులతోను, ప్రజానీకంతోను పరిచయం చేసుకొని వారి కష్టసుఖములను తెలుసుకొనుచుండెడివాడు.

సారస్వత సేవ

బంకింబాబులో సారస్వతాభిలాష చిన్నతనమునుండియు ఉన్నట్లు కనపడుతోంది. అతని చిన్నతనములో అనగా 1853 లోనే బెంగాలీపత్రికయైన "సంబద్‌ప్రభాకర్"లో వ్యాసాలు వ్రాయుచుండెడివాడు. 1858 లో అంత చెప్పుకోదగ్గ రచనలుగా పేరొందకపోయినా, ఆయనప్రథమరచనలు, కొన్ని వ్యాసములు, పద్యములు ప్రకటింపబడెను. ఆంగ్లభాషలో "రాజమోహనుని భార్య లేక యువకహిందూసాహసకృత్యములు" అను పుస్తకమును వ్రాసెను.

బంకిం వ్రాసిన నవలలన్నీకూడా ఉద్యోగకాలంలో వ్రాసినవే. 1865, 1866 సంవత్సరములలో బెంగాలురాష్ట్రంలోని 24 పరగణాల జిల్లాలోని "బరూపూర్"లో నున్నప్పుడు "దుర్గేశనందిని, కపల్‌కుండల" అను నవలలు వ్రాసెను. 1887వ సంవత్సరంవరకు, ఆయనవచనగ్రంథాలతో బాటు ఇతర 14 గ్రంథాలుకూడా వెలువడ్తూనే ఉన్నాయి. 1882లో ప్రఖ్యాతిగాంచిన "ఆనందమఠము" 1887లో "కృష్ణకాంతర్ వీలునామా" గ్రంథాలు వెలువడ్డాయి.

బంకింబాబు బెంగాలుసారస్వతరంగంలో అమోఘమైన స్థానమును సంపాదించెను. బంకిం నవలలు బయటపడేవరకు, బెంగాలులో అనువాదాలే ఎక్కువగా ఉండేవి. కాని స్వతంత్ర రచనలు కరువయ్యెను. బంకించంద్రుని రచనలతో బెంగాలుసారస్వతంలో ఒక సరిహద్దుగీత ఏర్పడెను. అంతకుపూర్వం రచయితలు రాజా రామమోహన్‌రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, అక్షయకుమారదత్తు మొదలగువారు రచించిన రచనలు సంస్కృతపదాలతో నిండి గ్రాంథికభాషలో నుండుటవల్ల ప్రజానీకానికి దూరంలో నుండెడివి. బంకింరచనలు ప్రజానీకాన్ని దగ్గరకు చేరదీసి సారస్వతంలో అభిలాష గలవారిగ జేసినవి.

బెంగాలుదేశంలో విద్యావంతులు కరువైనందున, ప్రజానీకంలో విద్యాప్రచారం చేసేవారికొరకు, విద్యాప్రచారంనిమిత్తం కొన్ని గ్రంథములు రచించే గ్రంథకర్తలకొరకు దేశం ఎదురుచూస్తూన్న సమయంలో, బంకించంద్రుడు బయటకు వచ్చి దేశభవిష్యత్తుకు సహాయపడ్డాడు. అతని రచనలు కేవలం విద్యార్థులకే గాకుండా యావత్ప్రజానీకానికి పనికివచ్చునట్లుగా పాశ్చాత్యవిషయములనుకూడా కొన్నిటిని సేకరించి విశదీకరించి ప్రకటించగల్గెను.

రచయిత సాధారణంగా ఒక విషయాన్ని గురించి తన హృదయంలో పడే ఆరాటం, బాధ, సంతోషం మొదలగునవన్నీ, అతని రచనలలో కథావస్తువుగా మనం చూడగల్గుదుము. మనం చదివే ప్రతికథలోను రచయితహృదయం మనకు ఎక్కడో ఒకచోట కన్పించకమానదు. కథావస్తువులో రచయితహృదయాన్ని మనం గ్రహించగల్గిననాడే, ఆ కథ వాస్తవికరూపంతో, ప్రజానురంజనం పొందగలదు. ఆ విధంగానే బంకించంద్రుని రచనలలో అతని నిజహృదయం ప్రతిబింబిస్తూఉంటుంది. దేశభక్తి, సంస్కృతి, నీతి, నియమం, అవసరమైన ఆవేశం, శృంగారం మొదలైనవన్నీ చాల మోతాదుగా చక్కని వర్ణనలతో అతని నవలలు దుర్గేశనందిని, రాజసిన్హా, శీతారామ్, మృణాళిని, దేవీచౌదురాణి, ఆనందమఠం, మొదలైనవాటిలో మనకు ద్యోతకమగును. గీత, మహాభారతం, మొదలగువాటిపై బంకింబాబు వెలిబుచ్చిన అభిప్రాయాలకు ఒక ప్రత్యేకత గలదు.

బంకిం తన జీవితంపొడుగునా వివిధరకములైన ప్రజలమధ్య తిరిగి సంచరిస్తూ, అనేకబాధ్యతలుగల పదవులను నిర్వహించెను. ఇన్ని వ్యాపకముల మధ్యకూడా ఈ మహాశయుడు అమోఘమైన సారస్వతసేవ చేసెను.

బంకించంద్రుని కీర్తిప్రతిష్ఠలు ఆయన రచించిన "వందేమాతరం" గీతంతో మిన్నుముట్టెను. ఈ "వందేమాతరం" గీతమే భారతదేశరాజకీయోద్యమానికి ఆనాడు పునాదిరాయి అయింది. "వందేమాతరం" ఉద్యమానికి చిహ్నమే వందేమాతరంగీతం. బంకిం ఒకరాజకీయధురంధరుడుగాగాని, మిల్టనువంటి కవిశేఖరుడుగాగాని కాలేకపోయినా అతను కేవలం భారతసంస్కృతి మూర్తీభవించిన సంఘసేవకుడు, సారస్వతవేత్త కావడమే అతని హృదయంనుండి, భూనభోంతరాలు మారుమ్రోగిన ఇట్టి వందేమాతరం గీతం వెలువడ్డానికి కారణం.

బంకిం రాజకీయాలలోనే ప్రవేశిస్తే, అతని మనోభావాలు, రాజకీయవాతావరణం ఏలా మారేదో! బంకిం ఆనాడు రాజకీయాలలోనికి ఉరకకపోవడానికి కారణం అతడు ప్రభుత్వోద్యోగిగా తన జీవితం ప్రారంభించేశాడు. ప్రభుత్వోద్యోగులకు రాజకీయాలకు చాల దూరము. అందులో ఆరోజులలో దేశప్రజలలో రాజకీయచైతన్యం యింత వెల్లువలుగా ప్రవహించలేదు. "వందేమాతరం" (తల్లీ! నమస్కారం) అని చెప్పుకొనే వాక్స్వాతంత్ర్యానికే దిక్కులేని రోజులవి. అదీగాక ప్రత్యేకంగా బెంగాలులో రాజకీయవిజృంభణ ఆనాడు మిగతారాష్ట్రాల పాటి లేదు. అందుచేత బంకించంద్రఛటర్జీ తన కున్న కొద్ది వ్యవధిని, అవకాశాన్ని, శక్తిని మేధతో సంబంధించిన సారస్వతరంగంలోను, సాంఘికరంగంలోను ఉపయోగించవలసివచ్చింది. బంకింరచనలు చాల ఉత్తేజకంగానే గాక ఆవేశపూరితంగాకూడా ఉండేవి. భారతసంస్కృతి, భారతసిరిసంపదలు, సత్సంప్రదాయం, దేశభవిష్యత్తు మొదలగునవన్నీ చక్కగా ఆ "వందేమాతరం" జాతీయగీతంలో యిమిడ్చి దేశార్పితం చేసిన మహనీయుడు బంకించంద్రఛటర్జీ.

ఈ మహానుభావుడు తన 56వ ఏట అనగా 1895 ఏప్రిల్ 8వ తేదీని మధుమేహవ్యాధివల్ల బాధపడి స్వర్గస్థుడయ్యెను. బంకింబాబుకు అత్యంతప్రియకరము, స్మారకచిహ్నము నగు "వందేమాతరం" గీతంతో ఆ మహానుభావునికి మనం జోహారు లర్పించెదముగాక!

వందేమాతరం ॥వందే॥
సుజలాం – సుఫలాం మలయజ శీతలాం
సస్యశ్యామలాం – మాతరం ॥వందే॥
శుభ్రజ్యోత్స్న – పులకితయామినీం
ఫుల్లకుసుమిత – ద్రుమదళ – శోభినీం
సుహాసినీం – సుమధురభాషిణీం
సుఖదాం వరదాం మాతరం ॥వందే॥

ఇన్‌ష్యూరెన్సు యేజంటు

(8-వ పేజీ తరువాయి)

యజ: (యేదో విపత్తు సంభవించినట్టు) యేమని రాసుకున్నారు? బడిపంతులనా?

యేజం: (అర్థంగాక) అవును. యేం?

యజ: బడిపంతులు అనే హోదాకు విలువ, గౌరవం లేవు. బతకలేక బడిపంతులు అని అందరికీ చులకన! మేష్టరు అంటే కాస్తో కూస్తో గౌరవం వుంటుంది! నీ అభిప్రాయం యేమిటి శాంతా?

శాంత: నిజమే! మేష్టరు అంటేనే బావుంటుంది.

యేజం: (ఖంగారుగా) రెంటికీ అట్టే భేదం లేదుగనక యేదిరాసుకున్నా యిబ్బందిలేదులెండి!

యజ: (విసుగ్గా) మీ కిబ్బంది లేకపోతే పోవచ్చు. నాకుమాత్రం యిబ్బందే! మేష్టరు అని రాసుకోండని నా కోరిక:

యేజం: (నిట్టూర్చి) ఇక మీరు అదే కావాలని కోరితే కాదనగలనా! (మారుస్తాడు) యేవిధంగా ప్రీమియమ్ను కట్టడానికి మీకు వీలుగా వుంటుంది?

యజ: నెలవారీగా ఐతేనుళువుగావుంటుందేమో!

యేజం: సరే! (కలంతో ఫారంమీద వ్రాసినట్టు నటిస్తాడు. రామారావది గమనించడు.)

యజ: రాసేశారా?...చూడండి. సంవత్సరాని కొకమారు ప్రీమియం కట్టడం చవుకకదూ? యేమంటారు?

యేజం: కొంతవరకు అవుననక తప్పదు.

యజ: మీ కేమీ అభ్యంతరం లేకపోతే, సంవత్సరాని కొకమారు ప్రీమియంకడ్తాను... మళ్లీ మీరు మార్పు చేయ్యాలిగావాలు...క్షమించండి...పోనీ ఆ మిగిలిపోయిన ఫారం వాడలేకపోయారూ?

యేజం: ఆబాధ పడనవసరం లేదులెండి! మీ కేదన్నా అనుమానం కలగవచ్చునని యింకా ఆ విషయం రాసుకోలేదు.

యజ: (నిర్ఘాంతపడి) ఓహో! అట్లాగా!

యేజం: (తాపీగా) మీ రింతకు పూర్వం యేదైన జబ్బునపడ్డారా?

యజ: ఖచితంగా అవుననిగానీ, లేదనిగానీ చెప్పలేను. మొన్నరాత్రి అనుకుంటాను— అమాంతంగా శరీరంలో వొణుకు బయల్దేరింది. నా అవయవాలు నాపట్టు దప్పినట్టు ఫీలయాను.

యేజం: అరె పాపం!...తర్వాత?

యజ: తర్వాత కదల్లేక మెలికలు తిరిగిపోతూ, పడకమీదే వుండిపోయాను...ఆ జబ్బేమిటో నాకు అంతుబట్టలేదు...మహా అవస్థపడిపోయాను. అంతేగదూ శాంతా?

శాంత: భలే విచిత్రమైన వ్యాధిసుమండీ, నిజంగా! (నిట్టూరు)

యజ: పాపం మాఆవిడకు ఆసమయాన యేమీ తోచిందిగాదు. దిగులుపడి కూర్చుంది.

యేజం: విచిత్రంగానే వుందండీ! డాక్టరేమన్నాడు? (ఆతురత కనపరుస్తాడు)

యజ: డాక్టరా? దేనికీ? వొత్తివొంగలు - జలగలు! చాల తీవ్రంగా, వ్యాధివస్తే నే డాక్టర్లను నమ్ముతాను నేను...

యేజం: ఇంతకు ఆ జబ్బు యేమైవుంటుందీ అని నా సందేహం!

శాంత: నా సందేహంకూడా అదే నండీ!

యజ: ఆఁ! యేముంటుంది? అదోరకమైన పడిశమై వుండొచ్చు.

యేజం: జ్వరం గాదంటారా?

యజ: జ్వరంగాకపోయినా జ్వరానికి సంబంధించిన పడిశమేమో! మీరే మనుకుంటున్నారు?

యేజం: నాకేం అర్థంగాలేదు ఆజబ్బేమిటో!

యజ: (చిరాకుతో) నేను సరిగా వివరించలేకపోతున్నాను. అందుకే మీకు అర్థంఐవుండకపోవచ్చు. చూసివుంటే మీకు బోధపడేది!

యేజం: ఆవిషయం వదిలేయండీ పోనీ! మీ రింతకు పూర్వం యే వ్యాధి వచ్చినప్పుడు డాక్టర్ని చూశారో జ్ఞాపకముందా?

యజ: (అతిసహజంగా) ఆఁ!...నా గుండెలు ఆగిపోయినప్పుడు...!

యేజం: (తన గుండె లాగిపోయినంత ఆశ్చర్యంతో) యేమన్నారు?...గుండెలు...ఆగిపోయినప్పుడా?...యెలా మళ్లీ...బ్రదికా?రు

యజ: (యేజంటు అవివేకి అన్న నిశ్చయంతో) గుండె లాగిపోవడం అంటే ఆగిపోవడం గాదు!...నా గుండె లప్పుడప్పుడు మర్మరధ్వనులు చేస్తుంటాయి!

యేజం: (దిగ్భ్రమచెంది) అదేమిటి?... మర్మరధ్వనా?...అంటే?

యజ: క్షణంసేపు నిశ్శబ్దంగావుంటే మీ కవి నొచ్చు...(కొన్నిక్షణాలపాటు నిశ్శబ్దం - యేజంటు చెవియొగ్గి ఆలకిస్తాడు)

యేజం: (నిరాశతో) నా కేమీ వినబడలేదండీ!

యజ: (ప్రతినిత్యం జరిగే సాధారణ విషయంగురించిలాగా) మాకు మల్లే దానికి మీరు అలవాటుపడాలి...నీకు వినబడదూ శాంతా?

శాంత: (సహజంగా) వినబడకేం!... రోజూ మామూలేగా!

యేజం: (హతాశుడై) మీకు గుండె జబ్బుంటే యిన్‌ష్యూర్ చేయడానికి వీలుపడదు!

యజ: (అది విని హుషారుగా) అలా అనకండి! ఇప్పుడిప్పుడు యీ పాలసీగురించి నాకు యింటరెస్టు కలుగుతోంది! నిరుత్సాహపరచకండి!

యేజం: అన్నట్టు యీ గుండెజబ్బువిషయంలో మిమ్మల్ని చూచిన డాక్టరుపేరు చెబుతారా?

యజ: (ఆలోచించి)...డాక్టరు. ...భుజంగ...కాదు...కాదు...గురునా ...*M. B. B. S.*

(యేజంటు ఆ వివరం వ్రాసుకుంటూవుంటే రామారావునాలుకతో వింతశబ్దాలు చేస్తుంటాడు.)

యజ: త్రివిక్రమరావుగారూ!...క్షమిం

మనరాష్ట్రం: మనదేశం:

హైదరాబాద్ రాజ్యాంగ భవిష్యత్తు

భారతరాజ్యాంగవ్యవస్థలో హైదరాబాద్ సంస్థానాన్ని విలీనం చెయ్యడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. డిసెంబరు 1 నుండి సంస్థానగవర్నరుగా మిలిటరీ ఉద్యోగి అయిన మేజర్ జనరల్ జయంతనాథ చౌదరిని తొలగించి భారతప్రభుత్వ సంస్థానశాఖోద్యోగి అయిన శ్రీ యం. కె. వెల్లోడీగారిని నియమిస్తున్నారు. చౌదరిగారు తిరిగి సైనికశాఖలో కార్యాలకు నియమింపబడతారు. ప్రస్తుత సంస్థాన పరిపాలనా విధానంలో మాత్రం మార్పేమీ ఉండదు.

మిలిటరీ అధికారి గవర్నరుగా ఉన్నప్పటికీ, పోలీసుచర్య అనంతరం హైదరాబాద్‌లో పరిపాలన భారతప్రభుత్వోద్యోగులూ, హైదరాబాద్ ప్రభుత్వోద్యోగులే నిర్వహిస్తున్నారు. కాని మిలిటరీ అధికారి గవర్నరుగా ఉండడాన్ని బట్టి బ్రిటన్‌లోనూ అమెరికానూ భారతప్రభుత్వంపై దురభిప్రాయం ఏర్పడింది. పాకిస్తాన్ ఈవిషయాన్ని ఆధారంగా తీసుకుని దుష్ప్రచారం చేస్తోంది. కాని సైన్యాల ఆధారంతో పరిపాలన చెయ్యడం లేదనే విషయాన్ని మరిచిపోతున్నారు.

వెల్లోడీగారి పదవికి గవర్నరు, కమీషనర్, ఎడ్మినిస్ట్రేటర్ మొదలైనవానిలో ఏపేరు పెట్టాలో ఇంకా నిర్ణయం కాలేదు. త్వరలోనే ఈ విషయమై కేంద్రప్రభుత్వం ప్రకటించగలదు.

పైవిషయాల్ని హైదరాబాద్‌లో మేజర్ జనరల్ చౌదరి పత్రికాసమావేశంలో ప్రకటిస్తూ హైదరాబాద్ రాజ్యాంగ పరిషత్సభ ఎన్నికలు 1950 మార్చి 8 వ తేదీని జరపడానికి నిశ్చయించినట్లుకూడా ప్రకటించారు. ఎన్నికలకోసం విపుల సన్నాహాలు జరుగుతున్నాయి.

కాశ్మీరంలోవలెనే హైదరాబాద్‌లో కూడా ప్రజాభిప్రాయాన్ని తెలుసుకుని, వారి అభీష్టం ప్రకారమే సంస్థానభవిష్యద్రాజ్యాంగ స్వరూపాన్ని నిర్ణయించగలదని భారతప్రభుత్వం వాగ్దాన మిచ్చింది. ఇప్పటికీ ఈమాటపైనే కట్టుబడి భారతప్రభుత్వం వ్యవహరిస్తోంది. ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోడానికి ప్లెబిసైట్ (జనవాక్యనిర్ధారణ) జరపడంగాని లేక భవిష్యద్రాజ్యాంగ స్వరూపనిర్ణయసమస్య ఆధారంపై ఎన్నికలు జరిపి రాజ్యాంగపరిషత్సభను నిర్మించి తద్వారా నిర్ణయం చెయ్యడంగాని జరుగుతుంది. హైదరాబాద్ విషయంలో రెండోవిధానం అనుసరించబడుతుంది.

రాజ్యాంగపరిషత్సభ ఎన్నికల నిమిత్తం సార్వజనీన నియోజకవర్గ జాబితాలను కొన్ని మాసాలుగా తయారుచేయిస్తున్నారు. ఎన్నికలు జరపడానికి ఇప్పటినుంచీ సన్నాహాలు జరుపుతున్నారు. ఈ ఎన్నికల్లో సంస్థానకాంగ్రెస్, సోషలిస్టుపార్టీలు పోటీ చెయ్యనున్నాయి. సంస్థాన రాజ్యాంగభవిష్యత్తును గురించి కాంగ్రెస్ ఇంకా ఎట్టి నిర్ణయం చెయ్యలేదు.

సంస్థానాన్ని భాషామండలాలుగా విభజించి సమీపభాషాప్రాంతాలతో చేర్చి సమగ్రభాషారాష్ట్రాలు నిర్మించాలని సోషలిస్టుపార్టీ తన లక్ష్యాన్ని ప్రకటించింది. కాంగ్రెస్‌లో ఈ ఆశయానికి అనుకూలురూ, ప్రతికూలురూకూడా ఉన్నారు. కానిభాషారాష్ట్రాల నిర్మాణంపట్లనూ, హైదరాబాద్ సంస్థాన విభజనపట్లనూ భారతప్రభుత్వ వైఖరిగాని, అఖిలభారత కాంగ్రెస్ వైఖరిగాని విశదం కానందువల్ల సంస్థాన కాంగ్రెస్‌నాయకులు తమతమ వ్యక్తిగతాభిప్రాయాలను వ్యక్తపరచకుండా మౌనం వహించారు. ఆంధ్రరాష్ట్రనిర్మాణానికి కాంగ్రెస్ కార్యవర్గం అంగీకరించిందనీ, భారత ప్రభుత్వం ఈ విషయమై త్వరలో చర్య తీసుకోగలదనీ వచ్చిన వార్తలపై హైదరాబాద్ కాంగ్రెస్ నాయకు లింతవరకూ ఎట్టి అభిప్రాయాన్నీ ప్రకటించలేదు.

సంస్థాన కాంగ్రెస్ అధ్యక్షపదవికి నవంబరు ఆఖరువారంలో ఎన్నికలు జరుగనున్నాయి. ఈ పదవికి స్వామిరామానందతీర్థ, శ్రీ బూర్గుల రామకృష్ణారావుగార్లు కాక ఇంకా ఆరుగురిపేర్లు దాఖలు చేయబడినాయి. వీరిలో మిగతా ఆరుగురూ పోటీనుంచి విరమించుకునే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. అధ్యక్షుని ఎన్నిక అనంతరం సంస్థానకాంగ్రెస్ కార్యవర్గం నియమింపబడుతుంది. ఆ కార్యవర్గం హైదరాబాద్ రాజ్యాంగభవిషత్స్వరూపాన్నిగురించి ఎట్టి విధానం అవలంబించాలో నిర్ణయిస్తుంది.

ఈలోగా, అనగా రాజ్యాంగపరిషత్సభ ఎన్నికలకు కాంగ్రెస్ ఎట్టి వైఖరి అవలంబిస్తుందో స్థిరమయ్యేలోగా హైదరాబాద్ నవాబు భారత అధినివేశంలో చేరనున్నట్లు ప్రకటించగలరని తెలుస్తున్నది. ఆరీతిగా చేరేపక్షంలో భారతప్రభుత్వ సంస్థానశాఖవారు తయారుచేసిన స్వదేశసంస్థానరాజ్యాంగముసాయిదాను హైదరాబాద్‌కు అమలు జరపడానికి వీలవుతుంది. ఇందుకు అధికారవర్గాలలో యత్నాలు జరుగుతున్నాయి. అప్పుడు హైదరాబాద్ రాజ్యాంగపరిషత్సభ మైసూరువలెనే ఈ రాజ్యాంగముసాయిదానుఅంగీకరించే విషయమై మాత్రమే చర్చించవలసి ఉంటుంది. అటువంటి నిర్ణయం సులువుగా జరిగిపోతుందనుకోవచ్చును.

దీనినిబట్టి హైదరాబాద్ భవిష్యత్స్వరూపం మైసూరు మొదలైన సంస్థానాలతోపాటే వాని విధంగానే నిర్ణయమవుతుంది. అంటే హైదరాబాద్‌ను భాషాప్రాంతాలుగా విభజించే యత్నం ఇప్పట్లో జరగదన్నమాట.

తెలంగాణావిభజన సామాన్యసమస్య కాదు. తెలంగాణాను విభజిస్తే వెన్వెంటనే మరాట్వాడా, కన్నడప్రాంతాల భవిష్యత్తును నిర్ణయించవలసివస్తుంది. మహారాష్ట్ర ప్రాంత సమస్య దుష్కరమైనది. అదిప్పుడే పరిష్కారం కావటం అసంభవం. ఇటువంటి వాదగ్రస్తవిషయాన్ని భారతప్రభుత్వం పరిష్కరించ తలపెట్టేయోచనలు లేదు. ఇంక మరాట్వాడా కన్నడ ప్రాంతాలనొకటిగా మిగల్చడం అసాధ్యం. అందువల్ల మిగతా ప్రాంతాలతోపాటే తెలంగాణాకూడా చాలకాలం వేచి ఉండవలసి ఉంటుందని భారత ప్రభుత్వ అభిప్రాయమై ఉండవచ్చును. హైదరాబాద్ సంస్థానాన్ని ఎప్పటివలె ఏకఖండంగా ఉంచడంవల్ల పెద్ద ఆర్థికసమస్య లేవీకొత్తవి సత్పన్నం కావు. ఆహారంవిషయంలో మొత్తం. సంస్థానానికి అవసరమైన 25 లక్షలటన్నుల లోనూ దాదాపు 23 లక్షలు సంస్థానంలోనే ఉత్పత్తి అవుతుంది.

ఆర్థికాభివృద్ధికి చాలా అవకాశాలున్నాయి అందువల్ల స్వల్పఆర్థికసంస్కరణలతోనే హైదరాబాద్ ఆర్థికస్థితిని మిగతా సంస్థానాల ఆర్థికవ్యవస్థవలెనే భారత అధినివేశవ్యవస్థకు అనుగుణంగా మార్చవచ్చును. అనగా హైదరాబాద్ చలామణి ప్రత్యేకతను రద్దుపరిచి, రవాణాసుంకాలు, రాబడిపన్నుల్ని సంస్కరించాలి. అప్పుడు మిగతా సంస్థానాలతో హైదరాబాద్ సమాన మవుతుంది.

ఇటువంటి ఆర్థికసంస్కరణలకు కూడా విపుల సన్నాహాలు జరుగుతున్నట్లు తెలియవస్తోంది. 1950 ఏప్రిల్ 1 వ తేదీకి ఇట్టి సంస్కరణలు చెయ్యడానికి ప్రభుత్వశాఖలు సంసిద్ధమౌతున్నాయి. హాలీసిక్కారూపాయలు అప్పటితో రద్దు కావచ్చును. హైదరాబాద్ సైన్యం పరమాణం ఎంత ఉండాలో అప్పుడే పరిమితం చెయ్యబడుతుంది. నైజాంభవిష్యత్తును మైసూరు మొదలైన సంస్థానాల అధిపతుల వలెనే నిర్ణయించబడుతుంది గాని ప్రత్యేక విధానం అవలంబించబడదు. ఈ విషయాన్ని రాజ్యాంగపరిషత్తు నిర్ణయిస్తుంది. [సీతారాం[

చండి...డాక్టరు గురునాథరావు నాకు పూపిరితిత్తుల జబ్బుకీ, కాళ్ళనొప్పులకీ, మందిచ్చారు...యీ గుండెజబ్బుకి డాక్టరు పరాంకుశం గారి చికిత్స పొందాను...

యేజం: (విషాదంగా) కడుపునొప్పిలాంటివాటికి మీకు వేరే డాక్టరున్నాడా?

యజ: పుహుం...ఆ భాగ్యం లేదు. నా ఆహారం బహు స్వల్పమైంది. కదూ శాంతా?

శాంత: అంతే అంతే!

యేజం: (పూర్తిగా పరాజితుడై వైఖరితో లేచి ఫారం ముక్కలు ముక్కలు చేస్తాడు.) నాకు శెలవిప్పించండి...ఈ కాస్త సేపు మీతో కులాసాగా గడపగలిగినందుకు మీకు నా థేంక్స్! (కుడివేపుగా నిష్క్రమిస్తాడు:)

యజ: (అతను నిష్క్రమిస్తుంటే) అయ్యో! వెళ్తారేం? ముందు ముందు జరగబోయే ప్రమాదాలగురించి జాగ్రత పడాలి అనుకుంటూంటే...(శాంత యేమీ జరగనట్టు తనపనిలో నిమగ్నురాలై వుంటుంది...)

డాక్టర్ పట్టాభి

(21 వ-పేజీ తరువాయి)

వురితో తగాదా సంభవించటము జరుగుతూ ఉంటుంది. అహమ్మదాబాద్ జైల్లో ఉన్నప్పుడు వ్రాసిన "ఫెదర్సు అండ్ స్టోన్సు" అనే పుస్తకము పీఠికలో "నమ్రత అనే సుగుణం నాకు అబ్బలేదు" అని పట్టాభిగారే వ్రాసుకొన్నాడు. వివిధరంగాల్లో వీరి ద్వారా నైపుణ్యం సంపాదించుకొన్న పెద్దలు పలువురు, ఈ లోటును భరించలేక గురువుగారికేపంగనామములు పెట్టారు. కాని నేటికి వారికి ఈ నైజగుణముపోలేదు.

బందరులో ఒక బహిరంగసభకు అధ్యక్షత వహించవలసిందిగా కోరటకు రెండోమారు వెళ్లాను. వారివద్దకు వెళ్లేకిటుకు తెలుసుకొన్నందున పూర్తిగా ఖద్దరువేషము వేసుకొని వెళ్లాను. కారణాంతరాలవల్ల అధ్యక్షత వహించుటకు అంగీకరించకపోయినా నా పట్ల సౌమ్యంగా ప్రవర్తించినందుకు సంతోషించి బయటపడ్డాను. పట్టాభిగారికి ఎన్ని సం॥రాల క్రిందటి విషయమైనా జ్ఞాపకముంటుందని చెప్పుకోటమేగాని నేను స్వయంగా చూడలేదు. నేను మూడవసారి వారిని చూచుటకు వెళ్లినప్పుడు నా స్వవిషయంలోనే ఆలాగున చెప్పుట జరిగింది. ఒకమారు జబ్బుచేసిందంటే చాల సం॥రాలు గడిచిన పిమ్మట ఆయనవద్దకు వెళ్లి నన్నుగూర్చి పరిచయము చేసుకోటము మొదలెట్టాను. ఆవెంటనే ఆయన అందుకొని నాకు జ్ఞాపకములేని 20॥రాల క్రిందటి ఒక విషయము చెప్ప నారంభించారు. 1921 సం॥రములో మా గ్రామంలో ఉపన్యాసముచేసి వెడుతూ చెప్పులు మరచిపోతే ఆమరునాడు వాటిని తీసికొనివెళ్లి వారికి అప్పజెప్పాను. ఆవిషయము నాకు గుర్తులోనే లేదు. అది గుర్తుచేసి ఆనాటినుంచే నన్ను ఎరుగున్నానన్నారు. 1926 లో "హైందవ గార్హస్థ్యం" మీద నోబుల్ కళాశాలలో చెప్పిన విషయాలే తూచతప్పకుండా 1941 లో పుస్తకరూపేణా వెలువరించాడు. ఎన్ని సం॥రాల క్రిందటి విషయమైనా గుర్తుంచుకోటంలో డాక్టరుగారితో సాటిఅయినవా రెవరు లేరు.

సాధారణంగా ఏవ్యక్తికైనా ఏ రెండు, మూడు విషయాల్లోనో పాండిత్యం ఉంటుంది గాని అంతకుమించి ఉండేవాళ్లు ఉండరు. కాని మన డాక్టరుగారి విషయము అలా గాదు. వివిధ విషయాల్లో సమానమైన ప్రావీణ్యంఉంది. వైద్యవృత్తి నాచరించే రోజుల్లో కేసును "డయాగ్నెజు" చేయుటలో వీరికిమించినవారు లేరని ప్రసిద్ధిపొందారు. కొంతమంది ప్రసిద్ధవైద్యులు ఈనాడుకూడా వీరి సలహా పొందుతారని ప్రతీతి. 1934 సంవత్సరములో ఆంధ్రరాష్ట్ర వైద్య మహాసభకు అధ్యక్షతవహించి వైద్యలోకములో ఆయనకు సంబంధము లేకపోయినా ఆనాడు ఆయనసూచనలు ప్రముఖవైద్యులను కూడా దిగ్భ్రమ గొల్పాయి. 60 సంవత్సరాల కాంగ్రెస్‌చరిత్రను ఒక నెల రోజులలో పూర్తి చేశాడు. "గాంధీజమ్, సోషలిజమ్, కాంగ్రెసుకే ఎందుకు ఓటివ్వాలి" ఫెదర్సు అండ్ స్టోన్సు మొదలగు పుస్తకాలు వ్రాసి ప్రముఖ గ్రంథకర్తగా కూడా పేరొందాడు.

మొన్న మొన్నటివరకు ఆయనలో ఒకలోపం ఉన్నదని అందరము తలచాము. ప్రముఖ రచయితయగు ఈశ్వరదత్తు ***"Macca is Masulipatam to him"*** మహమ్మదీయులు మక్కాను ఎంత పవిత్రతతో చూచెదరో ఆలాగే మన డాక్టరుగారు బందరును చూస్తూ దాన్నే అంటిపట్టుకొన్నారు." అను ఈ లోపాన్ని "స్పార్క్సు అండ్ ఫ్యూమ్సు" అనే పుస్తకములో వెల్లడించాడు. డాక్టరుగారు బందరును వీడకుండుటకు కారణము నేటికిగాని మనకు అర్థంగాలేదు. ఇప్పటికి పూర్తిగా తెలుసుకొన్నాము. అస్వతంత్రభారతదేశంలో ఏ ఉద్యోగము స్వీకరించనని శపథంకట్టాడు. ఒకవేళ స్వీకరించాలిసివచ్చినా బాపూజీ అనుజ్ఞలేనిదే చేయనన్నాడు. అందువల్లనే విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షస్థానాన్నిలగాయతు మద్రాసు రాష్ట్ర ప్రధానివరకు తిరస్కరించాడు.

లోగడకూడా ఈలాంటి శపథమే చేసి నెగ్గించుకొన్నాడు. 40 సం॥రాలు వయస్సు వచ్చేవరకు ఏరాజకీయసభకు అధ్యక్షత వహించనని దీక్షవహించాడు. సరిగా 40 వ సం॥రములో బరంపురములో జరిగిన రాజకీయసభకు తొలిసారిగా అధ్యక్షతవహించాడు. నేడు మన భారతావనికి స్వాతంత్ర్యము చేకూరింది. ఇక డాక్టరుగారి దీక్ష అయిపోయింది. ఇటీవల అమెరికా, కెనడా, ఇంగ్లాండు తిరిగివచ్చిన నెహ్రూపండితుడు బాపూజీవల్లనే మనదేశం ఇంతకీర్తి వహించిందంటున్నాడు. బాపూజీ వల్లనే ఆయన జీవించియున్నప్పుడే "నా సూత్రాలకు పట్టాభే భాష్యకారుడు" అనే పట్టా పొందాడు కాన బాపూజీ ఆశయాలు, సూత్రాలను నిర్వచించిచెప్పి సంక్షుభితప్రపంచానికి మార్గం చూపే అర్హత నీ కొక్కనికే ఉన్నది. ఆసూత్రాలను విదేశాల్లో ఉన్నతపదవి నధిరోహించి వ్యాపింపచేయి. నీమేధాశక్తి పాశ్చాత్యులకు రుచిచూపి బాపూజీ ఆశయాలను ఫలింపచెయ్యి. అందుకు అప్పుడే గంట మ్రోగింది. ప్రయాణోన్ముఖుడవై యుండు.

కాని ఆంధ్రమాత నిన్ను ఒక్కటే కోరుతున్నది. తన్నుమాత్రము మరవవద్దని, ఒక కంట కనిపెట్టి ఉండవలసింది గాను వాంఛిస్తున్నది.

పాలుడ్రిన్ ఔషధ ప్రయోజనంపై చిత్రం

భారతదేశంలో ప్రతి ఏడాదీ పలువురి ప్రాణాలను బలిగొనే వ్యాధులలో మలేరియా ఒకటి. దీని నివారణకు 'పాలుడ్రిన్' అనేమందు చాలావరకు తోడ్పడగలదని ప్రచారముచేసే చిన్న ఫిలుము నొకదానిని 'డాక్యుమెంటరీ యూనిట్ ఇండియా' తరఫున పాల్ జిల్స్ తీశాడు. ఇందులో మలేరియా ఎట్లా వస్తుందో, దానికి మందు తెలియక ప్రజ లెల్లా బాధ పడతారో, పాలుడ్రిన్‌వల్ల కలిగే ప్రయోజన మేమిటో చక్కగా చూపారు. ఈఫిలిమును ఇంపీరియల్ కెమికల్ ఇండస్ట్రీస్ (ఇండియా) లిమిటెడ్‌వారు మొన్న 2-వ తేదీన నగరంలోని పత్రికలవారికి ప్రభుత్వోద్యోగులకు, డాక్టర్లకు, వైద్యవిద్యార్థులకు కెజినో థియేటరులో చూపించారు. ఇంపీరియల్ కెమికల్ ఇండస్ట్రీస్ ఫార్మస్యూటికల్ శాఖకు చెందిన మిస్టర్ డబ్ల్యు. ఎ. వెల్స అతిథులను ఆహ్వానిస్తూ మలేరియానివారణ జాతీయ ఆరోగ్యాభివృద్ధికే కాక ఆర్థికాభివృద్ధికికూడా తోడ్పడగలదని తెల్పారు. మలేరియానివారణకు అనేకసాధనాలు కలవు. వానిలో "ప్యాలూడ్రిన్" చాలా శక్తివంతమైన సాధనయని తాము గట్టిగా చెప్పగలమన్నారు. గ్రామాదులకు సులభముగా అందుబాటులో నుండుట దీని ప్రత్యేక లక్షణమన్నారు.

గ్రామసీమలలోకూడా ఈపటాన్ని ప్రదర్శించడానికి కంపెనీవారు ఏర్పాటు చేస్తున్నారు.

"ఏం సినీమా కావాలి ?"

"మాయాలోకం కావాలి."

"ఏం సినీమా కావాలి ?"

"మాయాలోకం కావాలి."

తలెత్తి చూశాను. "మాయాలోకం" అనే పెద్ద అక్షరాలతో వున్న పెద్దబోర్డుని యిద్దరు పిల్లలు మోసుకుపోతున్నారు. చిన్న చిన్న బోర్డుల్ని చిన్నపిల్లలు పట్టుకుని వెడుతున్నారు కేకలేసుకుంటూ. మళ్లీ పేపరు చదవడం మొదలు పెట్టాను. కళ్లకు కనబడుతున్న అక్షరాలు ఫేడ్ అవుట్ అయి దుర్మార్గుల అకృత్యాలు, రాక్షసత్వాలు, వ్యాపారస్థుల మోసాలు, దుర్భర జీవితం అనుభవిస్తున్న పేదప్రజానీకం ఫేడ్ ఇన్ అయింది. తల గిర్రున తిరిగింది. లోకం వైఖరి చూస్తోంటే అంతా మాయగానే కనబడుతోంది. ధర్మం నాలుగుపాదాలా నడవాలంటే యెల్లా నడుస్తుంది ? అల్లా నడిపిద్దామనీ, దేశాన్నేకాదు ప్రపంచాన్నంతా కూడా రామరాజ్యంగా తయారుచేద్దామనీ, నోరు బద్దలయేట్టు, గొంతు అర్చుకుపోయేట్టు బహిరంగ సభల్లోనూ, ప్రార్థనసమావేశాల్లోనూ వుపన్యాసాలిచ్చి, చేతులరిగేటట్టు పత్రికలకు వ్రాసి, సత్యాగ్రహాలు చేసి, జైళ్లకెళ్లి, నిరశనవ్రతాలు చేసి, చివరరోజులలో పాదచారియై అపరాధుల్ని పట్టుకోవడానికీ, నిరపరాధుల్ని రక్షించడానికీ బయలుదేరి కల్లోలప్రాంతాలన్నీ (ప్రతిపల్లె) తిరిగిన మన జాతిపిత, యుగపురుషుడు అయిన మహాత్ముని యీ పాడులోకం, మాయలోకం గ్రహించగలిగిందా ? తన పొట్టను పెట్టుకుంది. ఇప్పుడు యెంత దుఃఖించి యేం లాభం ? ఆయన్ని మళ్లీ మనం యెల్లా పొందగలం ? ఆయన తన అనుయాయులను తయారుచేసి మన కిచ్చాడు.

ఈనాడు మన యేకైకనాయకుడు 'జవహరు'. ఈయన మూడుమూర్తులా మహాత్ముని ప్రతిబింబం, ఆయన మన అందరి సహకారం లభిస్తుందని ఆశిస్తున్నారు. అర్థిస్తున్నారు సహకారం కోసం.

కాలచక్రం గిర్రున తిరిగిపోతోంది. దాన్ని యెవ్వరూ ఆపలేరు. దానితోపాటు మనం తిరుగుతున్నాం. ఈ తిరగడంలో అనేకమార్పులు వస్తాయి. వాటిని చూసి మనం ఖంగారుపడ నక్కరలేదు. 'ఏ యెండకా గొడుగు పట్టినట్లు' యీ మార్పుల కలవాటుపడుతూ, యెవరిమట్టుకు వారు న్యాయం, ధర్మం తప్పకుండా వుండాలి. తమవల్ల యెవరికీ యేవిధమైన యిబ్బందీ కలుగకుండా చూసుకోవాలి. వర్తకులు మాయలు లేకుండా, సరుకులు దాచుకోకుండా, ప్రజలకు అందేట్టు చెయ్యాలి. అల్లాగ చేస్తే యిప్పటికైనా మించిపోయిందిలేదు. దేశం బాగుపడితీరుతుంది.

ఈవిధంగా యేవో వూహాపరంపరలు మనస్సులో చెలరేగి కొంతసేపటికి సర్దుకున్నాయి. చెవులే పనిచెయ్యడం మొదలుపెట్టాయి.

"లోకం గుడ్డిది. న్యాయం అనేది యెక్కడా లేదు. అన్యాయమే చెలామణీ అవుతోంది. అదే

★ మాయలోకం ★

శ్రీమతి వేదుల విమానా క్షీదేవి

గౌరవలక్షణం. అదే బాగుపడేందుకు సాధనం" అని మా పక్క బెంచీమీద కూర్చున్న వొక పెద్దమనిషి యింకొక పెద్దమనిషితో అంటున్నాడు.

"నిజమేనండీ ! తెలివితేటాతో పనిలేదు. అంతా డబ్బుతో వుంది. ఎంతమందిని మాపినా సరే, ఎలాంటి పనులు చేసినాసరే, డబ్బుపారేస్తే అన్నీ కప్పడిపోతాయి. ఎంతటి ప్రతిభాశాలి క్రిందైనా లెఖవస్తారు. "ధనమూల మిదం జగత్" కదండీ మరి ? మొన్న మొన్న మనందరిచేత అడ్డమైన తిట్లూ తిన్నవాళ్లు యీనాడు మన అధికార్లుగా తయారై మన నెత్తిమీదికి సిద్ధమయారు. ప్రపంచమంతా తల్లక్రిందులైపోతోంది. అంతా మాయగా వుంది. వెనకటి పద్ధతులు వెనకటిలోకం కాదు" అన్నాడా రెండో ఆయన.

అంత అన్యాయం వుంటుందా ? తప్పు తప్పే. తప్పు చేసి మళ్లీ నలుగురిలో తలెత్తుకుని యెల్లా తిరుగుతారు ? ఒక్కమాట యింట్లోవాళ్లంటే తలకొట్టేసినంత బాధగా వుంటుందే ! అలాంటిది లోకంచేత తిట్లుతిని, మళ్లీ వాళ్లమీదే పెత్తనం చెయ్యడానికి రావడానికి యెంత మొండితనం వుండాలి ? బహుశః అలాంటివాళ్లు యే 'కాశీ'లోనో (యిష్టమైనవి విడిచిపెట్టాలి కనుక) మానాభిమానాలు విడిచివుంటారు. లేకపోతే వారికిమాత్రం అభిమానంకాదూ ! వ్రతభంగం అవుతుందని అవమానం భరిస్తున్నారు 'గాని ! అని అనిపించింది నాకు.

"అబ్బాయీ ! కేంద్రప్రభుత్వాన్ని విమర్శించేవాళ్లు కొందరు. రాష్ట్రప్రభుత్వాన్ని విమర్శించేవాళ్లు కొందరు. నౌఖరీచేసేచోటే తమ అధికార్లని విమర్శించేవాళ్లు కొందరు. నా చేతికిందే పని చేసే వొకాయన తప్పు చేశాడు. అందుచేత చాటుగా పిలిచి "యింకెప్పుడూ అలా అజాగ్రత్తగా వుండవద్దు" అని చెప్పాను. నేనెందుకలా అనాలీ అని ఆయనకి కోపం వచ్చింది. మా అధికార్ల దగ్గరకి వెళ్లి నామీద యెన్నో నేరాలు చెప్పాడు. వెంటనే వారు నన్ను పిలిచి "నీ పని నువ్వు చూసుకో. కావలసిందీ అక్కరలేనిదీ లేకుండా అనవసరంగా అందరి విషయాలలోనూ కలుగజేసుకుని అందరినీ అవమానపరుస్తున్నావుట. ఎవ్వరి జోలికీ వెళ్లకు. ఇలాంటి పితూరీ లింకెప్పుడూ రానివ్వకు. ఈ మాటికి క్షమించాం" అని నా తప్పు క్షమించి, నాకు వార్నింగిచ్చారు. చూడు. న్యాయాని కెక్కడైనా రోజులా ? ఈ రోజుల్లో యెంత తప్పు చేస్తే అంత పెద్దమనిషి. న్యాయంగానూ, పెద్దమనిషితరహాగానూ పోయే వాళ్లు దోషులౌతున్నారు." అన్నాడొక బోర్డుస్కూలు హెడ్‌మాస్టరు గారు మా అబ్బాయితో. ఆయన మాతోపాటే యెక్కారులెండి.

బస్సు ఆగింది. ఇద్దరు కొత్తవ్యక్తులు లోపలికి ప్రవేశించి బారెడు చుట్టలు వెలిగించి సంభాషణ కుపక్రమించారు. బస్సు మళ్లీ పరిగెడుతోంది. జనంఅంతా మాటలు మానేసి గట్టిగా మాట్లాడుతున్న వీరి మాటలు వింటున్నారు.

"ఏదీ శాశ్వతం అనుకునేందుకు వీల్లేదు. ఏ నిముసాని కేం వస్తుందో చెప్పలేం. నిన్న చూసినవాడు నేడు కనబడ్డంలేదు. అందుచేత బ్రతికి వున్నన్నాళ్లు యెప్పుడో ధ్యాన్నం చేద్దామని కూర్చోక యెప్పటికప్పుడే ధ్యానంచేసుకోవాలి" అని వేదాంతులు బోధిస్తూంటారు. ఆ మాట ముమ్మాటికీ నిజం. దేవుని మాట దేము డెరుగును. మన ప్రభుత్వమే దేవుడు. మనమే సామాన్యమానవులం. ఏ నిముషాని కేది వస్తుందో తెలియదు. వున్నవాళ్లు లేనివాళ్లవుతున్నారు. లేనివాళ్లు న్నవాళ్లవుతున్నారు. ఎంత తక్కువ అర్హత వుంటే అంత వున్నతపదవి లభిస్తోంది. ఏనాటినుండో రాచరికం అనుభవించినవారి ధనం, హక్కు, సమస్తం పోయాయి. పాపం, దానితో వారి గౌరవంకూడా తగ్గినట్టే, "ఈశ్వర సకల్పమెవ్వా రెరుంగుదురో, యేరీతి యెటులుండునో" అన్నారిందుకే" అని రాగవరసగా పాడుతూ అంటున్నాడొకఆయన.

"చాలా అన్యాయంగా వుందండీ. రైతుకి మేలు చేస్తే చెయ్యవచ్చు. కాని, భూస్వామికి భూమిమీద హక్కే లేదంటే యెంత ఘోరం ? ఒకరిని పైకి తీసుకురావాలంటే యింకొకరి నథఃపాతాళానికి త్రొక్కెయ్యమని యెక్కడుంది ? ఇద్దరికీ నష్టంగాని పద్ధతిగా చెయ్యకూడదూ ? ఒకళ్లవగానే యింకొకరు తాళం వెయ్యడమేగాని మంచీ చెడ్డాతో పని లేదు. అసలు సంగతేమిటంటే కాస్త వున్నవాళ్లంటే లోకానికి మంట. వాళ్లని ధ్వంసం చేసేదాకా తృప్తి లేదు. సామాన్యప్రజల ఆకిస్తికూడ యేం ప్రమాదం వస్తుందోనని భయపడుతున్నాం. "కంచెయే చేను మేసిన కలదె దిక్కు ?" న్యాయాన్యాయ విచక్షణగలిగి, సర్వజనసమ్మతంగా వుండవలసినవారే ప్రజల తిండి పడగొట్టడానికి చూస్తున్నారు. ఈ లక్షణాలు చూస్తే మీరు చెప్పినట్టు 'ఏది శాశ్వతం ?' అనే వూహతో యెప్పటి కప్పుడు సొమ్ము ఖర్చుపెట్టుకుని, నిలవ అనేది లేకుండా జాగ్రత్తపడడం మంచిదిగా తోస్తోంది బాబూ. దరిద్రపురోజులు వచ్చిపడ్డాయి." అన్నాడు రెండో ఆయన.

మా కారు వాయువేగ మనోవేగాలమీద పోతోంది. అంతదూరాన్నివున్న చెట్లు యిట్టే యెదటికి వచ్చి వెళ్లిపోతున్నాయి. మా పసిపిల్లని వొళ్లో కూర్చోపెట్టుకుని వెనక్కి పరిగెత్తే చెట్లను, ఎలక్ట్రిక్ స్తంభాల్ని చూపిస్తున్నాను.

మా బెంచీచివర యింకా నలుగురైదుగురు ఆడవాళ్లున్నారు. అందులో వొక ఆవిడ నలభైయేళ్లు పైబడ్డ మనిషి. ఆమె ప్రక్కఆమెకేసి తిరిగి బహుశః వారిద్దరూ వొకవూరివారే అనుకుంటా అంటోంది. "కలియుగలక్షణాలు చెప్పాడు భారతంలో. కలియుగంలో ప్రథమ పాదంలోనే (కలియుగే, ప్రథమపాదే) అన్ని లక్షణాలూ కనబడుతున్నాయి. మిగతా మూడుపాదాలు పూర్తిఅయేటప్పటికి ప్రపంచం యెల్లా వుంటుందో.

మన అవధాన్లుగారి కూతురూ, శాస్త్రుల్లుగారి కొడుకూ విడాకులిచ్చుకున్నారు. వాళ్లిద్దరికీ యేం లోపం ? ఇద్దరికీ డబ్బుంది. ఇద్దరూ చక్కనివాళ్లే. ఈడూ జోడూగా వున్నారు. మరియెందుకో యీ విడాకు లిచ్చుకోవడం ? ఒకళ్లని చూసి యింకొకళ్లు ప్రారంభిస్తున్నారు. 'పులిని చూసి నక్క వాతెట్టుకుంది' అన్న సామెతగా. ఎక్కడో దొరలు యిల్లా చేస్తారుట. ఆ భాగ్యం మనకి లేకపోయిందని నానాతంటాలూపడి ఆఖరికి యెల్లాగ అయితే యేమి బిల్లు ప్యాసుచేయించారు. ఎక్కడైనా యిలాంటి గొడవ యెరుగుదుమా ? ఇష్టం వున్నా లేకపోయినా యింట్లో పడివుండడమే కాని కోర్టులెక్కి "నాకీ కాపురం వద్దు" అని డంకామీద దెబ్బకొట్టినట్టు చెప్పేసి పండంటి కాపురాన్ని చేతులారా పాడుచేసుకోవడం యేమంత గొప్ప సంగతి ? అనాదినుండీ పతివ్రతామతల్లులని పేరుపొందిన మన హిందూదేశపు స్త్రీలకి యిలాటివారివల్ల కళంకం రాకమానదు.

"ఈమధ్య యిల్లాగే ఒక దంపతులు విడాకులిచ్చుకుందామని కోర్టుకి వెళ్లారుట. జడ్జీగారు వారిద్దరినీ వేరువేరుగా "మీ రిద్దరూ కలిసివుండడానికి అభ్యంతరం యేమిటి ?"అని అడిగారుట. ఆ పిల్లతండ్రివల్ల ఆ కాపురం పొత్తుపడడం లేదని తేలిందిట. ఆమెతండ్రిని పిలిచి "వీరి కాపురం విషయంలో యేవిధమైన జోక్యం కలిగించుకోవద్దు"అని కచ్చితంగా చెప్పేశారుట. తరువాత ఆ దంపతులతో "మీ కిద్దరికీ నిజంగా యిష్టంవుంటే నా కారుమీద అల్లా వోక షికారు వెళ్లిరండి" అన్నారుట. "సరే" వారు చిలకాగోరింకల్లా ఆ జడ్జీగారి కారుమీద ఓ 'ట్రిప్'కొట్టి చక్కావచ్చారట. చూశారా ఆ జడ్జీ యెంత తెలివైనవాడో, అనుభవశాలో ! ఇట్టే కాపురం పొత్తుపరచాడు. ఈ సంగతి యీ మధ్య పేపరులో పడింది" అంది ఆ రెండో ఆమె.

అందరూ ఆశ్చర్యంగా విన్నారు. కొందరు బుగ్గలు నొక్కుకున్నారు.


"అంత పొగరా ? రోగం బాగా కుదిరింది" అన్నారు మరికొందరు.

"వీళ్లే అన్నమాటేమిటి ? లోకం అంతా వొక్కతాటిమీద నడుస్తోంది. మంచికి మంచీ, చెడ్డకి చెడ్డా వెంటనే చూపిస్తూనే వుంటాడు భగవంతుడు. ప్రజలు నీతి, ధర్మం తప్పకుండా వున్నన్నాళ్లూ యే యిబ్బందులూ యెరుగరు. క్రమంగా ప్రజలలో అధర్మం, అవినీతి ప్రబలుతోంది. దానివల్లే యీ కరువు. ఇంత కరువు యెన్నడైనా యెరుగుదుమా ? ప్రజల తీరువల్లే పాడి, పంట తగినంత లేవు. తిండికీ, బట్టకీ కూడా కరువే వచ్చింది. మహాకరువు వచ్చిపడిందల్లాగ ? అనుకుంటూంటే "పులిమీద పుట్ర" అన్నట్టు యీ తుపాను వచ్చి నానాబీభత్సం చేసింది చూశారా ? దీన్ని ఆధారంగా చేసుకుని ప్రతీపంట తుపానుదెబ్బ తిన్నదనీ, సరుకు తగినంత లేదనీ గునుస్తూ యిదివరకే యెక్కువ అనుకుంటున్న ధరకు యింకా నాలుగురెట్లు పెంచి, వర్తకులు వెయ్యి చేతులతో డబ్బు దోచుకుంటున్నారు. "అదేమి ?" అనేనా అడిగేవారు లేరు. వాళ్ల యిష్టం. గతి లేక యెంత అంటే అంత యిచ్చి ప్రజలు కొనుక్కుంటున్నారు. అంతా మాయ, మోసంతో వుందండీ. యెప్పటికైనా యీ అన్యాయం నశించి, న్యాయం నిలుస్తుందా ?" అంటున్నాడు పొరుగూరునుండి సరుకులు కొనుక్కుని వెడుతున్న ఒక పల్లెటూరి వ్యక్తి.



విస్కాన్సిన్ విశ్వవిద్యాలయంలోని భారతీయ విద్యార్థులు ప్రధానామాత్యుని చుట్టూచేరి ప్రసంగించిన దృశ్యం. ఐ. యస్. పి.

★ వార్తా చిత్రాలు ★




చైనాలోని డెమోక్రాటిక్ పార్టీ అధ్యక్షుడు డా॥ కార్సన్ చాంగ్ ఇటీవల ప్రభుత్వ భవనం (న్యూఢిల్లీ)లో ఇండియా గవర్నరు జనరల్ శ్రీ సి. రాజగోపాలాచారిగారిని చూశారు.



28 లక్షల ఖర్చుతో నిర్మింపబోవు పశ్చిమగోదావరిజిల్లా హెడ్ క్వా హాస్పిటల్‌కు అక్టోబర్ 26 వ తేదీని, మదరాసు ప్రభుత్వ ఆరోగ్యమంత్రి టి. ఎస్. ఎస్. రాజన్ గారు శంఖుస్థాపనజేయుచున్న దృశ్యం.

ఢిల్లీలో అమెరికన్ సెనెటర్లు

వీరు నలుగురు అమెరికన్ సెనేటులోని వినియోగపు కమిటీయొక్క ప్రత్యేక ఉపసంఘానికి చెందినసభ్యులు. ఈ ఉపసంఘంవారు మధ్య, దూరప్రాచ్యాలు పర్యటిస్తూ నవంబరు 16 న న్యూఢిల్లీ చేరారు.



విలియం ఇ. జెన్నర్




థియొడోర్ ఎఫ్. గ్రీన్




హోమర్ ఫెర్గ్యుసన్



అలెన్ జె. ఎలెండర్



కామన్వెల్తు క్రికెట్ టీముకూ, భారతీయ క్రికెట్ టీముకూ ఈనెల 11 వ తేదీన జరిగిన మొదటి 'టెస్టు'.ఆటకు హాజరైన సర్దార్ పటేల్ ప్రభృతులు.



విజయవాడ రోటరీక్లబ్బు ఈ నెల 13వ తేదీ సమావేశంనాడు తీయబడిన చిత్రం. దానికి హాజరైనవారిలో రోటరీ గవ డి. ఎన్. హోసలీ, ఎస్. ఆర్. శర్మ, డా॥ చాగంటి సూర్యనారాయణమూర్తి, డా॥ ఇ. ఎం. శాస్త్రి, గారలను యిందులో క

Regd. M. No. 4479

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press. 7 Thambu Chetty St., G. T. Madras.